

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-8-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 201 పేజీలు: 8+16 వెల: 6.50



మేడారం జాతరకు రూ.150 కోట్లు 2

అఫ్గాన్ బస్సులో మంటలు.. 71 మంది దుర్మరణం 5




## ఢిల్లీ సిఎం రేఖపై దాడి

### ప్రజల ఫిర్యాదు స్వీకరిస్తుండగా ఘటన



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నవాసం లో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు బిజెపి వర్గాలు వెల్లడించాయి. 35 యేళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు >>2

## రాధాకృష్ణన్ నామినేషన్ దాఖిలు

### ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఎన్‌డిఎ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి.రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేంద్ర >>2



బుధవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు అనంతరం అభ్యర్థి రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రధాని మోడీ



# ప్రధానికైనా ఉద్వాసనే!



### అరెస్టయి, 30 రోజులు నిర్బంధంలో ఉంటే పిఎం, సిఎం, మంత్రులను తొలగించే బిల్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** దేశంలో నేరం చేస్తే ప్రధానికైనా ఉద్వాసనే జరిగేలా కేంద్ర ప్రభుత్వం బిల్లులను తీసుకొచ్చింది. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లుతో సహా మూడు బిల్లులను బుధవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. బిల్లుల కాపీలను చింపి అమిత్ షాపైకి విసిరారు. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం,సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. నేరం చేస్తే ప్రధాని, సీఎంలు, మంత్రులకు సైతం ఉద్వాసన పలికేలా కేంద్రం ఈ మూడు కీలక బిల్లులను తీసుకువచ్చింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే బిల్లులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ సవరణ బిల్లు, 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులుగా వాటిని పేర్కొన్నారు. ఈ సమయంలో అధికార విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల ఎంపీలు బిల్లు కాపీలు చింపి సభలో విసిరారు. వెల్ దగ్గరికి వెళ్లి చింపిన బిల్లు ప్రతులను టీఎంసీ ఎంపీలు విసిరారు.హోం మంత్రి అమిత్‌షా స్థానం వైపు కూడా విసిరారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో >>2

3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన అమిత్‌షా

తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షం

బిల్లు కాపీలు చించేసిన కాంగ్రెస్ సభ్యులు

# సిలికాన్ వ్యాలీని శాసించగలం



గచ్చిబౌలిలో ఇంటెగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు తదితలు

తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం

పాతబస్తీ ఓల్డ్‌సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ: సిఎం రేవంత్

గచ్చిబౌలిలో ఇంటెగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన

**గచ్చిబౌలి, ఆగస్టు 20 ప్రభాతవార్త:** నేడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయిలో మనం ఉన్నామని, అక్కడ పని చేస్తున్న మనవాళ్లు పనిచేయడం మానేస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే స్థాయికి వచ్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచమంతా 2034 నాటికి హైదరాబాద్ నగరాన్ని చూసేందుకు తరలిరావాలని, ఆ స్థాయిలో నగరాన్ని అభివ ృద్ధి చేసేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రాణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్ ఆవరణలో 3ఎకరాల పైచీలుకు విస్తీర్ణంలో, 50వేల చదరపు అడుగులతో నూతనంగా చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన >>2

2 లక్షల టన్నుల ఎరువులు తెచ్చేవారికే

# మద్దతు

ఉప రాష్ట్రపతి ఎన్నికపై కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** తెలంగాణ రాష్ట్రానికి సెప్టెంబర్ 9 లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తారో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చి చెప్పారు.బుధవారం ఆయన నందీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో 2 నెలలుగా దయనీయమైన పరిస్థితి నెలకొందని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని,రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనం వల్ల ఇలాంటి పరిస్థితి దాపురించిందనివిమర్శించారు. ఎరువుల బస్తాల కోసం రైతులు ఎన్నో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎప్పుడూ ఇలాంటి దుస్థితి రాలేదని గుర్తు చేశారు. వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి సమీక్ష చేయలేదని అన్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా పాలన సాగిస్తున్నారని, వ్యవసాయ శాఖతో ఇతర శాఖలకు సమన్వయం లేకుండా పోయిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించా రు. ఒక రైతు 3 బస్తాల యూరియా తీసుకుంటే నాన్‌బెయిలబుల్ కేసు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీకి 51 సార్లు వెళ్లిన రేవంత్ రెడ్డి ఒక్క బస్తా యూరియా కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండుపార్టీలు రైతులను మోసం చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో మీ పార్టీ స్టాండ్ ఏంటీ? అన్న ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక విషయంలో అటు ఎన్‌డీఏ, ఇటు ఇండియా >>2

జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై

# జిఎస్టీ రద్దుకు సిఫారసు

ప్రస్తుత 18 శాతం పన్నును జీరో శాతానికి తెచ్చే ప్రతిపాదన

ఢిల్లీలో సమావేశమైన రాష్ట్ర మంత్రుల బృందం కీలక నిర్ణయం

జిఎస్టీ కౌన్సిల్ సమావేశానికి హాజరైన డి.సిఎం భట్టి విక్రమార్క




బుధవారం న్యూఢిల్లీలో జిఎస్టీ సమావేశంలో పాల్గొన్న డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** దేశవ్యాప్తంగా కోట్లాది మంది బీమా పాలసీదారులకు భారీ ఊరట లభించే అవకాశం ఉంది. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని రాష్ట్ర మంత్రుల బృందం (జీవోఎం) కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన అమలైతే పాలసీల ప్రీమియంలు గణనీయంగా తగ్గనున్నాయి.పరోక్ష పన్నుల విధానంలో తీసుకురానున్న సంస్కరణలపై చర్చించేందుకు బుధవారం ఢిల్లీలో రాష్ట్ర మంత్రుల బృందం సమావేశమైంది. ఈ సమావేశం అనంతరం బీహార్ ఉప ముఖ్యమంత్రి, మంత్రుల బృందం కన్వీనర్ సామ్రాట్ చౌదరి మాట్లాడుతూ, జీవిత,ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని 18శాతం నుంచి సున్నా శాతానికి తగ్గించాలని తాము ప్రతిపాదించినట్లు వెల్లడించారు.ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.9,700 కోట్ల ఆదాయం తగ్గుతుందని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అంచనా వేశారు.బీమా ప్రీమి యంలపై జీఎస్టీ తొలగింపు ప్రయోజనాన్ని ఆయా బీమా సంస్థలు వినియోగదారులకు బదిలీ చేసేలా యంత్రాంగం ఉండాలని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. జీఎస్టీని తొలగించడం లేదా తగ్గించడంపై రాష్ట్రాలు సుముఖంగా ఉన్నాయని, ప్రయోజనం బదిలీ చేసే అంశాన్ని రాష్ట్రాలు లేవనెత్తా యని చెప్పారు. జీఎస్టీ కౌన్సిల్‌లో దీనిపై నిర్ణయం ఉంటుందని చెప్పారు.అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు జీఎస్టీలో భారీ మార్పులు తీసుకురానున్నట్లు >>2



ఆన్‌లైన్ గేమ్‌లపై

# నిషేధం

కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది.ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లకు కొంతమంది బానిస కావడం, >>2



ఎఐ సాయంతో 1,2 గంటల్లో

# శ్రీవారి దర్శనం

టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** శ్రీవారి భక్తులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనం వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. ఏఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం 1,2 గంటల్లోగా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే తిరుమలలో కొత్త క్యాంటీన్లు, శ్రీవాణి దర్శనం వేళల మార్పు, వీఐపీ దర్శన సమయం గురించి హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు.తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త వినిపించింది. తిరుమలలో ఏటికేడు భక్తుల రద్దీ పెరుగుతోంది. శ్రీనివాసుడి దర్శనం కోసం విచ్చేస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. అయితే విశేష పర్వదినాలు, ఉత్స వాలు, పండుగల సమయంలో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటోంది. దీంతో ఇలాంటి రోజులలో శ్రీవారి దర్శనానికి గంటలు గంటలు సమయం పడుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని టీటీడీ సరికొత్త ఆలోచన చేస్తోంది. దేవదేవుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో గంట నుంచి రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో బుధవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఏఐ సాయంతో భక్తులు గంట నుంచి రెండు గంటల్లోగా శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే తిరుమలలో త్వరలోనే కొత్త క్యాంటీన్లను ప్రారంభిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. టీటీడీలో పనిచేసే అన్యమత సిబ్బందిని బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాంటి వారిని స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కింద పంపించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే సిబ్బంది ఎవరైనా అన్యమత ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మరోవైపు తిరుమలలో శ్రీవాణి టికెట్ల దర్శన సమయాలు మారుస్తామన్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు.. ఉదయం శ్రీవాణి దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులు సాయంత్రానికల్లా శ్రీవారిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దళారులు, సైబర్ మోసాల కారణంగా తిరుమలకు వచ్చే >>2




సిబిఐ వలలో 'నేషనల్ హైవే'

## ప్రాజెక్టు డైరెక్టర్

రూ. 60 వేలు లంచం తీసుకొంటుండగా పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరక్టర్‌తో పాటు అతని సహాయకుడుగా వున్న ప్రైవేటు వ్యక్తిని సిబిఐ అధికారులు లంచం కేసులో బుధవారం అరెస్టు చేశారు. బీబీనగర్ వద్ద గూడూరు టోల్ ప్లాజా పక్కనే గల రెస్టారెంట్ యజమాని నుంచి 60 వేల రూపాయల లంచం తీసుకున్నందుకు వీరిద్దరిని అరెస్టు చేశారు. హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపై గూడూరు టోల్ ప్లాజాపై వాహనా ల రద్దీ తెలిసిందే. దీని పక్కనే రెస్టారెంట్ వుంది. ఈ రెస్టారెంట్‌ను కొనసాగించేందుకు జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరక్టర్ (వరంగల్ విభాగం) డైరక్టర్ గొల్ల దుర్గా ప్రసాద్ రెస్టారెంట్ యజమానిని లక్ష రూపాయలు >>2



# భద్రాద్రిలో ఉగ్రగోదావరి

బుధవారం భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

**భద్రాచలం, ప్రభాతవార్త ఆగస్టు 20:** గోదావరిమహానది మరోసారి ఉగ్రరూపం దాల్చి, నదీ తీర ప్రాంతాల ప్రజలకు భయాందోళన కలిగిస్తోంది. బుధవారం ఉదయం 8.15 గంటలకు భద్రాచలం గోదావరి 43 అడుగులు చేరుకోగానే భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పటేల్ తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.రాత్రి 10.05 గంటలకు గోదావరి నీటి మట్టం 48.1 అడుగులకు చేరుకుని 11,44,6450 క్యూసెక్కులు వరద నీరు ప్రవాహిస్తుంది. నేటి ఉదయానికి మూడవ ప్రమాద హెచ్చరికకు చేరవచ్చని అధికారులు తెలియజేశారు. గోదావరి వరదలతో భద్రాచలంలోని స్నాన ఘాట్‌లు, నీట మునిగాయి. కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి గోదావరి పరివాహక గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించారు. ఇదిలా ఉండగా >>2

రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ఏజెన్సీ ప్రాంతాల్లో వరద ముంపులో జాతీయ రహదారి

అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్



మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం లోక్‌సభలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సోనియా. చిత్రంలో స్పీకర్ ఓం బిర్లా, ప్రియాంక, రాహుల్ తదితరులు

# ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం

>> మనీలాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఇ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష లేదా రూ. కోటి వరకు జరిమానా లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్న వారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ. కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు.. ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్రనష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

# సిబిఐ వలలో 'నేషనల్ హైవే' ప్రాజెక్టు డైరెక్టర్

>> లంచం డిమాండ్ చేశాడు. అయితే అంత మొత్తం తాను ఇవ్వలేనని యజమాని చెప్పగా అడిగినంత ఇవ్వకుంటే రెస్టారెంట్‌ను తొలగించడ మో లేదా మరొకరికి ఇవ్వడమో చేస్తానని దుర్గా ప్రసాద్ హెచ్చరించాడు. చివరగా రెస్టారెం ట్ యజమాని 60 వేల రూపాయలు లంచం ఇచ్చేందుకు అంగీకరించగా దీనికి దుర్గా ప్రసాద్ కూడా అంగీకరించాడు. దీని తరువాత రెస్టారెంట్ యజమాని ఇదే విషయమై మంగళవారం హైదరాబాద్‌లోని సిబిఐ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు రంగంలో దిగిన సిబిఐ అధి కారులు పక్కాగా వ్యవహరించారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో దుర్గా ప్రసాద్ లంచాల వసూలు కోసం తాను నియ మించుకున్న ప్రైవేటు వ్యక్తి వేణు యాదవ్‌ను రెస్టారెంట్ యజమాని వద్దకు పంపి 60 వేల రూపాయలను తీసుకురావాలని చెప్పాడు. దుర్గా ప్రసాద్ చెప్పినట్లుగానే వేణు యాదవ్ రెస్టారెంట్ యజమాని వద్దకు వెళ్లి అతనిచ్చిన 60 వేల రూపాయలు తీసుకోగానే అక్కడే మాటువేసిన సిబిఐ అధికారు లు రెప్పపాటులో వేణు యాదవ్‌ను అరెస్టు చేశారు. అనంతరం అతని వద్ద నుంచి 60 వేల రూపాయల లంచం సొమ్మును జప్తు చేశారు. అతన్ని విచారించగా తన బాస్ దుర్గా ప్రసాద్ ఆదేశాల మేరకే తాను ఈ పనిచేశానని చెప్పాడు. దీని తరువాత రెస్టారెంట్‌కు సమీపంలోనే ఒకచోట వున్న దుర్గా ప్రసాద్‌ను కూడా సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. అనంతరం హైదరాబాద్, వరంగల్‌లోని దుర్గా ప్రసాద్ కార్యాలయాలు సదాశివపేట్‌లోని అతని ఇంట్లో సిబిఐ అధికారులు దాడులు చేసి పత్రాలు జప్తు చేశారు.

# భద్రాద్రిలో ఉగ్రగోదావరి

>> గోదావరి ఎగువ ప్రాంతాలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టాన్ని పర్యవేక్షి ంచారు. కాళేశ్వరం వద్ద గోదావరి 12.210 మీటర్లు చేరి ప్రమాదస్థాయి (13.460 మీటర్లు)కి దగ్గరగా ఉంది. త్రివేణి సంగమం వద్ద స్నాన ఘాట్‌లు మునిగిపోయాయి. మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. భద్రాద్రి గోదావరికి ఎగువన ఉన్న ప్రాజెక్టులు, బ్యారేజీల పరిస్థితి లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజ్‌లో 85 గేట్లన్నీ ఎత్తి ఉంచడంతో 9.02 లక్షల క్యూసెక్కులు ఇన్‌అవుట్ రికార్డు అయ్యాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ , కడెం ప్రాజెక్ట్, శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్ట్‌లు భారీ ప్రవాహాలు స్వీకరిస్తున్నాయి. గోదావరి ఉపనదులన్నీ కురిసిన వర్షాల వల్ల ఉప్పొంగుతున్నాయి.

**వరదల నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు**

వరద నియంత్రణకు ఏర్పాట్లుకు భద్రాచలం ఐటిడిఏ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 7995268352 నంబరుకు ప్రజలు సంప్రదించవచ్చు. అదేవిధంగా, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743232444, 7981219425 నంబర్లను కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి, తీర గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమైంది. అధికారుల మార్గదర్శకాల ప్రకారం ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**ముంపు ప్రాంత ప్రజల ఆందోళన**

గోదావరి పక్కన నివసిస్తున్న రైతులు, గిరిజన గ్రామాల ప్రజలు వరద ముప్పుతో భయాందోళన చెందుతున్నారు. పంటలు నీటమునిగే అవకాశం ఉండటంతో వ్యవసాయదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక గ్రామాలు రాకపోకలు నిలిచిపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో గత వరదల పరిస్థితులను గుర్తు చేసుకుని ఆందోళన చెందుతున్నారు. భద్రాచలంలో గోదావరి 1986, 1996, 2006, 2013, 2022ల్లో పెద్ద ఎత్తున ఉగ్రరూపం దాల్చి భారీ నష్టాలు కలిగించింది. ఇప్పుడు మళ్లీ గోదావరి అదే భయాందోళనను మిగులుస్తోంది. అధికారులు ప్రజలను నదీ తీరానికి దగ్గరగా వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితుల్లో సహాయక కేంద్రాలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

**వరద పరిస్థితులపై మంత్రి పొంగులేటి సమీక్ష**

భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు ఎవరూ అత్యవసరమైతే తప్ప నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను కాలనీ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

# ఢిల్లీ సిఎం రేఖపై దాడి

>> తెలుస్తోంది. ఈ ఘటనను బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

**అసలేం జరిగిందంటే..**

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా తన అధికారిక నివాసంలో ప్రతివారం 'జన్ సున్‌వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఊహించని పరిణామంతో ముఖ్యమంత్రి షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఆమెను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి. ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రజల కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ముఖ్యమంత్రిపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది ప్రత్యర్థుల కుట్ర కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనిలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత అతిశీ కూడా ఈ ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటులేదన్నారు. నిందితులపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారని భావిస్తున్నామన్నారు. ఈ దాడిని ఖండించిన ఢిల్లీ కాంగ్రెస్.. దురదృష్టకమైన ఘటన అని పేర్కొంది. ముఖ్యమంత్రికే రక్షణ లేకుంటే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవందర్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

# శ్రీవారి దర్శనం

>> కొంతమంది భక్తులు ఇబ్బందులు పడుతున్నారని.. ఇలాంటి వాటిని అరికట్టేం దుకు తిరుమలలో సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుమలలో వీఐపీ దర్శనాలను ఉదయం 8 నుంచి 8.30 గంటలకు ముగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

## వారం - వర్జ్యం

21-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
త్రయోదశి మ.12.48
పుష్యమి రా.12.11
వర్జ్యం : మ1.03-2.39
దు.ఉ.10.05-10.55, 2) మ.3.08-3.58
శుభసమయం: ఉ6.30-8.30
రాహుకాలం - మ.1.30-3.00

## వారాఫలం

**మేషం :** బంధువుల నుండి వచ్చిన ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**వృషభం :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**మిథునం:** ధైర్యం, పట్టుదలతో ముందుకు సాగుతారు. రుణాలు తీరుస్తారు.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహన సౌఖ్యం.

**సింహం:** భూమి, ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** ఉద్యోగులకు హోదాలు కలుగుతాయి. కళలు, రాజకీయ రంగాల వారికి అన్ని విధాలా అనుకూలిస్తాయి.

**తుల :** చిన్న చిన్న నిర్మాణపనులకు పన్నులు కట్టడానికి ధనం ఖర్చుచేయవలసి వస్తుంది.

**వృశ్చికం:** వృత్తి వ్యాపారంలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. ధనలాభం.

**ధనుస్సు:** సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు పాటించండి. సోదరుల కలయిక.

**మకరం:** మీ వెంటే ఉంటూ మీ వైరి వర్గానికి సహాయసహకారాలు అందించే వారిని గుర్తిస్తారు.

**కుంభం:** కీలక వ్యావహారాలలో గోప్యతను వహించి లాభపడతారు. వస్తులాభం.

**మీనం :** దగ్గరి బంధువులతో చర్చించి ఒక శుభకార్యాన్ని ఖరారుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రధానికైనా ఉద్వాసనే!

>> అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని స్పష్టంచేశారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదని హితవు పలికారు. ప్రతిపాదిత బిల్లులను అమిత్ షా, సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫారసు చేశారు. ఈ బిల్లులపై విపక్ష సభ్యులకు అభ్యంతరాలుంటే జేపీసీకి వెల్లడించాలని సూచించారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల నిరసనలు తెలిపాయి. ఈ గందరగోళం మధ్యలోనే అమిత్ షా మూడు బిల్లుల కోసం ప్రవేశపెట్టిన తీర్మాణానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో విపక్షాలు వెల్‌లోకి దూసుకురాగా, సభ వాయిదా పడింది. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనలు చేశారు. ఇక ఈ బిల్లులు ప్రకారం, ఐదేళ్ల జైలు శిక్ష పడే కేసుల్లో వరుసగా 30 రోజులు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉంటే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు 31వ రోజున తమ పదవిని కోల్పోతారు. ఒకవేళ ఎవరైనా మంత్రి పదవిలో ఉండి అరెస్టైతే వారిని తొలిగించేందుకు 30 రోజుల్లోపు రాష్ట్రపతికి ప్రధాని సిఫారసు చేయకపోయినా 31వ రోజు సదరు మంత్రి పదవిని కోల్పోతారు. ఒక వేళ ప్రధాని 30 రోజుల పాటు అరెస్టైతే ఆయన 30 రోజుల్లోపు రాజీనామా చేయకున్నా 31వ రోజున పదవి కోల్పోతారు.

ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లుపై సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. రాజకీయాల్లో నైతిక విలువలను పునరుద్ధరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక బిల్లు తెచ్చిందని స్పష్టం చేశారు. అరెస్ట్ అయి జైల్లో ఉన్న వ్యక్తులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో కొనసాగకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. స్పీకర్ అనుమతితో సభ ముందు ఈ బిల్లులను ఉంచినట్లు ఆయన తెలిపారు.

**బిల్లుల్లోని ప్రధాన నిబంధనలు ఇవే: అమిత్ షా**

**జైల్లో ఉంటే పదవిలో కొనసాగలేరు**

ఏదైనా కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న వ్యక్తి.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిగా గానీ, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రిగా గానీ తన విధులను నిర్వర్తించలేరు. వారు తమ పదవిలో కొనసాగడాన్ని ఈ బిల్లులు పూర్తిగా నిరోధిస్తాయి.

**30 రోజుల గడువు**

అరెస్టయిన రాజకీయ నాయకుడు 30 రోజుల్లోగా బెయిల్ పొందడంలో విఫలమైతే, 31వ రోజున వారిని పదవి నుంచి తప్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి వారిని తొలగించకపోతే, చట్టప్రకారం వారు ఆ పదవిలో కొనసాగే అర్హతను వాటంతట అవే కోల్పోతారు. అయితే, న్యాయ ప్రక్రియ ద్వారా బెయిల్ పొందిన తర్వాత తిరిగి వారిని ఆ పదవుల్లో నియమించేందుకు అవకాశం ఉంటుంది.

నైతిక విలువల పరిరక్షణే లక్ష్యం రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో, నేతలు అరెస్ట్ అయిన తర్వాత కూడా నైతిక బాధ్యతతో రాజీనామా చేయరని బహుశా మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో కొందరు ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్ట్ అయినా రాజీనామా చేయకుండా జైలు నుంచే ప్రభుత్వాలను నడుపుతున్న దిగ్భ్రాంతికరమైన సంఘటనలు దేశం చూసిందని ఆయన గుర్తుచేశారు. ఈ జాడ్యంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను, రాజకీయాల్లో దిగజారుతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లులను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా, ఒక మంత్రి, ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం సరైనదేనా? అనే విషయాన్ని దేశ ప్రజలు తేల్చుకోవాలని అమిత్ షా అన్నారు.


## తెలంగాణ సిఎస్ కార్యాలయానికి ఆఫ్రికన్ గ్రే చిలుక రాక



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** తెలంగాణ సచివాలయంలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కార్యాలయంలోకి అనుకోని అతిథి వచ్చింది. అరుదైన రకానికి చెందిన ఓ చిలుక అకస్మాత్తుగా సిఎస్ ఛాంబర్‌లోకి వచ్చి ఓ డెస్క్‌పై వాలింది. చల్లని వాతావరణం, వర్షాల కారణంగా ఈ చిలుక ఇలా ఇక్కడికి వచ్చి ఉండొచ్చని సిఎస్ పేషీ అధికారులు భావిస్తున్నారు. కాగా, తమ ఆఫీస్‌కు విచ్చేసిన ఈ అరుదైన చిలుకను కొద్దిసేపు విశ్రాంతి తీసుకొనిచ్చారు. ఆపై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది దీన్ని ఆఫ్రికన్ గ్రే చిలుకగా గుర్తించారు. అనంతరం అరుదైన పక్షిని తమ వెంట తీసుకెళ్లారు.

# 2 లక్షల టన్నుల ఎరువులు తెచ్చేవారికే మద్దతు

>> తమ తమ అ అభ్యర్థులన్ని ప్రకటించాయి. కానీ, బీఆర్ఎస్ అనేది సర్వస్వతంత్రమైన పార్టీ. మాకు ఢిల్లీలో ఎవరూ బాస్‌లు లేరు. ఏ పార్టీ మా బాస్ కాదు. మా బాస్‌లు ఎవరైనా ఉన్నారంటే.. తెలంగాణ ప్రజలే తప్ప.. మాకు ఢిల్లీలో ఆజ్ఞాపించే, ఆదేశించేవారు ఎవరూ లేరు. మా పార్టీని ఇప్పటి వరకు సంప్రదించలేదు. ఈ కూటమి, ఆ కూటమి ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదు, మమ్మల్ని అడగలేదు. ఏం ఒక పార్టీగా కేవలం మీడియాలో చూసిందే తప్ప ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతుందని.. తమని సంప్రదించింది లేదు. ఇంకా టైమ్ ఉంది. సెప్టెంబర్ 9న ఎన్నిక కాబట్టి.. కూర్చొని ఆలోచించి.. ఎన్నికల తేదీ నాటికి మా వైఖరిని ప్రకటిస్తాం. ఒకటి మాత్రం గుర్తు చేస్తున్నా. మేం ఎన్‌డీఏ కూటమిలో, ఇండియా కూటమిలో లేము. ఇద్దరు అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు చేయాలనే విషయంలో ఢిల్లీ నుంచి ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ ఒత్తిడికి తలొగ్గాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా. ప్రయోజనాలకు అనుగుణంగా ఏ నిర్ణయమైనా తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అనే చిల్లర పార్టీ, థర్డ్ క్లాస్ పార్టీ ఇవాళ రాష్ట్రంలో ప్రజలను ఎంత అరిగోస పుచ్చుకుంటున్నదో రాష్ట్ర ప్రజలకు తెలుసు. అలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి.. థర్డ్ క్లాస్ పార్టీ పెట్టిన అభ్యర్థిని మేం సమర్థిస్తామని మీరెలా అనుకుంటారు? అని ప్రశ్నించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో డ్రామా. నిన్న మొన్నటి వరకు ఇదే రేవంత్‌రెడ్డి ఏమన్నడు ? బీసీల విషయంలో మా పార్టీ చిత్తశుద్ధితో ఉన్నది. బలహీన వర్గాల విషయంలో ఢిల్లీ వరకు కొట్లాడుతాం.. అవసరమైతే అంతరిక్షం వరకైనా కొట్లాడుతం అన్నడు. మరి బీసీని అభ్యర్థిగా ఎందుకు పెట్టలేదు. అంత ప్రేమ ఉన్నప్పుడు బీసీ అభ్యర్థిని పెట్టలేదు. తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థి దొరకలేదా? కంచ ఐలయ్యను పెట్టాల్సింది అన్నారు. ఆ ఇద్దరు అభ్యర్థులను సీరియస్‌గా తీసుకోవాల్సిన ఆలోచన ఉంటుందని వ్యక్తిగతంగా నేను అనుకోను. కానీ, నా అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదు. పార్టీగా కూర్చొని ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర కమిటీ.. అవసరమైతే కేసీఆర్‌తో అభిప్రాయాలు చెప్పి పార్టీగా ఒక నిర్ణయం తీసుకుంటాం. వ్యక్తిగతంగా మాత్రం కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. రెండు తెలంగాణకు పనికివచ్చే పార్టీలు కాదు. రెండు ఢిల్లీ పార్టీలే, వాటిని పట్టించుకోవాల్సిన, వాటి రాజకీయం కోసం ఆలోచించాల్సిన అవసరం లేదనేది వ్యక్తిగతంగా నా అభిప్రాయం అన్నారు.



బుధవారం జస్టిస్ సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఖర్గే. చిత్రంలో సోనియా, రాహుల్, పవార్ తదితరులు

# రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

>> హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, జాతీయ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వంటి అగ్రనేతలు ఆయన వెంట ఉన్నారు. కూటమిలోని కీలక నేతలంతా హాజరుకావడంతో ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోకసభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా ఆయన ఎన్నిక ఏకపక్షంగానే జరగనుందని అంచనా వేస్తున్నారు. కాగా ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించిన విషయం తెలిసిందే.

# సిలికాన్ వ్యాలీని శాసించగలం

>> చేశారు. తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటి శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులతో కలిసి ఈ కార్య క్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర అభివ ృద్ధితో పాటు నగర విస్తరణ జరుగాలన్నారు. హైదరాబాద్ నగరం విస్తరించాలంటే త్రిపుల్ ఆర్, ఎలివేటెడ్ కారిడార్‌లు అందుబాటులోకి రావాలని, మెట్రో విస్తరణ చేపట్టాలని, మూసి సుందరీకరణ చేపట్టి, మూసి పరివాహకంలో నైట్ మార్కెట్‌ను అభివ ృద్ధి చేయాలన్నారు. దీంతో పాటు నగరంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను అభివ ృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. నగరం ఎంత అభివ ృద్ధి చెందుతున్నా ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మారడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం 15వేల కోట్ల ఆధాయాన్ని ఆర్జించి పెట్టే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సమస్యలకు నెలవుగా మారాయన్నారు. దీన్ని ద ృష్టిలో ఉంచుకొని ఔటర్ రింగురోడ్డు లోపల కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇంటిగ్రేటెడ్ భవనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరం చారిత్రాత్మక నగరమని, అంతర్జాతీయ స్థాయిలో నగరం గుర్తింపు పొందేందుకు అనాటి కులీకుతుబ్‌షా నుంచి గత ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలు ఎంతో క ృషి చేశారన్నారు. హైదరాబాద్ నగరానికి బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పోటీ కాదని, టోక్యో, న్యూయార్క్ వంటి నగరాలతో పోటీ పడుతుందన్నారు. ఐటిలో ఎంతగా అభివ ృద్ధి చెందుతున్నా నేటికి నగరంలో మౌలిక సదుపాయాల సమస్యలు ఉన్నాయని, చెత్త పేరుకుపోయి, చినుకు పడిందంటే నీళ్లు నిలిచిపోతునా న్నయన్నారు. దీన్ని ద ృష్టిలో ఉంచుకొని మూసి ప్రక్షాళన, సుందరీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, కానీ కొంతమందికి ఇది ఇష్టం లేదన్నారు. నాడు హైటెక్‌సిటీ నిర్మాణాన్ని సైతం కొంతమంది అవహేళన చేశారన్నారు. బిజెపిపాలిత రాష్ట్రాల్లో నదుల సుందరీకరణ చేపట్టారని, కానీ మూసి ప్రక్షాళనను అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు, శాసనమండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంపికలో
# రేవంత్ కీలక పాత్ర
### నేటి ఉదయం ఢిల్లీకి వెళ్లనున్న సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అనతి కాలంలోనే దేశ రాజకీయాల్లోకి దూసుకెళుతున్నారు. ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ సైతం ఒక దశలో శభాష్ అంటూ సిఎం రేవంత్‌ను ప్రశంసించారు. మొన్నటి వరకూ బిసి రిజర్వేషన్ల బిల్లు, తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి పదవికి ఇండియా కూటమి అభ్యర్థి కావడం గమనార్హం. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సంకల్పాన్ని చూసి రాహుల్ ముగ్ధుడయ్యారు. రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపించడమే కాకుండా ఆ తర్వాత మంత్రివర్గం ముసాయిదా ఆర్డినెన్స్‌ను గవర్నర్ ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపించారు. అంతేకాకుండా బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయడం, దీనికి ప్రత్యేక రైలు ద్వారా కార్యకర్తలను తీసుకుని రావడం పట్ల కూడా అధిష్టానం సంతోషంగా ఉందని తెలిసింది. ఇదిలా ఉండగా, ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలోనూ రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిసింది. ఇటీవల ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్ళినప్పుడు న్యాయకోవిధుడైన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పోటీకి పెడితే బాగుంటుందని అధిష్టానం దృష్టికి తెచ్చినట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు నుంచి రాధాకృష్ణన్ ఎన్డీయే అభ్యర్థిగా ఉంటే తెలంగాణ నుంచి ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పోటీకి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించిన అభ్యర్థి పట్ల పార్టీ అధిష్టానం సానుకూలంగా స్పందించింది. దీంతో ముఖ్యమంత్రి సోమవారం జస్టిస్ సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్ళి చర్చలుజరిపారు. ఈ మేరకు మంగళవారం జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. గురువారం జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ముఖ్యమంత్రి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి పయనమవుతారని సిఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# మేడారం జాతరకు రూ.150 కోట్లు

**హైదరాబాద్,ఆగస్టు20,ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల ఆధ్యాత్మిక కుంభమేళాగా పిలిచే ఈ మహోత్సవం విజయవంతంగా సాగేందుకు, మేడారంలో శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మేడారం మహా జాతర ఎన్నడూ లేని రీతిలో వైభవోపేతంగా జరగనుంది.

నిధులు విడుదల పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన నిధుల పట్ల సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ లకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

# జిఎస్టీ రద్దుకు సిఫారసు

>> ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ సంస్కరణలను ప్రతిపాదిస్తున్నారు. మంత్రుల బృందం చేసిన ఈ సిఫార్సులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశం సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో దీపావళికి ముందే జరిగే అవకాశం ఉంది. కాగా, జీవిత బీమా పన్ను మినహాయింపు ప్రజలకు చేరేలా విధానాన్ని రూపొందించాలనీ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జీవిత, ఆరోగ్య బీమా సేవలపై జీఎస్టీ తగ్గింపు లేదా మినహాయింపు అంశాన్ని పరిశీలించి సిఫార్సులు చేయడానికి జీఎస్టీ కౌన్సిల్ రాష్ట్ర మంత్రుల బృందాన్ని (జిఒఎం) ఏర్పాటు చేసింది. ఇందులో బీహార్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, గోవా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో వ్యక్తిగత జీవన బీమా పాలసీలు, వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలు, వాటికి సంబంధించిన రీ ఇన్సూరెన్స్ పై పన్ను మినహాయింపు ఇవ్వడంపై విస్తృతంగా చర్చ జరిగింది. ప్రజలకు నిజంగా ప్రయోజనం చేకూరినప్పుడే ఈ చర్య లక్ష్యాన్ని చేరుకుంటుందని, అయినప్పటికీ రాష్ట్రాలకు కొంత మేర ఆదాయం నష్టం వాటిల్లి, అది ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించదగిన నిధులు తగ్గిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఇప్పటికే 95 లక్షల కుటుంబాలకు బీమా సేవలు అందజేస్తోందని భట్టి సమావేశంలో తెలిపారు.

నిజామాబాద్‌లో ఏటిఎం చోరీకి దొంగల యత్నం

## గ్యాస్ కట్టర్లతో మిషన్ ధ్వంసం, రూ.5 లక్షల నోట్లు దగ్ధం

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో ఏటిఎంలపై దొంగల దాడులు ఆగడం లేదు. జిల్లా కేంద్రంలో గల ఎస్‌బిఐ ఏటిఎం పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఐదుగురు దోపిడీ దొంగలు దాడికి దిగారు. మొదట ఐనుపరాడ్లతో ఏటిఎం మిషిన్‌ను ధ్వంసం చేసేం దుకు యత్నించగా కదరక పోవడంతో గ్యాస్ కట్టర్ల సహాయంతో కోశారు. ఈ క్రమంలో ఏటిఎం యంత్రంలో మంటలు వ్యాపించి అందులోని ఐదు లక్షల రూపాయల నగదు కాలిపోయింది. ఇదే సమయంలో ఆ మార్గంలో పెట్రోలింగ్ పోలీసులు వాహనంలో రావడంతో దోపిడీ దొంగలు ఒక్కసారిగా పారిపో యారు. ఏటిఎంలో మంటలు రావడాన్ని గమనించిన పెట్రోలింగ్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేశారు. దీంతో అందులో మిగిలివున్న 20 లక్షల రూపాయలు భద్రంగా బయటపడ్డాయి. వీటిని పోలీసులు బ్యాంకు అధికారులకు అప్పగించారు. ఇదే సమయంలో పారిపోయిన దోపిడి దొంగలను పోలీసులు వెంటాడినా ప్రయోజనం లేకుండా పోయింది. దుండగులు తమ వచ్చిన వ్యాన్‌ను పా ల్యాల్లో వదిలేసి వీక్లో పారిపోయారు. సిసిటివి పుటేజిల ఆధారంగా దొంగల కోసం పోలీసులు గాలింపు చేబట్టారు. దొంగలు మహారాష్ట్రకు చెందిన వారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంతకు ముందు నిజామాబాద్ పట్టణంలో పలుమార్లు ఏటిఎంలపై దొంగలు దాడిచేసి నగదును లూటీ చేయడం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న దర్శకుడు ఎన్.శంకర్ తదితరులు

## తెలంగాణలో సినిమా పాలసీని రూపొందించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 20,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం సినిమా పాలసీని తక్షణమే రూపొందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో తెలంగాణ సినిమా వేదిక (టిసివి) ఆధ్వరనయంలో "సినిమా కార్మికుల సమె ఆంధ్ర, తెలంగాణ సినిమా విభజన" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రముఖ దర్శకులు ఎన్.శంకర్, ప్రొఫెసర్ నందిని సిద్ధారెడ్డి, చల్ల శ్రీనివాస్, పి కుల్జా రెడ్డి, సినిమా ఆర్టిస్ట్ భూక్యా బాల్, సినీ నటులు కార్తీక్ రెడ్డి తది తర ప్రముఖులు హాజరై మాట్లాడారు. సినిమా అభివృద్ధికి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చిన రాఘవేంద్ర, పద్మాలయ ఆనంద్, రామానాయుడు స్టూడియో, ఎన్.బి.కె ఎస్టేట్, గోల్కొండ క్రాస్ రోడ్డు ఎన్టీఆర్ ఆర్టికల్చర్ స్టూడియోను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, తెలంగాణ సినిమారంగానికి 50శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. వంద ఎకరాలలో ప్రొఫెసర్ జయశంకర్ ఫిలిం యాక్టింగ్ స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ బాష, యాస సంస్కృతిలో వచ్చే సినిమాలకు 50శాతం సబ్సిడీని అందజేయాలని, ప్రభుత్వమే బ్యాంకు గ్యారం టీలను ఇప్పించి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో థియేటర్ల సిండికేట్ విధానాన్ని ప్రభుత్వం ఆరికట్టాలని కోరారు. ఆంధ్ర సినిమాలకు ఇచ్చిన గద్దర్ ఫిలిం అవార్డులను ప్రభుత్వం రద్దు చేసి, తెలంగాణ వారికి ఇవ్వాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షలు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు లారా, కార్యదర్శి మోహన్ బైరాగి , షేకు షా వలి, ఐఎన్టిటివి అంజలికుమారి, జోగిరాల, పిఐ డబ్ల్యూ సునీత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు ఆయిల్ పామ్ పరిశోధన అవసరం లేదు

### సర్కార్ ప్రతిపాదన తిరస్కరించిన కేంద్రం

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రత్యేకంగా ఆయిల్‌పాం పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కేంద్రం అంగీకరించలేదు. రాష్ట్రంలో ఆయిల్ ఫాం పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే దీన్ని కేంద్రవ్యవసాయ మంత్రిత్వ శాఖ త్రోసిపుచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్‌చౌదరి స్పష్టం చేశారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ (ఐఐవోపీఆర్) సంస్థ దేశ వ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణ రైతులకు అవసరమైన సహాయాన్ని అందిస్తోందని చెప్పారు. అందువల్ల మరో ఆయిల్ ఫాం కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అయితే ఇదేసమయంలో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్స రంలో తెలంగాణలో 50 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి కేంద్రం సహకరిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## సింగరేణికి గోల్డ్ అన్వేషణ లైసెన్స్: సిఎండి బలరాం

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఖనిజాల అన్వేషణలో భాగంగా సింగరేణి బంగారు ఖనిజం అన్వేషణకు సంబంధించిన లైసెన్స్ లభించింది. కర్ణాటకలోని దేవ దుర్గ్ లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్లైన్ వేలంలో 37.75 శాతం రాయల్టీని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్1 బిడ్డర్‌గా నిలిచినట్లు ఆ సంస్థ సిఎండి ఎన్. బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామన్నారు. వివిధ రకాల అన్వేషణల అనంతరం తుది ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. అనంతరం కేంద్రం ఈ గనులను మైనింగ్ కోసం వేలంలో వేస్తుందని, అందులోనూ తమ సంస్థ దక్కించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ అన్వేషణ కోసం సుమారు రూ.90 కోట్ల వ్యయం అవుతుండగా, అందులో రూ.20 కోట్లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా చెల్లిస్తుందని పేర్కొన్నారు.

## రెడ్‌కో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శరత్

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ రెడ్‌కో) చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఎ శరత్‌ను బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ రెడ్‌హిల్స్ లోని రెడ్‌కో కార్యాలయంలో బుధవారం పదవీ బాధ్యలను చేపట్టారు. కాగా శరత్‌ను రెడ్‌కో ఛైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సీఎస్ కుడ్లిగి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. శరత్ రెండేండ్ల పాటు టీజీ రెడ్‌కో చైర్మన్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కాగా శరత్ జూలై 31న పదవీ విమరణ పొందారు. అంతలోనే ప్రభుత్వం ఆయనను రెడ్‌కో చైర్మన్‌గా నియమించింది.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: హారీష్ హామీ

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో)లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వీలైనంత త్వరితగతిన సామరస్యంగా పరిష్కరిస్తామని ఆ సంస్థ సిఎండి డాక్టర్ ఎస్ హరీష్ హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని జెన్కో కార్యాల యంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బిక్కి వెంకటయ్య, ఇతర సభ్యులతో కలిసి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉద్యోగులకు సంబంధించి రిజర్వేషన్ రూల్ (ఆర్ఒఆర్), రోస్టర్ పాయింట్లు, బ్యాక్‌లాగ్ ఖాళీల అమలుపై కమిషన్‌కు వాస్తవ పరిస్థితిని వివరించారు. ఎస్సీలు, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నటు వంటి సమస్యలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల ఫిర్యాదులను పరిష్కరించడానికి నెలవారీ సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నారు. కాగా డైరక్ట్ రిక్రూట్‌మెంట్, ప్రమోషన్లలో రిజర్వేషన్ రూల్ అమలు, ఇతర సంబంధిత అంశాలలో జెన్కో అధికారులు చేసినకృషి, ప్రయత్నాలను కమిషన్ ప్రశంసించింది. అసోసియేషన్ ప్రతి నిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కష్టపడి పనిచేసి సంస్థ లక్ష్యాలను సాధించాలని సూచించింది.

# వర్షంతో దెబ్బతిన్న రోడ్లు,వంతెనలకు శాశ్వత మరమ్మతులు

రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వేగవంతం

కల్వర్టులు,బ్రిడ్జిలు,కోతకు గురైన రోడ్ల వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి

ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడండి

రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్న రోడ్ల వివరాలపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆరా

**హైదరాబాద్ , ఆగస్టు 20,ప్రభాతవార్త:** వర్షంతో దెబ్బతిన్న రోడ్లు వంతెనలకు శాశ్వత మరమ్మ తులకు ప్రతిపాదించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్న రోడ్ల వివరాలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆరా తీయగా ఇంజనీర్లు వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్ల తాత్కాలిక పునరుద్దరణకు రూ.46కోట్లు, శాశ్వత పునరుద్దరణకు రూ.984 కోట్లు అవు తుందని మంత్రికి వివరించారు .బుధవారం నాడు ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికా న్ఫరెన్స్ నిర్వహించారు.కాజ్ వే లు,కల్వర్టులు, బ్రిడ్జిలు,కోతకు గురైన రోడ్ల వివరాలు మంత్రి అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సం దర్బంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.పాడైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా స్టేట్ రోడ్స్ సి.ఈ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24గంటలు మానిట రింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి గత రివ్యూలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని,24 గంటలు అలెర్ట్ గా ఉంటున్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళ్ళొద్దన్న ఆదేశాలు పాటిస్తూ..ప్రతి ఆర్ అండ్ బి అధికారి నిబద్ధతతో పనిచేశారని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలో 739 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని,అందులో 854 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 25 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 5 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 310 చోట్లలో కాజ్ వే లు,కల్వర్టులు వరద ప్రవాహం ఉంటే అందులో 228 దారి మళ్లింపు చేసినట్లు పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 232 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 175చోట్ల క్లియర్ చేశామని, మిగతా చోట్ల వేగంగా క్లియర్ చేస్తున్నామని అన్నారు.మొత్తంగా 200 చోట్ల లో రోడ్లు, కాజ్ వే,మైనర్ బ్రిడ్జి లు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక పునరు ద్ధరణకు 46 కోట్లు వరకు ఖర్చు అవుతుం దని, శాశ్వత పునరుద్ధరణ కోసం 984 కోట్లు అవస రమవుతాయని అంచనా వేసినట్లు వివరించారు. రోడ్ల డ్యామేజీ, ప్రజల రాకపోకలకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా,పలు దినపత్రికల్లో వార్తలు చూశానని వాటి క్షేత్ర స్థాయి పరిస్థితి ఏంటని మంత్రి ఆరా తీశారు. వెంటనే ఆ ప్రాంతాల్లో రీ స్టోర్ చేసి ట్రాఫిక్ క్లియరెన్స్ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్టేట్ ఎన్ హెచ్ రోడ్ల కు సంబంధించిన వివరాలు ఇంచార్జి ఈఎన్సి జయ భారతి,ఆర్వోబి,ఆర్ యు బి ల వద్ద పరిస్థితిని సి.ఈ రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువ చ్చారు.ఇప్పటి వరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పని తీరును అభినందించిన మంత్రి, అదేస్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని వారికి చెప్పారు.

## నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ లిస్ట్ విడుదల

26 నుంచి సెప్టెంబర్ 2 వరకు అభ్యంతరాల స్వీకరణ

కేవలం ఆన్‌లైన్‌లోనే అభ్యంతరాల స్వీకరణ

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్) పోస్టులకి సంబంధించిన ప్రొవిజనల్ సెలెక్టెడ్ లిస్ట్‌ను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టిజిఎంహెచ్ఎస్ఆర్‌బి) బుధవారం విడుదల చేసింది.ప్రతి అభ్యర్థి వివరాలను, ఎగ్జామ్‌లో వచ్చిన మార్కులను, వెయిటేజ్ ద్వారా పొందిన మార్కులను లిస్ట్‌లో పొందుపర్చినట్టు బోర్డు ప్రకటనలో పేర్కొంది. ప్రతి అభ్యర్థి తాము పొందిన మార్కులు, ఇతర అంశాలను సరి చూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 2 లోపల ఆన్‌లైన్‌లో తెలియపరచాలని రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ ప్రకటనలో సూచించారు. అభ్యంతరాలను నమోదుకు ఈ నెల 26 నుంచి బోర్డు వెబ్‌సైట్‌లో సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2322 నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్)పోస్టుల భర్తీ కి గతేడాది నోటిఫికేషన్ నంబర్ 4-2024ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకి గత ఏడాది నవంబర్ 23న పరీక్షను నిర్వహించగా 40,243 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక కీని గతేడాది నవంబర్ 16న విడుదల చేశారు. ఈ ఏడాది మే 5న ఫైనల్‌కీతోపాటు ఫలితాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో అలసత్వం లేకుండా చూడాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచిం చారు. బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నగరంలో నిర్వహించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు నియోజక వర్గ ఇంఛార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి అజెండాగా అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు ఇందిరమ్మ ఇళ్లు రహదారులు సాగునీటి ప్రాజె క్టులు విద్య వైద్య రంగాల్లో జరుగుతున్న అబివృద్ధి కార్యక్రమాల పురోగతి పై చర్చించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైజింగ్ తెలం గాణ లక్ష్యంగా సాగుతున్న పాలనలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్‌లు నిబద్ధతతో నిజాయితీగా పని చేయాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై రైతు భరోసా రైతు రుణమాఫిపై బిఆర్ఎస్ బిజెపి నేతలు చేస్తున్న అసత్య ప్రచారం క్షేత్ర స్థాయిలో తిప్పి కొట్టాలని మంత్రి తుమ్మల తెలిపారు. సన్నబియ్యం పథకం మహిళలకు ఉచిత ఆర్టిసి బస్సు ప్రయాణం రైతు భరోసా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రభుత్వంపై ప్రజానీకం విశ్వాసంగా ఉన్నారని మంత్రి తుమ్మల తెలిపారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు రహదారులు నిర్మాణంలో ఫోకస్ పెట్టాలని అన్ని వర్గాల వారికి పార్టీలకు అతీతంగా ప్రజా పాలనలో పారదర్శకంగా ఉండాలని మంత్రి తుమ్మల తెలిపారు. పత్తి వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతాంగం ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని అభివృద్ధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తనదైన ముద్ర వేయాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రభుత్వ కార్యక్రమాల తో పాటు పార్టీ బలోపేతం పై ప్రధాన దృష్టి పెట్టాలని, గత ప్రభుత్వ అరాచక అవినీతి కోటలు బద్దలు కొట్టి కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం చేయాలని బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఎలా తెలంగాణ అభివృద్ధికి అడ్డ పడుతు న్నారనే విషయాలపై పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

# పూర్ణాహుతితో ముగిసిన సాంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం

**తిరుమల,ఆగస్టు 20ప్రభాత వార్తప్రతి నిధి:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందు భక్తులు ఐశ్వర్యం, ఆయురా రోగ్యం, సంపదలు కాంక్షిస్తూ చేపట్టిన సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం మధ్యాహ్నం పూర్ణాహుతితో శాస్రో క్తంగా ముగిసింది. తిరుమ లలో ధర్మగిరి



శ్రీవేంకటేశ్వర వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహించిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగంలో నాలుగు రోజులుగా 32మంది వేదపండితులు పాల్గొని వేదపారాయణం, సుందరకాండపారాయణం తదితర వైదిక క్రతువులు జరిపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టిటిడి నిర్ణయం తీసుకుందని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. త్వరలోనే ఈ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహాయాగం కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు.పూర్ణాహుతిలో టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యం అవధాని, అర్చకులు. వేదపండితులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల రాస్తారోకో

### అధికార పార్టీ నాయకులకే విక్రయిస్తున్నారని ధ్వజం



**ఖానాపురం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మండలం లోని బుదరావుపేట గ్రామంలో దాదాపు మూడు గంటల పాటు రైతులు యూరియా కోసం నర్సంపేట మహబూబాబాద్ నేషనల్ హైవే 365 పై ధర్నా చేపట్టారు. ఉదయం 3గంటల నుంచి యూరియా కోసం లైన్లో నిలబడిన రైతులకు యూరియా అయిపోయిందని అధికారులు చెప్పడంతో ఆగ్రహంతో రైతులు జాతీయ రహధారిపై ధర్నాను నిర్వహించారు. రైతులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించి వారికి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెల్లవారు జామునుండే రైతులు యూరియా కోసం లైన్లో నిలబడి సొమ్మసిల్లి పడిపోతున్నా కూడా వారిని కనీసం పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని అన్నారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించని పరిస్థితిలో ప్రభుత్వం ఉందంటే ఇక వీరు రాష్ట్రాన్ని ఏం పాలిస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లైన్లో నిలబడకపోయినా కూడా వారికి యూరియా ఎక్కడి నుండి వస్తుందని ప్రశ్నించారు. కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై యూరియాను దొంగదారి గుండా వారి ఇండ్లల్లోకి చేరుతున్నాయని అన్నారు. రైతులకు రెండు మూడు రోజుల్లో యూరియాను అందించనట్లయితే బిఆర్ఎస్ ప్రభుత్వం వారికి అండగా నిలుచుంటుందని అన్నారు. రోడ్డుపై ధర్నా చేస్తుండటంతో వాహా నాలు పెద్ద ఎత్తున ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అక్కడికి చేరుకున్న ఎస్ఐ రఘుపతి వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పెద్దికి తెలుపగా ధర్నాను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎవ్ చైర్మన్ రామస్వామినాయక్, మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్‌రావు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ బత్తిని శ్రీనివాస్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకటరామ్‌నర్సయ్య, బుదరావుపేట మాజీ సర్పంచ్ ప్రవీణ్, కొడ్తిమాట్ మాజీ సర్పంచ్ సుమన్, నాజీతండా మాజీ సర్పంచ్ బాలకిషన్‌తో పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు

- తిరుమల భక్తులకు ప్రాధాన్యత
- దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్‌శ్రీవాస్తవ



**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాణీకులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా రైల్వే సేవ లందిస్తుందని, ఇంకా తిరుమల క్షేత్రాన్ని దృష్టిలో ఉంచు కుని నడుస్తున్న రైళ్ళలో భద్రతకు ప్రాధాన్యత ఉంటుందని దక్షిణమధ్యరైల్వే జిఎం సంజయ్ కుమార్‌శ్రీవాస్తవ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్ అంతర్జాతీయంగా విస్తరణ, అభివృద్ధి పనులు అనుకున్న స్థాయిలో సాగుతున్నా యన్నారు. పలు మార్పులు కూడా జరిగాయన్నారు. శ్రీవాస్తవ దంపతులు తిరుమలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.




**కోదాడ, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఒక రైతు నుండి లంచం తీసుకుంటూ అటవీ శాఖ అధికారి ఏసీబీకి చిక్కిన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఏసీబీ అధికారి జగదీష్ చంద్ర

# ఎసిబి వలలో అటవీ శాఖ అధికారి

తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో బీట్ ఆఫీసర్ గా పని చేస్తున్న అనంతుల వెంకన్న ఒక చెట్ల వ్యాపారి నుండి రూ 20,000 లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన హరి నాయక్ అనే చెట్ల వ్యాపారి చెట్లను కొనుగోలు చేసి అటవీ శాఖకు చెల్లించవలసిన చలానాలను చెల్లిస్తాం అనగా, వెంకన్న చలానాలు చెల్లించవలసిన అవసరం లేదని తనకు 50 వేలు ఇస్తే అనధికారికంగా అనుమతులు ఇస్తానని అన్నట్లు తెలిపారు. దీంతో హరినాయక్ ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి, బుధవారం పట్టణంలోని బైపాస్ రోడ్ లో వెంకన్నకు నగదు అందిస్తుండగా తమ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. బీట్ అధికారి ద్విచక్ర వాహనంలోని ట్యాంకు కవర్లో నుండి లంచంగా తీసుకున్న మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడిని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు. పరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా లంచం అడిగినా, తీసుకుంటున్నట్టు సమాచారం ఉన్నట్లయితే ఏసీబీ అధికారులకు తెలియజే యాలని, తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు




**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాత వార్త:** భారతదేశంలో మొట్ట మొదటిసారి హైడ్రో జన్ శక్తితో నడిచే రైలు త్వరలో ప్రారంభం కానుంది. దీన్ని వ్య యం రూ.136 కోట్లు. ఇది పర్యావరణ పరిం క్షణలో కీలకమని, 2,600 మందికి పైగా ప్రయా ణీకులు ప్రయాణించవచ్చిని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇండియన్ రైల్వేస్ వ్యవస్థ ప్రపంచ స్థాయిలో ఖ్యాతిని గడించనుంది. ఇది సరికొత్త శుభ్రమైన ఇంధన సాంకేతికత ఆధారంగా పని చేస్తుందని, భారతదేశం జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనా లాంటి కొన్ని దేశాలతో కలిసి హైడ్రోజన్ ట్రైన్ల పరిశోధనలో భాగస్వా మ్యమైంది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్) ఇటీవల హైడ్రోజన్ శక్తితో నడిచే డ్రైవింగ్ పవర్ కార్ పరీ క్షలు విజయవంతంగా పూర్తి చేసిందని ఇటీవల రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది డీజిల్‌పై ఆధారపడ టాన్ని తగ్గిస్తుంది. జింద్‌లో 3,000 కిలోల వరకు హైడ్రోజన్ నిల్వ సామర్థ్యం ఉంటుంది. ప్రతి పవర్ కార్‌లో 220 కిలోల హైడ్రోజన్ ఉంచుతారు.

## 42శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

### 25న ఇందిరాపార్కులో ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ఎట్టి పరిస్థితులలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణ వైఖరితో కాకుండా సామరస్య పూర్వకంగా చర్చలు జరపాలన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన పూర్తి అధికారాలు వినియోగించుకోకుండా కేంద్రంపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తుం దన్నారు.

ఈనేపథ్యంలో42 శాతం రిజర్వేషన్లు సాదించడానికి ప్రభుత్వంపై వత్తిడి పెంచడానికి ఈ నెల 25న కృష్ణయ్య హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష జరపాలని నిర్ణయిం చినట్లు కృష్ణయ్య పేర్కొన్నారు.

## వివిధ నిర్మాణ దశల్లో2 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** పేదలకు ఇళ్ల నిర్మించడంలో గత పదేళ్ల కాలంలో ఆనాటి పాల కులు మాటలకే పరి మితమైతే, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం చేతల తో చేసి చూపిస్తున్నదనిరాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 2 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులు వివిధ దశల్లో ఉన్నా యన్నారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరే ఒషన్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మిం చిన కాన్ఫరెన్స్ హాల్‌ను, ఆధునీకరించిన కార్యా లయ ఛాంబర్లను బుధవారం మంత్రి ప్రారం భించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయ వంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. హౌసిం గ్‌కార్పొరేషన్ ఎండి వి.పి గౌతం మాట్లాడుతూ కార్పొరేషన్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించే చర్యల్లో భాగంగా,జిల్లాల్లో ఎఇ ల నియామకంతో పాటు, అవసరమైన మేరకు ఇతర విభాగాల అధి కారుల సేవలను వినియోగించు కుంటున్నా మన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తోపాటు హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు అందుబాటులోకి పుష్కరిణి

**తిరుమల,ఆగస్టు 20ప్రభాత వార్తప్రతి నిధి:** నెలరోజుల మరమ్మతుల అనంతరం తిరుమలలో శ్రీవారి పుష్కరిణి భక్తులకు బుధవారం నుండి అందుబాటులోకి వచ్చింది, పాతనీటిని తొలగించి ఇటీవల కొత్తగా నీటితో నింపారు. స్వామి వారి పుష్కరిణి మెట్లకు ఆకర్షణీయమైన రంగులు అద్దకంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటిలీటర్ల నీటితో స్వామి పుష్కరిణి నింపారు. ప్రతిరోజూ నిర్వహించే పుష్కరిణి హారతి పునరుద్ధరణ చేశారు.



వార్త

నేను ఏ పని చేయలేను అని అనుకున్నందువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. 'ప్రయత్నిస్తాను' అనుకున్నప్పుడే ఏదైనా సాధించగలుగుతాం.

-జె. హెలెన్

# జీఎస్టీ భారాల కుదింపు?

జీఎస్‌టి సంస్కరణలతో పన్నుల వడ్డన తగ్గుతుందని, ఇకపై హేతుబద్ధమైన పన్నుల వసూళ్ల మాత్రమే జరుగుతుందని సర్వేసర్వత్రా సంతోషం వ్యక్తమౌతోంది. కొత్తగా రాబోయేజిఎస్‌టి విధానంలో 5,18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయి. వచ్చేనెలలో జరిగే జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కూలంకషంగా చర్చించి సూత్రప్రాయంగా అంగీకరిస్తారు. వస్తు సేవల పన్ను (జిఎస్టీ) విధానంలో ప్రస్తుతం నాలుగు శ్లాబులుండగా 12,28 శాతం శ్లాబ్‌లకు స్వస్తి చెప్పడం ఆహ్వానించదగిన పరిణామం. జిఎస్టీ అనగానే సామాన్య వినియోగదారులు వ్యాపారులు సైతం భయపడిపోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతమున్న విధానంలో నిత్యావసర వస్తువులపై 5 శాతం, సాధారణ వస్తువులపై 12 శాతం, ఎలక్ట్రానిక్స్ సేవలపై 18 శాతం, విలాస, హానికారకాలపై 28 శాతం జిఎస్టీ ఉండేది. క్రమేపీ పన్ను సంస్కరణల సమీక్షలో ఎప్పటికప్పుడు విధాన నిర్ణయాలు జరుగుతూనే ఉన్నాయి. సవరించిన విధానానికి లోబడి జౌళి, ఎరువులు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమేటిక్, హస్తకళలు, వ్యవసాయం, వైద్యం,బీమారంగాలకు పన్నులు తగ్గుతాయి. గృహ వినియోగ వస్తువులపై జిఎస్‌టి తగ్గుతుంది. సమాజానికి హానికారకంగా ఉండే పాన్‌మసాలా,పొగాకు ఉత్పత్తులకు 40శాతం ఉంటుంది. ప్రస్తుతం సంప్రదాయ వాహనాలపై 28శాతం పన్నుండగా అదనంగా 1-22 శాతం పరిహార సెస్ విధిస్తున్నారు. కొత్త జిఎస్‌టి అమలైతే కార్లపై పన్నులు తగ్గి సామాన్యుడికి చిన్నకార్లు అందుబాటులోకి వస్తాయి. వాటికి గిరాకీ, విక్రయాలు పెరుగుతాయి. సామాన్యుడికి సుంకాల భారం తగ్గితేనే జీవన పరిస్థితులను సరిదిద్దుకోగలడు. అలాంటి ప్రయోజనాలు కల్పించే దిశగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆలోచిస్తోంది.జిఎస్టీ శ్లాబులను తగ్గించి వారికిమంచి చేయాలనే సంకల్పంతో ముందడుగు వేస్తోంది.వస్తు సేవల పన్నులు తగ్గితే భారత జిడిపిలో0.6శాతం వృద్ధి కలుగుతుందని ఇప్పటికే ఆర్థిక శాస్త్రవేత్తలు గణించారు. వారి సూచనల మేరకు జిఎస్టీ విధానంలో మార్పులు తెస్తున్నారు. ప్రజాసంక్షేమం కోసం జిఎస్టీ సుంకాల తగ్గింపునకు జిఎస్టీనే క్రమబద్ధీకరించడం మేలైన పద్ధతిగా ఆర్థికవేత్తలే నిర్వచించారు. 'ఒకే దేశం ఒకే పన్ను'వ్యవస్థగా ఎనిమిదేళ్ల క్రితం జిఎస్టీ విధానానికి రూపకల్పన చేసిన కేంద్రం సామాన్యునికి అందుబాటులోకి వచ్చే విధంగా పన్నుల వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించడం స్వాగతిద్దాం. చేనేత వస్త్రాలపై ఐదు శాతం జిఎస్టీ విధించిన కేంద్రం 12 శాతానికి పన్ను పెంచాలన్న ప్రతిపాదన చేసింది.వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రాధాన్యత చెందింది. ఇప్పటికే చేనేత కార్మికులు తమ వృత్తిని వదల్లేక,ఉన్నవృత్తిలో బతుకలేక దీనావస్థలో ఉండగా ప్రభుత్వ ప్రతిపాదనలు వారి జీవన విధానంపై దాడిచేస్తున్నాయి. ప్రస్తుత చేనేత రంగంపై వాటి ఉత్పత్తులపై పూర్తిగా జిఎస్టీ రద్దు చేయడమొక్కటే కేంద్ర ప్రభుత్వానికి తక్షణకర్తవ్యం కావాలి. సమీపంలో ఎలాంటి ఎన్నికలు లేకపోయినా మొన్న పంద్రాగస్టునాడు ఎర్రకోటపై ప్రధానినరేంద్రమోడీ మాట్లాడుతూ దీపావళి నాటినుండి కొత్త జిఎస్టీ ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఇదే జరిగితే సామాన్యుడికి ప్రాణం హాయిగా ఉంటుంది.ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు బడుగు జీవులపై పరోక్షంగా పడేసుంకాల భారాన్ని తగ్గించేందుకు ఎన్డీయే ప్రభుత్వపాలన ఎంతగానో కృషి చేయాలని తపిస్తోంది. తొలుత జిఎస్టీ పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు కూడా ఎన్నో అభ్యంతరాలొచ్చి పడ్డాయి. ఏమైతేనేం తాజా సంస్కరణలనుబట్టి జిఎస్టీపన్నువసూళ్లను హేతుబద్ధీకరణ జరిగినట్లే భావించాలి. ఇటీవల కర్ణాటకలో వీధి వ్యాపారులు,తోపుడు బండ్ల వర్తకుల ఫోన్ యాప్‌లద్వారా జరిగే చెల్లింపులను ఆసరాగా తీసుకొని ఆ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ 13వేలమంది చిన్నపాటి వర్తకులకు నోటీసులుపంపి అగచాట్లకు గురిచేసింది. తద్వారా వినియోగదారులపై పన్నుల భారంవేసే ప్రయత్నం జరిగింది. పరోక్షంగా వినియోగదారుల మీద,ప్రత్యక్షంగా వీధి వర్తకుల మీద సుంకాల భారం పడిందన్న మాట.ఈ పన్నులవిధానం పట్ల వినియోగదారుల నుంచి ఎన్నో అభ్యంతరాలొచ్చినప్పుడు దేశంలో సగటు వసూళ్ల రెండు లక్షల కోట్లపై మాటే. ఎంఎస్‌ఎంఇ పరి శ్రమలు జిఎస్‌టి తకరారుతో చాలా ఇబ్బంది పెట్టారు. వస్తుసేవల ధరలు తగ్గడమంటే సామాన్యుడి నెత్తినపాలు పోసినట్లే. శీతలీకరించిన కూరగాయలు వంటి ప్యాకేజీ ఫుడ్స్, నాన్ ఎలక్ట్రానిక్, గృహోపకరణ పరికరాలు, కంప్యూటర్లునే కాక, వెయ్యి రూపాయలలోపు ఖరీదైన పాదరక్షలు, ఆయుర్వేద ఔషధాలు,వ్యవసాయపరికరాలు, సిమెంట్, గ్లేజ్డ్ టైల్స్ పై కూడా ఎస్టీ తగ్గుతుంది. ఆరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తులు ఇటీవల కాలంలో బాగా ధరలు పెరిగిపోయాయి. కొత్త జిఎస్టీ ప్రతిపాదనల్లోవీటిపై సుంకాలు తగ్గనున్నందున కాఫీ ప్రియులకు పసందైన వార్త యిది. మోటారు సైకిళ్ల పై దాదాపు పదిశాతం పన్నులు తగ్గుతాయన్న ఆశాభావంతో దేశప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు సామాన్యుడిని పీల్చిపిండెస్తున్నందున అలాంటి వాటిపై నిషేధం ఒక ఎత్తయితే, అధిక పన్నులు మరొకటి. కనుక 40 శాతం పన్నులు పడ్డాయి. ఇన్నాళ్లు బడుగు వర్తకులు పడిన బాధలు దీపావళి నాటికి కొండెక్కిపోతాయి. అయితే బీమా ప్రీమియంల చెల్లింపుల పై జిఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ వీటి విషయమై ప్రభుత్వం ఇంకా ఆలోచించినట్లు లేదు. కాగా న్యాయంగా హేతుబద్ధమైన పన్నులతో తెచ్చే ఏ ప్రతిపాదనను భారతీయులెవరూ అభ్యంతర పెట్టబోరు. కొత్త జిఎస్టీ నిషేధం అమలైతే సామాన్యుడు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది.



దేనినైనా అస్వీకరించుకోవడం తేలిక, సంస్కరించుకోవడం చాలా కష్టం.

బర్ట్రండ్ రస్సెల్



తెలిసిన వాడు సత్యం కోసం వాడిగా వేడిగా వాదిస్తాడు. తెలియనివాడు తన అభిప్రాయం కోసం వాదిస్తాడు.

టాల్‌స్టాయ్

# వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి

ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్‌ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొందగలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.



రామ కిష్టయ్య సంగన భట్ల

బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికైనా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది అని తెలుగులో ఒకసామెత ఉంది.పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండు టాకును చూసి చెట్టురెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండు టాకు రాలిపోయిందట.మనిషి జీవిత చక్రంలో వచ్చేమార్పు లు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యం లేదా ముసలితనం మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరం రోగ నిరోధక శక్తిని క్రమక్రమంగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యంగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమవంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలేవృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగస్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపుకుంటున్నారు. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదు మందిలో ఒకరు 60ఏళ్లు ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకింతం అయేందుకు గాను ప్రపంచం వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపుతున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్లకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది.అయితే, ఈచట్టాలు అమలుకు పూర్తిగా నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతిఒక్కరూ శ్రద్ధచూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశకావడంతో వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసుకోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15



కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటులోకి రావడంతో ఆయుర్దాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదేస్థాయిలో అధికమవుతోంది.ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ 60ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షలమంది ఉన్నారు.80ఏళ్లకుపైబడిన వారి సూపర్ సీనియర్ సిటిజన్స్ అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండిపోతాయి! అంటే వృద్ధుల జనాభా 120కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. హెల్పేజ్ ఇండియా అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమపూర్వక పలకరింపు, ఆదరణ,అభిమానాలే తప్ప ఆడంబరాలు, విలాసాలు కాదు.వృద్ధాప్యంలో ఆరోగ్యసమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్ల పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తిలేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాలలోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందనుకుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకని వారు మరచిపోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టుకుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై హెల్పేజ్ ఇండియా వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. సొంత కుటుంబ సభ్యులనుంచే నిరాదరణ ఎదురవుతోందంటూ 56శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంటగలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టంగా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధపడుతున్నారని జాతీయనమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్న వారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొందగలుగుతాం అని యువత గుర్తించాలి.వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు. •

# క్యాన్సర్ విస్తరణను నిరోధించలేమా?

సి.హెచ్. ప్రతాప్

భారతదేశంలో ఆరోగ్య రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో అత్యంత ఆందోళనకరమైనది క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుదల.గుండె, ఊపిరితిత్తుల వ్యాధుల తరువాత దేశంలో మరణాలకు కారణమవుతున్న మూడవ ప్రధాన వ్యాధి క్యాన్సర్. అయినప్పటికీ దీనిపై తగిన శ్రద్ధ తీసుకోవడంలో లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి లక్ష మందిలో వందమంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని అంచనా. భారత వైద్య పరిశోధన మండలి వివరాల ప్రకారం 2023లో పద్నాలుగు లక్షల మందికిపైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. ప్రతి సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి. కానీ ఈ పెరుగుతున్న వ్యాధి భారానికి సరిపడే వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. క్యాన్సర్ చికిత్స కేంద్రాలు దేశవ్యాప్తంగా వంద పట్టణాలు, నగరాలకే పరిమితం కాగా, ఎక్కువ మంది రోగులు చిన్న పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్నారు. ఫలితంగా వారు పెద్ద నగరాలకు వెళ్లక తప్పదు. ఖరీదైన ఔషధాలు, రేడియోథెరపీ పరికరాల కొరత, శిక్షణ పొందిన వైద్యుల లేమి రోగులను మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించే ఆసుపత్రుల్లో కేవలం మూడో వంతు రోగులకే చికిత్స లభిస్తున్నప్పుడు, మిగిలిన వారు ప్రైవేటు ఆసుపత్రుల అధిక ఖర్చులు భరించలేక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు. చాలామంది కుటుంబాలు ఆస్తులు అమ్ముకుని చికిత్స కోసం నిధులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. క్యాన్సర్ కేసుల పెరుగుదలకు అనేక కారణాలున్నాయి.వాయు కాలుష్యం, జీవనశైలి మార్పులు, ధూమపానం, మద్యపానం, అస్వస్థకరమైన ఆహారం, శారీరక శ్రమలేమి, వారసత్వ కారణాలు ఇవన్నీ దీనికి తోడ్పడుతున్నాయి. అయితే ప్రధాన సమస్య వేళలో నిర్ధారణ జరగకపోవడం, చాలామంది రోగులు చివరి దశలోనే ఆసుపత్రులకు చేరుతున్నారు. దాంతో చికిత్స ఫలితాలు తగ్గిపోతున్నాయి.భారతదేశంలో క్యాన్సర్‌రోగుల ఐదేళ్ల జీవన శాతం కేవలం ముప్పై శాతం మాత్రమే ఉండగా, యూరప్, అమెరికా దేశాల్లో ఇది తొంభైశాతం వరకు ఉంది.వాస్తవానికి కొన్ని రకాల క్యాన్సర్‌లు పూర్తిగా నివారించదగినవిగా ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయదగినవిగా ఉంటాయి. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక క్యాన్సర్ మరణాలు నమోదయ్యే దేశంగా నిలుస్తున్నా, సమర్థవంతమైన స్క్రీనింగ్ విధానం అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది.2010లోనే ప్రారంభించిన జాతీయ క్యాన్సర్, మధుమేహం, గుండె వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ నివారణ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌పిసీడిసిఎస్) ప్రధానంగా గర్భాశయ ముఖం, మోఖికం, వక్షోజ క్యాన్సర్ల స్క్రీనింగ్ పైనే దృష్టి పెట్టింది. ఇవే దేశంలో మొత్తం క్యాన్సర్ కేసుల మూడో వంతును ఆక్రమిస్తున్నాయి. అలాగే ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జనఆరోగ్య యోజన కింద ఒకటిన్నర లక్షకు పైగా ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలను క్యాన్సర్ గుర్తింపు కేంద్రాలుగా ప్రకటించారు. కానీ ఫలితాలుమాత్రం నిరుత్సాహకరంగా ఉన్నాయి. నీతి ఆయోగ్ నివేదిక స్పష్టంగా చెప్పినట్లుగా, గ్రామీణ స్థాయిలోనైనా, పట్టణ స్థాయిలోనైనా ప్రాథమిక స్క్రీనింగ్‌లో పెద్దగామార్పు జరగలేదు. నేల స్థాయి వాస్తవాలు కేంద్రం దృష్టికి వచ్చినా సమగ్ర వ్యూహం లేకపోవడం బాధాకరం. క్యాన్సర్ వ్యాధి భారాన్ని తగ్గించాలంటే ముందుగా స్క్రీనింగ్‌ను బలపర్చడం తప్పనిసరి. పాలనా స్థాయిలో కూడా ఈ వ్యాధి తగిన ప్రాధాన్యం పొందడం లేదు.మొత్తం ఆరోగ్య బడ్జెట్‌లో ఐదో వంతుకన్నా తక్కువ నిధులే కేటాయిస్తున్నారు. ఇది సమగ్ర వ్యూహరూపకల్పనకు పెద్ద అడ్డంకిగా మారుతోంది. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఔషధాలపై అపార ఖర్చులుపెట్టినా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాథమిక ఔషధాలే అందుబాటులో లేవు. అందువల్ల క్యాన్సర్ మరణాల డెబ్బై శాతం కంటే ఎక్కువ తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లోనే జరుగుతున్నాయి. భారతదేశంలోనూ ఇదే దృశ్యం.ఈ నేపథ్యంలో పాలకులు తక్షణం దృష్టి పెట్టాల్సిన అంశాలున్నాయి. జిల్లాస్థాయి ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించే అవకాశం కల్పించాలి. రేడియోథెరపీ పరికరాలు,నైపుణ్యం కలిగిన వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేలా వైద్యమౌలిక సదుపాయాలను విస్తరించాలి. పేద కుటుంబాలకు సరసమైన ధరల వద్ద ఔషధాలు లభించేలా విధానం రూపొందించాలి. •

# ప్రజావాక్కు



## తిరుమల దర్శనం దివ్యంగా కల్పించాలి

కలియుగ వైకుంఠమైన తిరుమలకు ఆపదమొక్కులవాన్ని దర్శనానికి ప్రతి హిందువు అత్యంత భక్తిశ్రద్ధలతో వెళ్తుంటారు తమ కష్టాలను కడ తీరుస్తాడని అపారమైన నమ్మకం!అలిపిరిలో భద్రతా కారణాలతో ప్రతిభక్తున్ని,వారి వెంటఉన్నసంచులను సామాగ్రిని నిశితంగా పరిశీలిస్తారు. ఇది అత్యంత అవసరం.కానీ వయోధికులు స్త్రీలు పిల్లలు తమతమసంచులను ఇతరసామాగ్రిని వాహనాల నుండి దించి పరిశీలన తర్వాత మరల వాహనంలో పెట్టుటకు అత్యంత ప్రయాసలకు లోనుకావలసి వస్తుంది. తిరుమలలో కేంద్ర రిసెప్షన్ కార్యాలయంలో గదులు పొందిన తర్వాత వాటివద్దకు పోవుటకు అత్యంత వ్యయం వెచ్చించవలసి వస్తున్నది. దేవదేవుని దర్శనానికి భక్తులను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నవిధానాన్ని దర్శనం తర్వాత బయటకు వెళ్లేంతవరకు కూడా అదే విధంగా కొనసాగించాలి.

- దండంరాజు రాంచందర్ రావు, సికింద్రాబాద్

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తముగా దగ్గు, జలుబు, జ్వరాల కారణంగా ఇటీవలరాష్ట్రంలోని ఆస్పత్రుల అవుట్‌పేషెంట్ సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. డెంగీ, మలేరియావంటి వ్యాధులు ఇప్పటికీ నియంత్రణలో ఉన్నప్పటికీ, ఈఏడాది డెంగీ కేసులు మళ్లీపెరగొచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది అని వైద్యనిపుణులు హెచ్చరించారు. దీనివల్ల, ఇంట్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, జ్వరానికి గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. గతంలో వర్షాకాలంలో ప్రత్యేక ఫీవర్ ఓ పి కౌంటర్లను ఏర్పాటు చేయడం వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈసంవత్సరం అవసరమైనప్పుడు ప్రత్యేకఓపీక్లినిక్‌లు ఏర్పాటుచేస్తామని చెబుతున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి. ఆధునిక పద్ధతిలో విద్యా బోధన జరపాలి. అలాగే స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు ఉపయోగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా టాయిలెట్‌లు, బెంచీలు,మంచినీరు, తదితర సదుపాయాలు కల్పించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

## సామాన్యులకు ఊరట కలుగునా?

మొన్న ఆగష్టు 15,2025,శుక్రవారం రోజున ఎర్రకోట వేదికగా దేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ, జీఎస్టీ (సరుకులుమరియు సేవల పన్ను) భారం తగ్గించేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధ్యతరగతి మన ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం. వారి జీవన ఖర్చులు తగ్గేలా జీఎస్టీ స్లాబ్లలను సరి చేయడానికి కౌన్సిల్‌లో చర్యలు జరుగుతున్నాయి. ఈ సవరణలు పేదలు,మధ్యతరగతి వ్యాపారవేత్తలు, చిన్న వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తాయి అనే భావంతో ప్రకటన చేశారు. ప్రధానమంత్రి మాటల ప్రకారం, దీపావళికి ముందు ఈ సవరణలు అమలు కావచ్చునని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కొత్త తరం జీఎస్టీ సవరణలు అమలైతే, హెల్త్ ఇన్సూరెన్స్, విద్య,రోజూవారీ అవసరాల ఖర్చులు తగ్గడంవల్ల సామాన్య కుటుంబాలు ఆర్థికంగా ఊపిరి పీల్చుకోగలరు. ఏదే మైనా, ప్రధానమంత్రి గారి హామీతో జీఎస్టీ స్లాబ్లు తగ్గితే, అది సామాన్యులకు ఆర్థిక ఊరటను అందించడమే.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భూ భారతిని అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంబంధించిన సమాచారం కోసం భూ భారతి చట్టాన్ని తీసుకు రావడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణిని పోర్టల్ లో అవకతవకలు జరిగాయి అని కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి తీసుకువచ్చింది. కానీ భూభారతిలో కూడా రైతులకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టాదారు పాసు పుస్తకాలలో తప్పులను సవరించడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## అమెరికా ఎవరినీ ఎదగనివ్వదు

గత వందేళ్లుగా అమెరికా ప్రపంచంలో తిరుగులేని మహాశక్తిగా నిలిచింది. తమ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ఏ దేశాన్నైనా అంతం చేయడంలో వెనుకాడదు. జపాన్ ఎదురు తిరిగితే అణుబాంబులు వేసి పాతాళానికి తొక్కేసింది. అమెరికా శక్తికి ప్రధాన కారణం దాని వ్యాపార సామ్రాజ్యం. ప్రపంచంలోని టాప్ 10 పారిశ్రామికవేత్తల్లో 89 మంది అమెరికన్లే. చైనాకు చెందిన జాక్ మా మూడోస్థానానికి చేరినప్పుడు, అతడిని దెబ్బ తీయడానికి లాబీయింగ్ మొదలుపెట్టారు. ఇప్పుడు భారతీయ పారిశ్రామికవేత్తలైన అదానీ, అంబానీలను టార్గెట్ చేస్తున్నారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి



డాక్టర్ ఎనుగొండ నాగరాజు నాయుడు

ప్రపంచాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా పాలించి శాసిస్తున్న పాశ్చాత్య దేశాలను తట్టుకొని నిలబడాలంటే వాటికి సమాన స్థాయిలో ఎదగాలంటే చైనా లాగా భారత్ కూడా స్వయం సమృద్ధిని సాధించాలి. ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా చైనా ప్రతీకార సుంకాలు విధించినట్టుగా భారత్ కూడా అడుగులు వేయాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ఫలితంగా మన ఎగుమతులు తగ్గిపోతే మిగిలినవి మనదేశంలోనే మనం అమ్ముకోగలమా? లోకల్ మార్కెట్లు విస్తరించేలాగా ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించి వ్యయం చేయగలదా?దానికి నిధులు ఎక్కడివి? ధనవంతులపై పన్నులు వేయాలి కదా దీనినే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు ఒప్పుకోరు.ఫలితంగా దేశంలోస్థూల డిమాండ్ పడిపోతుంది. ఆర్థిక సంక్షోభం వైపుగా భారత్ ఆర్థికవ్యవస్థ పోతే ఉద్యోగిత ఉత్పత్తి ఆదాయాలు తగ్గిపోతాయి. సుంకాలు విధించడం వలన అమెరికాలో అవన్నీ పెరగవచ్చు కానీ మిగతా ఆర్థిక వ్యవస్థలు భవిష్యత్తు ఏమిటి? ప్రపంచ ఆర్థికవ్యవస్థలో స్థూలడిమాండ్ పడిపోతుంది. దీనినే సార్థక డిమాండ్ లేని పరిస్థితి అని అంటారు. అంటే సప్లై డిమాండు సమతుల్య స్థితి లేని పరిస్థితి. అదే 1930 లలో ఆర్థిక మాధ్యానికి కారణం.ఒకవేళ ఉత్పత్తులు ఇప్పటికే గణనీయంగా పెరిగి ఉంటే ప్రజలకు ఆదాయాలు కల్పించాలి కాబట్టి పని కల్పించేందుకు గుంతల తవ్వమనండి అదే గుంతలు పూడ్చమనండి. వారికి వేతనాలు మాత్రం ఇవ్వండి తద్వారా ఆదాయాలు పెరిగి ప్రజల డిమాండ్ పెరిగి ఈ పెరిగిన కొనుగోలు శక్తితో మిగులు ఉత్పత్తులను వారు కొని ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. తద్వారా సప్లై డిమాండ్ సమానమవుతుంది. ఇప్పటి ప్రభుత్వాలు ఈ పని చేయగలవా? పెట్టుబడిదారుల చేతుల్లో ఉండే ప్రభుత్వాలు అందుకు పూనుకోలేవు దేశంలో ఆర్థిక వృద్ధి అంతా పెట్టుబడిదారుల చేతుల్లోనే జరుగుతున్నది కదా ప్రజల భాగస్వామ్యం నామమాత్రమే కదా? అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా మరికొన్ని దేశాలు తమ సుంకాలను కూడా పెంచవచ్చు. కానీ అలా పెంచినంత మాత్రాన ప్రపంచ వస్తు సేవల స్థూల డిమాండ్ పెరగదు. ఈ దేశాలన్నీ దాదాపుగా నయా ఉదారవాదానికి లోబడే వ్యవహరిస్తున్నాయి. అవి తాము పెంచిన సుంకాల వలన వచ్చిన అదనపు ఆదాయాన్ని ప్రజలపై ఖర్చు చేస్తారా? తమ దేశాల్లోనే సంపన్నులకుమరింత రాయితీలు కల్పించడానికి ఖర్చు చేస్తాయి.అంతే తప్పప్రజల ఆదాయాలను డిమాండ్‌ను పెంచేలా ఖర్చు చేయవు.ఆ దేశాలలో అటు దేశీయ కార్మికులకు కొనుగోలు శక్తి పడిపోతుం



ది.ఎగుమతులు తగ్గిపోయి ఉపాధి తగ్గుతుంది.ఇటు దేశీయ వ్యయం పెరగదు దాని ఫలితంగా ప్రపంచ స్థూల డిమాండ్ మరింత పడిపోతుంది. ప్రతీకార సుంకాల విధింపు ద్వారా ఆయా దేశాలు తమ అమెరికా ఎగుమతులు తగ్గించుకొని ఆ మేరకు ఉత్పత్తిని దేశీయ మార్కెట్లోకి మళ్ళించాలి. ప్రపంచ పెట్టుబడేదారి మార్కెట్ మొత్తం మీద చూసినప్పుడు డిమాండ్ తగ్గిపోయి నయా ఉదారవాద ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరంకాక మానదు.ఇప్పుడు నయా ఉదారవాద విధానాలు మన దేశాన్ని వెనుకకు నెట్టాయి. ఇప్పుడు మన దేశం అటు రైతుల ప్రయోజనాలకైనా బలి చేయాలి లేదా ఫార్మా ఆభరణాల తయారీ వజ్రాల తయారీ వంటి రంగా ప్రయోజనాలనైనా బలి చేయాలి.ఏది జరిగినా మన దేశానికి నష్టమే.అందుచేత అసలు ఈ నయా ఉదారవాద నుండి మన దేశాన్ని బయటకు తెచ్చుకుని ఇప్పుడున్న చిక్కు పరిస్థితుల నుండి విముక్తి చేయాలి. స్వావలంబనతోనే ఆర్థిక అభివృద్ధి జరగాలి. గ్లోబలైజేషన్ వైపు అడుగులు వేయాలి. నయా ఉదారవాద విధానాల నుండి గ్లోబలైజేషన్కు వెళ్లాలి. అలా విధానాన్ని మార్చితే అప్పుడు బడా బూర్జువా వర్గం దానిని వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే ఆ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకం అయిపోయి ఉంది. అటువంటి బడా బూర్జువా వర్గ ప్రయోజనలు నెరవేర్చడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం డి గ్లోబలైజేషన్ వైపు మళ్లీ ఆలోచన కూడా చేయలేదు. అందుచేత సామ్రాజ్యవాద వాదం బెదిరించినప్పుడల్లా రాజీపడేందుకే సిద్ధమవుతుంది. సామ్రాజ్యవాద పెత్తనం నుండి బయటపడి స్వాతంత్ర్యంగా మనగలడం అంటేనే నయా ఉదారవాద వ్యూహాన్ని తిరస్కరించడం. 1990లకి మునుపు నడిచిన ప్రభుత్వాలు ఈ వాస్తవాన్ని గ్రహించాయి గనుకే ఆ కాలంలో సామ్రావాజ వాదుల ఎత్తుగడలకు అవి భయపడలేదు.నయా ఉదారవాద విధానాలను ఎప్పుడైతే చేపట్టడం జరిగిందో అప్పటినుంచి మన దేశ స్వాతంత్ర్యం విషయంలో పరిమితులు ఏర్పడడం మొదలైంది. జాతీయవాదంతో మనం వలస పాలన పారదోలినట్టు ఈ సామ్రాజ్య వాదుల నయా వలసపాలనకూడా దేశాన్ని గ్లోబలైజేషన్ అనగా అమెరికా,యూరోప్ దేశాలపై ఆధారపడే ప్రభుత్వ విధానాల నుంచి తప్పించి స్వయం పోషకత్వ విధానాలవైపు ప్రభుత్వ విధానాలుండాలి.ప్రపంచ ఆర్థికరంగం ఎదుర్కొంటున్న ఈ సుంకాలవలయం నుంచి బయటకు రావాలంటే మన సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యతఇవ్వాలి.మరలా వలసపాలనకు వ్యతిరేకంగా ఆనాడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసినట్టుగా స్వదేశీ వస్త్రాలైన ఖాదీధరించినట్లుగా ప్రస్తుతం భారతీయులుతయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని కూడా గుర్తించాలి. దీనినే ప్రధానమంత్రి మోడీ79వ స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఎర్రకోటనుంచి పిలుపు ఇచ్చారు.ముఖ్యంగా చిన్నపరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రధాని కోరారు. దేశీయ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడం అత్యవసరం. •

# ఢిల్లీ సిఎంపై దాడి ఎందుకు చేశాడు?

## నిందితుని అరెస్టుచేసి దర్యాప్తు జరుపుతున్న పోలీసులు




**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై ఓ వ్యక్తి దాడి చేయడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖీమ్జీ భాయ్ సకారియా (41)గా గుర్తించారు. గుజరాత్‌లోనూ అతడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు దాడికి గల కారణాలు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా అతడి కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేసేందుకు ముఖ్యమంత్రి అధికార నివాసానికి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే వీటిని పోలీసులు ధృవీకరించాల్సి ఉంది. మరోవైపు గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, ఆమె నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కుమారుడు ఢిల్లీ సిఎంను కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లు సమాచారం. అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే, అతడి మానసిక పరిస్థితి బాగా లేదని, గతంలోనూ ఓసారి ఢిల్లీ వెళ్లి వచ్చా డనిపోలీసులకు వివరించినట్లు సమాచారం. అజీ డ్యామ్ ప్రాంతంలో నివాసముండే రాజేష్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది కేసులు ఉన్నట్లు సమాచారం. 2017-22 మధ్యకాలంలో బెదిరింపులు, స్థానికులపై దాడి, మద్యం మత్తులో దుష్ప్రవర్త నకు సంబంధించి ఈ కేసులు నమోదైనట్లు తెలిసింది.

అయితే జైల్లో ఉన్న బంధువు విడుదల కోసం వెళ్లినట్లు వార్తలు వచ్చినప్పటికీ అటువంటిదేమీ లేదని గుజరాత్ పోలీసులు గుర్తించినట్లు వెల్లడైంది.

ఇదిలా ఉంటే ఢిల్లీ సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై రాజ్‌కోట్ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత అతడు గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనను బిజెపి సహా విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

# ఆగిపోని చమురు కుంపట్లు.. ట్రంప్ కార్యవర్గం లక్ష్యమే భారత్!



**వాషింగ్టన్, ఆగస్టు 20:** రష్యా చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గం గత 10 రోజులుగా అదేపనిగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తోంది. ముఖ్యంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత పారిశ్రామిక వేత్తలను లక్ష్యంగా చేసుకొన్నారు. పశ్చిమదేశాలు విధించిన ఆంక్షల లబ్ధిని భారత్ పొందుతోందని ఆరోపించారు. సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. 'రష్యా నుంచి భారత్ చౌకగా చమురు కొనుగోలు చేసి.. దానిని ఉత్పత్తి చేసినట్లు బయట విక్రయిస్తోంది. ఈ యుద్ధ సమయంలో ఇది మొదలుపెట్టింది. దీనిని ఏమాత్రం ఆమోదించలేము. వారు మారువిక్రయం చేసి.. లబ్ధి పొందుతున్నారు. 16 బిలియన్ డాలర్ల వరకు వారికి మిగులుతున్నాయి. ఈ వ్యవహారంలో భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు భాగస్వామ్యం అయ్యాయి. యుద్ధానికి భారత్ రష్యా నుంచి 1 శాతం చమురు కొనుగోలు చేస్తే.. సంక్షోభం మొదలయ్యాక అది 40 శాతానికి చేరింది' అని బెస్సెంట్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ సలహాదారు సిఎన్‌బిసితో మాట్లాడుతూ అమెరికా కోరిక మేరకు భారత్ పెద్దఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఆయన రాపిడన్ ఎనర్జీకి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. బైడెన్ కార్యవర్గం రష్యా నుంచి వచ్చే చమురు తీసుకోమని భారత్‌ను కోరిందన్నారు. చమురు ధరల్లో భారీ వృద్ధి ఉండకుండానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమెరికా రూపొందించిన ఆంక్షల చట్రంలో భారత్ ధరలను అదుపు చేసే పాత్రను పోషించిందన్నారు.

# కేంద్రం బిల్లును సమర్థించిన శశిథరూర్

## కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపి శశి థరూర్. తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బం ధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపైకూడా ఆయన పార్టీ అధిష్టా నానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు.

ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకి స్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైన దన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. ఇది ఇంగిత జ్ఞానానికి సంబం ధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కనిపించడంలేదు అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకిపంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొ న్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ అదిఎంతో మంచి విషయ మన్నారు.

అది మనప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుం దని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోప ణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి నైనా, కేంద్రమంత్రినైనా పదవి నుంచి తొలగిం చేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంత వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

# అలాస్కా వ్యక్తికి 'పుతిన్' గిఫ్ట్‌గా ఖరీదైన యూరల్ బైక్!

**వాషింగ్టన్, ఆగస్టు 20:** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఓ ఆసక్తి కర పరిణామం చోటుచేసుకుంది. అలాస్కాకు చెందిన ఓ వ్యక్తికి రూ. 19లక్షల విలువైన బైక్‌ను పుతిన్ బహుమతిగా ఇచ్చారు. రష్యాలో తయా రైన యూరల్ బైక్‌ను అతడు వాడుతుండటమే అందుకు కారణం. ఈ ఊహించని పరిణామానికి అలాస్కా వ్యక్తి ఆనందంతో మునిగిపోయాడు. అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల భేటీ జరిగింది. అంతకు ఓవారం ముందే యాంకరేజ్‌కు చేరు కున్న రష్యన్ మీడియా ప్రతినిధులు స్థానికులతో ముచ్చటించే ప్రయత్నం చేశారు. ఈ సమ యంలో యూరల్ కంపెనీకి చెందిన ఓ పాత బైక్ వాడుతున్న మార్క్ వారెన్ అనే రిటైర్డ్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ రష్యా జర్నలిస్టుల కంటపడ్డాడు. ఈ బైక్‌అంటే చాలాఇష్టమని చెప్పినవారెన్.. యుద్ధం నేపథ్యంలో ఆ బైక్ విడిభాగాలు దొరక ట్లేదని, నిర్వహణ కష్టంగా మారిందని వాపో యాడు. ట్రంప్-పుతిన్ భేటీ వల్ల ఈ యుద్ధానికి ముగింపు లభిస్తే ప్రయోజనం ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అవునంటూ సమా ధానమిచ్చాడు.

ఇందుకు సంబంధించిన న్యూస్ రష్యాలో వైరల్‌గా మారింది. క్రెమ్లిన్ దృష్టికీ వెళ్లింది. దీంతో స్పందించిన రష్యా అధికారులు వారెన్‌కు ఫోన్ చేసి బైక్ గురించి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పుతిన్ వచ్చిన విమానంలోనే ఆ బైక్‌ను తీసుకొచ్చినఅధికారులు.. అమెరికా అధికారుల సాయంతో స్థానిక ఎంబసీకి తరలిం చారు. భేటీ మరుసటి రోజు దీనిని వారెన్‌కు అప్పగించే ఏర్పాట్లు చేశారు. సతీమణితో రష్యా ఎంబసీకి వెళ్లిన వారెన్‌కు.. రష్యా అధ్యక్షుడు మీకు ఇచ్చిన బహుమానం ఇదేనని బైక్‌ను చూపించడంతో ఆనందంతో మునిగిపోయాడు.



# గాజాపై ఇజ్రాయెల్ మలిదశ పోరాటం

## రంగంలోకి 50 వేల మంది రిజర్వ్ బలగాలు!

**టెల్‌అవీవ్, ఆగస్టు 20:** గాజా నగరంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం మరో దశ సమరానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనికవర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రానున్న రోజుల్లో దాదాపు 50 వేల మంది రిజర్వు బలగాలను రంగంలోకి దించనున్నట్లు పేర్కొన్నాయి. గాజా నగరంలోని పలు ప్రాంతాల్లో హమాస్ ఇంకా చురుకుగా ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది. తమ సైన్యం కార్యకలాపాలు లేని అటువంటి ప్రాంతాలపై దృష్టి పెట్టామని.. త్వరలోనే అక్కడ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఓ అధికారి వెల్లడించారు. ఇందుకు సంబధించిన ప్రణాళిక తుది దశలో ఉందన్నారు. అయితే, ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత లేదు. రానున్న నెలల్లో 50 మంది రిజర్విస్టులను రంగంలోకి దించనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుం దన్నారు.

మరోవైపు గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనకు సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఐడిఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయని, యుద్ధభూమికి వెలుపల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు పేర్కొంది. ఈ చర్య హమాస్ దగ్గర బందీలుగా ఉన్న వారిని వెనక్కి తీసుకొచ్చే ప్రణాళికలలో భాగమని వివరించింది. అయితే, ప్రధాని నెతన్యాహు మాత్రం గాజాను స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదన్నారు. హమాస్‌ను నాశనం చేసి బందీలను వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమే తమ లక్ష్య మన్నారు.

# పాక్ క్రికెటర్ వాసిం అక్రంపై బెట్టింగ్ యాప్ కేసు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి సినీ తారలతో పాటు క్రికెటర్లు, సెలబ్రటీలపై కేంద్ర దర్యాప్తు స ంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)తో పాటు ఆయా రాష్ట్రాలు వేరు వేరుగా కేసులు నమోదు చేయడం తెలిసిందే. దీనికి సంబంధించి నింది తులుగా వున్న వారిలో క్రికెటర్ సురేష్ రైనా, టాలీవుడ్ నటులు పలువురిని ఈడీతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు ఇప్పటికే విచారించి వారి వాంగ్మూలం కూడా తీసుకు న్నారు. ఇప్పుడు ఇదే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు పాకిస్తాన్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్ వాసిం అక్రంపై లాహోర్ లోని నేషనల్ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సిసిఐఎ)లో కేసు నమోదయ్యింది. లాహోర్‌కు చెందిన ఫైజ్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది. వాసిం అక్రం కొన్నేళ్లుగా బాజీ అనే విదేశీ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నాడని ఫైజ్ తన ఫిర్యాదులో తెలిపాడు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వున్న పోస్టర్లు, వీడియో క్లిప్‌ను అతను పోలీసులకు అందించాడు. వాసిం అ క్రం వంటి సెలబ్రటీ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం వల్ల సామాన్యులు ముఖ్యంగా యువత జూదం వైపు మళ్లీ అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో ఫైజ్ తెలిపాడు. ఇందుకుగానూ వాసిం అక్రంపై ఎలక్ట్రానిక్ క్రైం యాక్ట్ 2016 కింద చర్యలు తీసుకోవాలని ఫిర్యా దిదారుడు కోరాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎన్‌సిసిఐఎలో వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది.

# ఆడుకుంటూ కారులోకి వెళ్లిన అన్నదమ్ములు

## ఆటో లాక్ పడి ఊపిరాడక మృతి



**జైపూర్, ఆగస్టు 20:** ఆట ఆడుకుంటూ కారులోకి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు మరణించారు. కారు ఆటో లాక్ పడటంతో ఊపిరాడక అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. తమ పిల్లలు కనిపిచడం లేదని వెతికినా తల్లిదండ్రులకు ఇంటికి కేవలం 20 మీటర్ల దూరంలో పార్క్ చేసిన కారులో విగత జీవులుగా కనిపించారు. ఈ ఘటన రాజస్థాన్‌లో జరిగింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా పోలీసులు భావిస్తుండగా, తల్లిదండ్రులు మాత్రం హత్య అని అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, జయపుర్‌లోని గలతా గెట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఇద్దరు మైనర్ సోదరులు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. ఒకరికి 8 యేళ్లు కాగా, మరొకరికి 5సంవత్సరాల వయసు ఉంటుంది. వారి కుటుంబసభ్యులు అర్ధరాత్రి వరకు వెతికినా, ఎక్కడా ఆచూకీ లభించలేదు. చివరకు తమ పిల్లలు కనిపించడం లేదని గలతా గెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ పిల్లల ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు వెతకడం ప్రారంభించారు. ఇంటికి కొంచెం దూరంలో పార్క్ చేసి ఉన్న కారులో ఆ పిల్లల మృతదేహాలు కనిపించారు. ఆ మైనర్ సోదరులు ఊపిరాడక మృతి చెందారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎసిపి రామ్ గంజ్ తెలిపారు. చిన్నారులు ఇద్దరు ఆటలాడుతూ కారులో వెళ్లారు. అది ఆటో లాక్ కావడం వల్ల లోపలే చిక్కుపోయారు. దీంతో ఊపిరాడక మృతి చెంది ఉంటారని తెలిపారు.

శవపరీక్షల నిమిత్తం మృతదేహాలను ఎస్ఎంఎస్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అలాగే ఫోరెన్సిక్ బృందాన్ని పిలిపించి కారులోని వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న సిసిటివిలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అన్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతదేహాలపై గాయాలు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే రఫీక్‌ఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రియుడితో దొరికిన భార్య - వారిద్దరికీ వివాహం చేసిన భర్త!

**లక్నో, ఆగస్టు 20:** ఆ ఇద్దరికి వివాహం జరిగి 25 యేళ్లు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భార్య తన ప్రియుడితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా భర్త కంటపడింది. దాంతో ఆ భర్త విచిత్రమైన నిర్ణయం తీసుకున్నాడు. ఇద్దరికీ దగ్గరుండి వివాహం జరిపించాడు! ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నగరంలో ఈ ఘటన జరిగింది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్జాపూర్ జిల్లాకు చెందిన అర్విండ్ పటేల్, చందౌలి జిల్లా హమీద్‌పూర్‌కు చెందిన రీనాకు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పాతికేళ్లుగా ఇద్దరూ కాపురం చేస్తున్నారు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో రీనాకు చందౌలికే చెందిన సియారామ్ యాదవ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది. సియారామ్ గతంలో అర్విండ్ పటేల్‌కు చెందిన దుకాణంలో పనిచేసేవాడు. ఆ సమయంలోనే అతడికి రీనాతో పరిచయం ఏర్పడింది. అది క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది.

# పాకిస్థాన్‌కు అది సిగ్గు చేటు

## ఐరాసలో దాయాది దురాగతాలను ఎండగట్టిన భారత్

**న్యూయార్క్, ఆగస్టు 20:** పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాల మహిళలపై లైంగిక హింస నేటికీ కొనసాగుతోందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మహిళలపై దారుణమైన నేరాలకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిదని, అయినప్ప టికీ వారిపై చర్యలు శూన్యమని దుయ్యబట్టింది. ఆ దురాగతాలు నేటికీ కొనసాగుతున్నాయని ఐరాస వేదికగా మండిపడింది.

'1971లో మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మైనారిటీ వర్గాల మహిళపై దారుణమైన లైంగిక హింసకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిది. అయినప్పటికీ నిందితులపై ఎటువంటి శిక్షలు విధించకపోవడం సిగ్గుచేటు. అటువంటి దుర్భర పరిస్థితి నేటికీ పాక్‌లో కొనసాగుతోంది. మహిళల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగికహింస, బలహీనవర్గాల మహిళ బలవంతపు మత మార్పిడిలు, బాలికలపై వేధింపులకు సంబం ధించి ఐరాస మానవ హక్కుల కమిషన్‌తోపాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో వివరించాయి' అని ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు.

ఐరాస భద్రతా మండలిలో 'సంఘర్షణ- సంబం ధిత లైంగిక హింస' అనే అంశంపై పున్నూస్ ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. గతంలో బంగ్లాదేశ్‌లో మహిళలపై పాకిస్థాన్ సైన్యం చేసిన దురాగతాలను ప్రపంచం ముందుంచారు. వీటికి అక్కడి న్యాయవ్యవస్థకూడ వంత పాడు తోందని విమర్శలు గుప్పించారు. క్రూరమైన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేసిన ఆయన.. హేయమైన చర్యలకు పాల్పడేవారిని శిక్షించాలన్నారు. సంఘర్షణ ప్రాంతాల్లో లైంగిక హింస అనేది వ్యక్తిగత జీవితాలను నాశనం చేయడమే కాకుండా సమాజంలోనూ భయాలను సృష్టిస్తుం దన్నారు.

ఇటువంటి అంశాలకు పరిష్కార మార్గం చూపిన దేశాల్లో భారత్ ఒకటని, సెక్రటరీ జనరల్ ట్రస్ట్ ఫండ్‌కు సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

# నిషేధం కాదు.. నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

## ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌పై కేంద్ర మంత్రి అమిత్ షాకు గేమింగ్ ఫెడరేషన్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు 20:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఎఐజిఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్ల మంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేగాక ఈ రంగంలోని అనేక మంది ఉద్యో గులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చ రించింది. ఈ సందర్భంగా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతా యుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించా లని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీవల విపరీతంగా పెరిగిపోయింది.

దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు.

ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధి కార వర్గాలు తెలిపాయి. నేడు దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# సంక్షిప్తంగా..

## అఫ్ఘాన్ బస్సులో మంటలు, 71 మంది మృతి

**కాబూల్, ఆగస్టు 20:** అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇరాన్ నుంచి తరలిపోతున్న వలసదారుల బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో 71 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఇరాన్ నుంచి ఇటీవల బహిష్కరణకు గురైన అఫ్ఘాన్ వలసదారులతో వెళ్తున్న బస్సు, మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందితో సహా స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో 17 మంది చిన్నారులతో సహా 71 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నాం. మోటార్‌బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందారు. నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది. కాగా.. అఫ్ఘాన్ శరణార్థులపై ఉక్కుపాదం మోపుతున్న ఇరాన్, పాకిస్థాన్ భార డిపోర్టేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యేడాది ప్రారంభం నుంచి దాదాపు 1.5 మిలియన్ల మందికిపైగా అఫ్ఘాన్‌న్లు ఇరాన్, పాకిస్థాన్ నుంచి బలవంతంగా స్వదేశానికి తిరిగివచ్చారు.

## అగ్ని 5 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



**భువనేశ్వర్, ఆగస్టు 20:** భారత్ 'అగ్ని 5' బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని పరీక్షించింది. ఇది అణు సామర్థ్యం ఉన్న స్వదేశీ క్షిపణి. ఇది రక్షణ రంగంలో దేశానికి ఉన్న బలమైన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. ఈ పరీక్షను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) నిర్వహించింది. 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థం దీని సొంతం. శ్రేణి: 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి, ఇది 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. టెక్నాలజీ: ఈ కిపణి మూడు దశల ఘన ఇంధన ఇంజిన్‌ను కలిగి ఉంది. లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం: 'అగ్ని 5' ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థం దీని సొంతం.

## ఢిల్లీలో కుప్పకూలిన భవనం.. ముగ్గురు దుర్మరణం



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని దర్యాగంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై సమాచారం అందిన వెంటనే ఢిల్లీ స్థానిక అధికారులు, ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలంలో భవన శిథిలాల తొలగింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఘటనకు కారణాలపై నిర్ధారణకు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదరింపులు

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో పలు పాఠశాలలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దాదాపు 50కి పైగా పాఠశాలలకు కొందరు దుండగులు ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సోదాలు నిర్వహించారు. టెర్రరైజర్స్ 111గా పేర్కొనే ఒక గ్రూపు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు బెదిరింపు మెయిల్స్ పంపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్కూళ్లలోని కంప్యూటర్లు, కెమెరాలు అన్నీ ప్రస్తుతం తమ అధీనంలో ఉన్నాయన్నారు. 25,000 బిలియన్ డాలర్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లేదంటే 48 గంటల్లో బాంబు పేల్చేస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. మెయిల్స్ విషయాన్ని పోలీసులకు చెప్తే బాంబు పేల్చేయడంతో పాటు స్కూళ్లకు సంబంధించిన డేటాను లీక్ చేస్తామని హెచ్చరించారన్నారు. ఇదే గ్రూప్ ఇటీవల 5వేల బిలియన్ డాలర్ల కోసం ఇలాంటి బెదిరింపులకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.

# మహిళా పోలీసుల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు

### ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క



రాష్ట్ర పోలీసు అకాడమీలో బుధవారం మొదలైన మహిళా పోలీసుల రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్కకు పుష్ప గుచ్ఛం ఇచ్చిన అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పోలీసు శాఖతో పాటు జైళ్లు, అటవీ శాఖలో మహిళలకు సంబంధించి మొదటిసారిగా అన్ని కేడ గిరిల అధికారులు, సిబ్బందికి సంబంధించిన సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు బుధవారం మొదలయ్యింది. శివార్లలోని హిమాయత్ సాగర్ లో గల రాష్ట్ర పోలీసు అకాడమీలో ప్రారంభమైన ఈ మూడు రోజుల సదస్సును పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సులో పోలీసు శాఖతో పాటు జైళ్లశాఖ, అటవీ శాఖ నుంచి కాని స్టేబుల్ నుంచి అంతకు పైస్థాయి అధికారులతో కలిపి 400మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళల కోసం కూడా పలు పథకాలను అమలు చేసిందని ఆమె తెలిపారు. పోలీసుశాఖతో పాటు జైళ్లు, అటవీ శాఖలో మహిళలు ఇతర అధికారులకు ఏమాత్రం తీసిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె కోరారు. మూడురోజుల పాటు జరిగే ఈ సదస్సుల సమస్యలపై చర్చించి సూచనలను రూపొందించి ప్రభుత్వానికి అందించాలని మంత్రి కోరారు. మహిళా పోలీసులకు అభిస్తున్న శిక్షణ, మౌలిక వసతులపై ప్రత్యేకంగా దృష్టి పెడతానని ఆమె హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మహిళా పోలీసులకు మరింత ప్రోత్సాహం అందిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. మహిళా పోలీసుల సమస్యల కోసం డిజిపి ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేస్తే బాగుంటుందని మంత్రి సీతక్క సూచించారు. మహిళా పోలీసుల కోసం తమిళనాడు సహా ఇతర రాష్ట్రాలలో కల్పించిన సౌకర్యాలను అధ్యయనం చేయాలని, ఇందుకోసం ఒక బృందాన్ని ఆయా రాష్ట్రాలకు పంపాలని ఉన్నతాధికారులకు ఆమె ఆదేశించారు. మహిళా పోలీసుల ఆరోగ్యం కోసం మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కౌన్సిలింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. మహిళా పోలీసులు పోలీసు స్టేషన్లలో నే బాధితులు మారవద్దని ఆమె కోరారు. భవిష్యత్తులో మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. అంతకు ముందు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్ నేతృత్వంలో మంత్రి సీతక్కకు సాయుధ పోలీసులతో స్వాగతం పలికి సభా వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్స్ అదనపు డిజి స్వాతి లక్రా, సిఐడి చీఫ్ చారు సిన్హా, సీనియర్ ఐపిఎస్ అధికారిణి బాలనాగదేవి, డిఐజి రెమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు

### డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం




**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పని తీరుపై బుధవారం, వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024, 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షా నవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించగా నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేసి.. నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నట్టు మంత్రికి చెప్పారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ విషయంలో ఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటి బయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అక్రిడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని.. తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

# స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించాలి

### ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరలో సిఎం శంకుస్థాపన: మహేష్‌కుమార్

**హైదరాబాద్ ఆగస్టు 20,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమంను ప్రజలకు వివరించి వారి మద్దతు కూడగట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలలో విజయదుందిభి మ్రోగించాలని వందకు వంద సర్పంచ్‌లు,ఎంటిపిసిలు,జడ్పీటిసిలు, ఎంపిపిలు, జడ్పీచైర్మన్లు కైవసం చేసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలతో టిపిసిసి చీఫ్ సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రతి బూత్ లెవల్ లో పార్టీని పటిష్ఠంగా ముందుకు తీసుకొని పొయే అవకాశం ఉంటుందని దాని కోసం కృషిచేయాలని ఆయన మార్గనిర్ధేశనం చేశారు. ఆర్మూర్ నియోజక వర్గంలో స్థానిక సంస్థల అన్నింటనిగెలవాలని అందుకు క్షేత్రస్థాయి లో పనిచేయాలని ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆయనకోరారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కష్టపడి పని చేసి సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ లు అన్ని కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పకడ్బందీగా ప్రణాళికతో ముందుకు పోవాలని అన్నారు. ఆర్మూర్ నియోజక వర్గాన్ని నా స్వంత నియోజక వర్గంగా చూసుకుంటా అని చెప్పారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సమస్యలు వచ్చినా కలిసికట్టుగా పని చేసుకొని పరిష్కరించుకుందామని చెప్పారు. సమస్యలు ఉంటే ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళితే నేనే వెంట ఉండి పని చేసి పెడతా అని అన్నారు. ఆర్మూర్‌కు ప్రభుత్వం నుంచి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు అయిందని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నామని అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో అమలు అయ్యేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేసిందని అన్నారు. బీజేపీ కేంద్రంలో అటు బిల్లు అమలు కాకుండా ఇటు ఆర్డినెన్స్ అమలు కాకుండా అడ్డు పడుతుందని బిజెపి, బిఆర్ ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కు అయ్యి బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడుతున్నాయని ఇది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు.కులాల వాటా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ గాంధీ గారు మొట్టమొదట ఉద్యమాన్ని లేవనెత్తారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గం ఎంతో కృతనిశ్చయంతో బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారని అందుకోసం వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ, ఆర్టీసీ లలో మహిళలకు ఉచిత రవాణా, 500 రూపాయలకు గ్యాస్, 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ, ఎకరాకు 12 వేల రైతు భరోసా, రెసిడెన్షియల్ స్కూల్స్, స్పోర్ట్స్ పాలసీ, ఫోర్త్ సిటీ లాంటి అనేక విప్లవాత్మక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఇవన్నీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా పకడ్బందీగా చేస్తున్న అంశాలలో ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా చూడాలని అన్నారు.



# రాజీవ్‌కు ఘనంగా నివాళులు

### ఎన్ఎస్‌యుఐ రక్తదాన శిబిరంప్రారంభించిన టిపిసిసి చీఫ్

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో మాజీప్రధాన మంత్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, మాజీ ఎంపీ వి హనుమంతరావు.తదితరులు పాల్గొని రాజీవ్ చేసిన కృషి కారణంగానే దేశంలో సాంకేతిక విప్లవం అభివృద్ధి చెందినందని అన్నారు. టపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో కంప్యూటర్ యుగంలోకినడిపారని,నవోదయ విద్యాలయం భావనతో విద్యలో మెరుగైనపద్దతులు తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంను టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

# మద్యం షాపుల టెండర్లకు ఆహ్వానం

**దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు**

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు లైసెన్స్ కాలం ఉంటుందని, ఈ సారి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడకులస్తులకు 15 శాతం,ఎస్సీ సామాజిక వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను కేటాయించనున్నారు.తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ప్రకటించింది.2025-2027 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఎక్సైజ్‌శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.తెలంగాణలోని 2620 మద్యం షాపుల కు లైసెన్స్ కొరకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ కొత్త లైసెన్సుల గడువు డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు ఉంటుంది. ఈసారి దరఖాస్తు రుసుమును రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారు. దుకాణాల లైసెన్సులను వార్షిక ఎక్సైజ్ పన్ను ఆధారంగా లాటరీ ద్వారా కేటాయించనున్నారు.ఈ మద్యం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చింది. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను రిజర్వ్ చేశారు. ఇలా మొత్తం 30 శాతం రిజర్వేషన్లకు కేటాయించారు. వీటితో పాటు.. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా ఒకే దరఖాస్తుదారుడు ఒక దుకాణానికి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించేందుకు అవాకాశం కల్పించారు.మొత్తం ఆరు స్లాబులుగా ఈ లైసెన్సుల ఫీజులను నిర్ణయించారు. ఇది 2011 జనాభా లెక్కల ఆధారంగా రూపొందించబడింది. ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో వార్షిక ఎక్సైజ్ పన్ను రూ. 50 లక్షలుగా, 5,000 నుండి 50,000 మధ్య జనాభా ఉన్నచోట రూ. 55 లక్షలుగా, 50,000 నుంచి ఒక లక్ష వరకు ఉన్న ప్రాంతాలకు రూ. 60 లక్షలుగా, ఒక లక్ష నుంచి ఐదు లక్షల మధ్య జనాభా ఉన్న ప్రదేశాల్లో రూ. 65 లక్షలుగా నిర్ణయించారు. ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు జనాభా ఉంటే రూ. 85 లక్షలు, ఇక 20 లక్షల పైన జనాభా ఉన్న నగరాల్లో వార్షిక ఫీజు రూ. కోటి పది లక్షలుగా ఖరారు చేశారు.లాటరీ ద్వారా దుకాణాలను పొందినవారు వార్షిక లైసెన్స్ రుసుమును ఆరు సమానవాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను, పావు వంతు (25 శాతం)కు సమానమైన బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వానికి సమర్పించాలి. జీహెచ్ఎంసీ, నగర పంచాయతీ పరిధిలో మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవడానికి అనుమతి ఉందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఐ సెట్ కౌన్సెలింగ్‌కి 2065 మంది దరఖాస్తు

### 28 వరకు స్లాట్ బుకింగ్‌కి: సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** రాష్ట్రంలోని ఎంబిఎ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. మొదటి రోజు 2065 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించడానికి షెడ్యూల్‌ను జారీ చేశారు. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్లకూడదనే ఉత్తర్వులు సరికాదు

### తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** దేవాలయ అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్ళకూడదు అని దేవాదాయశాఖ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు ఒక ప్రకటనలో విమర్శించారు. దేవాలయాల్లో అర్చక విధులు నిర్వహిస్తున్నవారు బయట ఈ ఇతర వివాహాది కార్యక్రమాలకు కానీ ఆశీర్వచనాలకు ఇతర దైవిక కార్యక్రమాలకు వెళ్లకూడదు అనేటువంటి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇది కేవలం ఆలయాలలో అర్చకత్వం నిర్వహిస్తున్నటువంటి అర్చకులకే కాదు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి హిందూ మత ప్రచారం పై జరుగుతున్నటువంటి ఒక దౌర్జన్యం అని కూడా అనుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆలయాల అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్న ఈ సమయంలో ఇటువంటి ఉత్తర్వులు మంచిది కాదని ఆయన హితవు పలికారు.ఈ అంశంపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నా ఎందుకు హైకోర్టుకు వెళ్లడం?

### పిసిఘోష్ నివేదికపై ఎందుకు కెసిఆర్, హరీష్ భయపడాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** మా ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తోందని,పిసిఘోష్ నివేదిక అంశంపై కెసిఆర్ హరీష్ రావు హైకోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరం అవినీతి పైన పిసి ఘోష్ ఇచ్చిన కమిషన్ రిపోర్ట్ సారాంశం ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్దకు వెళ్లారని అన్నారు.నివేదిక అసెంబ్లీలో పెట్టకముందే హైకోర్టును ఆశ్రయించడం వల్ల ప్రజలకు నీళ్ళు ఏవో పాలు ఏవో తెలియకుండా పోతుందని అన్నారు. అసెంబ్లీ ముందు నివేదిక ను ఉంచుతామని ఇప్పటికే క్యాబినెట్ తేల్చి చెప్పిందని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి నతర్వాత నివేదిక పైన ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. కాళేశ్వరం కమిషన్ ను చూసి కెసిఆర్, హరీష్ రావు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ పైనహైకోర్టును ఆశ్రయించడంతోనే కెసిఆర్ హరీష్ రావు తాము తప్పు చేశామని ఒప్పుకున్నట్లైందని భాష్యం చెప్పారు. కాళేశ్వరం కమిషన్ కూడా స్వయంగా కోర్టు లాంటిదే.. కమిషన్ ఛైర్మన్ కూడా స్వయంగా మాజీ న్యాయమూర్తి అని ఆయన అన్నారు.కాళేశ్వరం కమిషన్ లేవనెత్తిన అంశాలపైన సమాధానం చెప్పే దమ్ము లేక తప్పించుకోవడానికే కోర్టుకు వెళ్లారని విమర్శించారు. కాళేశ్వరంలో జరిగిన అనేక అవకతవకలను కమిషన్ స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. దాదాపు ఆరు నెలల పాటు అనేక మందిని విచారించిన తర్వాతే కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది.ఇంజనీర్ల ను కాదని కెసిఆర్ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారని ఇంజనీర్ల అఫిడవిట్ ఆధారంగా కమిషన్ తేల్చిందని ఆయన చెప్పారు. హరీష్ రావు, ఈటెల రాజేందర్ కూడా అడ్డగోలుగా వ్యవహరించిందని కమిషన్ స్పష్టం చేసిందని శ్రీనివాస్ ఆరోపించారు. తమ తప్పులను కమిషన్ ఎత్తి చూపడంతో కెసిఆర్ , హరీష్ రావు ఆత్మరక్షణలో పడ్డారని ఆయన అన్నారు. యూరియా కేటాయింపులు ఎవరి పరిధిలో ఉంటాయో కెటిఆర్‌కు తెలియదా అని ఆది ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం 9.80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని కేంద్రానికి ఇండెంట్ పెట్టిందని ఈ ఆగస్టు వరకు 8.30 మెట్రిక్ టన్నులు రావాలి, కాని 5.40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. యూరియా కేటాయింపు పైన కేంద్రం తీరు పైనప్రతిపక్షనేత కెసిఆర్ ఎందుకు స్పందించడంలేదు అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుళ్ళు పైనే కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రైతులపైన కెటిఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్య బట్టారు.మా ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తున్నారు.కెటిఆర్ కెసిఆర్ థర్డ్‌క్లాస్ ఆలోచనలు చేశారు కాబట్టే ప్రజలు ఓడించారని అన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి పైన ఇండియా కూటమి రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంది. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కెసిఆర్ చెప్పి మోసం చేశారు.కంచె ఐలయ్యకు మాపార్టీ ఎంతో గౌరవం ఇచ్చిందని ఆయన తెలిపారు.

# ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడానికే కేంద్రం బిల్లు

**అసెంబ్లీలో పిసిఘోష్ నివేదికపై చర్చిస్తాం, ఆ తరువాత కోర్టుకు వెళ్లు కెసిఆర్: షబ్బీర్‌అలీ**



**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:**ప్రతి పక్షాలను ఇబ్బందులు పెట్టడానికే జైలుకు వెళ్లిన ముఖ్యమంత్రులను తప్పపించాలని కేంద్రం బిల్లు పెడుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలి ఆరోపించారు. గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి విన్న పాలు స్వీకరించి అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ మాట్లా డుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఇంకా పబ్లిక్ లో పెట్టక ముందే కెసిఆర్ కోర్టుకు పోతుండు అంటేనే కెసిఆర్ తప్పిదాలు ఉన్నట్లే భావించాలని ప్రజలకు తెలిపారు. కమిషన్ పై అసెంబ్లీలో బిల్లు పెట్టి చర్చి స్తామని తర్వాత కెసిఆర్‌ను ఎక్కడికైనా పొమ్మను కాళేశ్వరం పై జస్టిస్ గోష్ 15 నెలలు విచారణ చేశారు. అందులో అన్ని తప్పులు ఉన్నట్లు గోష్ కమిటీ చెప్పిందని ఆయన వివరించారు 60 సంవత్సరాల నుండి వర్గీకరణకోసం పోరాటం చేస్తున్న మాదిగల కోసం శమీమ్ అక్తర్ తో కమిషన్ వేసి వర్గీకరణ చేసినం ఎవరి వాటా వారికి కల్పించినం అని ఆయన చెప్పారు. క్యాస్ట్ సెన్సు చేయడం తో 46.25 శాతం రాష్ట్రంలో బిసిలు ఉన్నారని తేలిందని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలు రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి క్యాస్ట్ సెన్సు చేశారని ఆయన అన్నారు. అన్ని రాష్ట్రాలు కూడా తెలంగాణ లాగ కులగణన చేయాలని అడుగుతున్నారని చెప్పారు. బిసి రిజర్వేషన్ లో ముస్లిం లను తీసివేస్తే సపోర్ట్ చేస్తాం అని బిజెపి అంటుందని,గుజరాత్ లో ఉంది అన్ని రాష్ట్రాలలో ఉందిదమ్ముంటే బిజెపి రాష్ట్రాలలో ముస్లిం ల రిజర్వేషన్ తీసివేయండని సవాల్ విసిరారు. మీ బిజెపి పార్టీ జాతీయ పార్టినా కదా?మత పరమైన రిజర్వేషన్ అని బిజెపి నేతలు అంటున్నారు అని ఆయన అన్నారు.స్వాతంత్రం రాకముందు నుండే ముస్లింలకు రిజర్వేషన్ ఉందని ఆయన చెప్పారు. వృత్తి పరంగానే రిజర్వేషన్ ఇస్తున్నాం మతపరంగా కాదు అని ఆయన చెప్పారు. ముస్లింలలోబీద వారు ఉన్నారు.ముస్లింలు బతకొదా అని రాజశేఖర్ రెడ్డి వచ్చాక 4శాతం ఉపాధి,ఉద్యోగాల లో రిజర్వేషన్ ఇచ్చారని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డి ఇంటి ఇంటి సర్వే చేసి ముస్లిం లు బీదవారు ఉన్నారని గుర్తించారని చెప్పారు. ముఖాముఖిలో వచ్చిన అభ్యర్థనలలో ఇందిరమ్మ ఇండ్లు కావాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి అని ఆయన చెప్పారు. భూమి ఉన్న వారికి మొదటి దపా భూమి లేని వారికి రెండో దపా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు.



# బాలుర ఆశ్రమ పాఠశాలలో నిద్రించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నిద్రించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అంతకుముందు కిచెన్ ను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

అనంతరం ఉపాధ్యాయుల రిజిస్ట్రార్ ను పరిశీలించి. వారితో ముఖాముఖి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా? వార్డెన్ల పర్యవేక్షణ ఎలా ఉంది? విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై చర్చించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడటంతోపాటు వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పేద విద్యార్థులే వసతి పొందుతున్నారు. అందులో రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చినవారే అధికంగా ఉంటున్నారు.వీరందరికీ హాస్టళ్ల లో నాణ్యమైన భోజనంతో పాటు మోలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కల్పిస్తున్న వసతులను తనిఖీచేసేందుకు విద్యార్థులతో కలసి వసతి గృహంలో బస చేశాను. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యాను. బేసిక్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు.మన విద్యా విధానం, బోధన పద్ధతులు మార్చాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు.

# నా పుస్తకం- నా కథ పేరుతో కార్యక్రమం: పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పఠశాసక్తిని పెంపొందించడం కోసం పాఠశాల విద్య శాఖ చర్యలు ప్రారంభించింది. ఇందకు సంబంధించి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అయిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ బుధవారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించి రూపొందించిన రీడింగ్ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్(జెడి-బోధన)రాజీవ్, రూమ్ టు రీడ్ రాష్ట్ర లీడ్ నరసింహాచారి పాల్గొన్నారు. తెలంగాణలో అక్షరాస్యతను బలోపేతం చేయడానికి రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించాలని భావించిన పాఠశాల విద్య శాఖ అధికారులు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనాశక్తిని చదవడం అనే నైపుణ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో "నా పుస్తకం- నా కథ" అనే థీమ్ తో. రీడింగ్ క్యాంపెయిన్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఈ ప్రచారాన్ని బుధవారం రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు.

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఈఆర్‌టి) భాగస్వామ్యంతో నిర్వ హించిన లైబ్రరీ పాయింట్ ఉపాధ్యాయుల రాష్ట్ర వ్యాప్త శిక్షణతో సహా పాఠశాల విద్యశాఖ చేపట్టిన ప్రయత్నాలకు కొనసాగింపుగా ఈ ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందని డైరెక్టర్ తెలిపారు.

# ఓటును కాపాడుకుందాం

## సిపిఐ మహాసభల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** అత్యంత క్లిష్టసమస్యల మధ్య దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాలంటే దేశంలో బిజెపి, మోడీల ప్రభుత్వాలకు చెరమగీతం పాడటం తప్పమరోమార్గం లేదని సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి అన్నారు. బుధవారం గాజుల రామారం పొట్లూరి నాగేశ్వరరావునగర్‌లో కామ్రేడ్ బాల మల్లేశ్ హాలు(మహారాజా గార్డెన్స్)లో జరిగిన సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు అందించడంలో దేశంలో ఎన్నికలకమిషన్ ఘోరంగా విఫలమైందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో తటస్థ సంస్థగా నిలవాల్సిన ఎన్నికలకమిషన్ నేడు బిజెపికి, మోడీకి వత్తాసుపలికే సంస్థగా మారిందని విమర్శించారు. సిపిఐ నాలుగవ రాష్ట్రమహాసభకు అతిథిలుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్.కె.నారాయణ, సయ్యద్ ఆజీజ్, సిపిఐ(ఎం)రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలు పార్టీశ్రేణులను ఉద్దేశించి సందేశాన్నిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యదర్శి ఎంఎల్ఎ కూనంనేని సాంభశివ రావు, జాతీయ కార్యవర్గసభ్యులు చాడా వెంకట్‌రెడ్డి,



ప్రజా ప్రదర్శన ర్యాలీలో నినాదాలు చేస్తున్న సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి రాజా, రాష్ట్ర నేతలు

పశ్యపద్మ, సిపిఐ జాతీయసమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెపల్లి శ్రీనివాసరావు, సిపిఐ ఎంఎల్ నెల్లకంటి సత్యం, పి.జె.చంద్రశేఖర్‌రావు, సినీనటుడు మాదాల రవి, ఆహ్వానసంఘ అధ్యక్షులుడి.జి.సాయిల్, ప్రధాన కార్యదర్శి ఇ.ఉమా మహేశ్ వేదికపై ఆసీనులయ్యారు. ఓటుహక్కును 18 ఏళ్లకు సవరిచాల్సిన అవసరాన్ని గుర్తించి పోరాటాల దానిని సాధించిన ఘనత కేవలం సిపిఐ పార్టీకే దక్కుతుందన్నారు.

**ఉపరాష్ట్రపతిగా సుదర్శన్‌రెడ్డికి మద్దతు పలకాలి:** ఎన్‌డిఓ కూటమి బలపరిచిన ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సిపిఐ తమపూర్తిమద్దతు ప్రకటించిందన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉపరాష్ట్రపతి పదవికి ధన్ ఎందుకు రాజీనామా చేశారో తెలపాలని ఆయన డిమాండ్‌చేశారు. అనారోగ్యం కారణంగా ఉపరాష్ట్రపతి రాజీనామా చేయలేదని అనేక ఇతర కారణాలు దాగి ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలవకపోతే దేశంలో అనేకదేశ రాజకీయాలలోనూ తీవ్రప్రభావం చూపుతుందని అన్నారు. కార్మికులు, రైతులు, మహిళలను మరింత బలోపేతం చేయడం ద్వారా కమ్యూనిస్టుపార్టీని బలమైనపార్టీగా రూపొందించాలన్నారు. వీర తెలంగాణ గడ్డపైమతోన్మాద బిజెపి ప్రాభల్యాన్ని అడ్డుకునే శక్తి కేవలం సిపిఐకే ఉందని కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టుల సాయుధ పోరాటాల ద్వారానే తెలంగాణ ఉద్యమం రాజుకుందని దీనిని ప్రజల్లోకి విస్తుతంగా తీసుకువెళ్లేందుకు పార్టీని సన్నద్ధం చేయాలని జాతీయ ప్రధానకార్యదర్శి రాజాకు విజ్ఞప్తిచేశారు. సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ ప్రారంభంనుండే కామ్రేడ్‌లు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రారంభ సభకు సిపిఐ కార్యకర్తలు, నాయకులు ఎర్ర చీరలు, ఎర్రచొక్కాలు ధరించి పెద్దఎత్తున హాజరయ్యారు. దీనితో ప్రాంగణమంతా ఆరుణవర్ణం సంతరించుకుంది.

## సాదా బైనామా భూములపై హైకోర్టులో విచారణ కౌంటర్ దాఖలు చేసిన ప్రభుత్వం,26కు వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు20:** సాదా బైనామా భూములపై తెలంగాణ ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు రిప్లై ఇచ్చింది. 12 ఏళ్ల పాటు భూమి స్వాధీనంలో ఉండి.. ప్రభుత్వం నిర్దేశించినట్టుగా రాత పూర్వక ఒప్పందం ఉంటే సాదా బైనామాలు చెల్లుతాయని ఏజీ కోర్టుకు విన్నవించారు. 2020లో సాదా బైనామాలను ఆపాలన్న మధ్యంతర ఉత్తర్వులు రద్దు చేయాలని ఏజీ ఈ సందర్భంగా కోర్టును కోరారు. అయితే, అడ్వకేట్ జనరల్ కౌంటర్‌కు రిప్లై ఇచ్చేందుకు పిటిషనర్లు సమయం కోరారు. దీంతో హైకోర్టు ఈ కేసు విచారణ ఈనెల 26 కు వాయిదా వేసింది. సాదాబైనామా అంటే ఏమిటి? పూర్వం కొందరు ఇతరుల నుండి భూమిని కొనుగోలు చేసినప్పుడు కేవలం కాగితాలపై ఒప్పందాలు, సంతకాలు మాత్రమే చేసుకునేవారు. అయితే ఇవి అధికారికం కాదు కావున, వీటిపై బ్యాంకులు లోన్స్ ఇవ్వవు. ఇలా రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా సాగు చేసుకుంటున్న వారికి అప్పటి ప్రభుత్వం సాదాబైనామా అవకాశాన్ని కల్పించింది. ఇలాంటి భూములనూ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు కల్పించడం ద్వారా ఎంతోమంది రైతులకు ఒక గొప్ప అవకాశం లభించింది.

## వ్యక్తిగత కారణాలరీత్యా గోవా మంత్రి అలెయిక్సోరాజీనామా

**పనాజీ, ఆగస్టు 20:** వ్యక్తిగత కారణాలరీత్యా గోవా పర్యావరణం, పోర్టులు, న్యాయం, శాసనసభా వ్యవహారాల మంత్రి ఎలెయిక్సో సెక్వెయిరా బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. మధ్యాహ్నం తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రి ప్రమోద్ సీవంత్‌కు ఆయన అందజేశారు. తర్వాత సెక్వెయిరా పొర్వోరియం లోని ప్రభుత్వ ప్రధానకార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల రీత్యా మంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. అలాగే తాను పదవిలో ఉన్నంత సేపు ముఖ్యమంత్రి నుంచి తనకు సంపూర్ణ మద్దతు అందిందని ఆయన అన్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేసి గెలిచిన సెక్వెయిరా .. ఆ తర్వాత అదే సంవత్సరం సెప్టెంబరులో మరో ఏడుగురు ఎమ్మెల్యేలతో కలిసి బిజెపిలో చేశారు. యువజన కాంగ్రెస్‌లో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సెక్వెయిరా పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి తొలిసారిగా 1994 అసెంబ్లీ ఎన్నికల్లో లౌటిలిమ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి 2007 వరకు ఆ స్థానంలో గెలుపొందారు. ఇదిలా ఉండగా.. 1999లో సెక్వెయిరా డిప్యూటీ స్పీకర్‌గా, 2007 నుంచి 2012 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న దిగంబర్ కామత్ మంత్రివర్గంలో మంత్రిగా సేవలందిచారు.

## అవయవ దానానికి ముందుకొచ్చిన ఆర్మీ చీఫ్ దంపతులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీత ద్వివేది తమ అవయవాలను మరణానంతరం దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మరణానంతరం అవయవ దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి అనేక మంది ప్రాణాలను కాపాడగలుగుతారు. అవయవ దానంపై చైతన్యం పెంచేందుకు హర్యానాలోని చండీమందిర్ మిలటరీ స్టేషన్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ద్వివేది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను, తన భార్య మరణానంతరం అవయవ దానం చేస్తామని 'ప్లెడ్జ్' చేశారు. అవయవ దానం ప్రాధాన్యతను ఈ సందర్భంగా ఆర్మీ చీఫ్ వివరించారు. ఏటా సుమారు 20,000 అవయవాల మార్పిడి (ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్స్) ఇండియాలో జరుగుతున్నాయని, గ్లోబల్ ర్యాంకింగ్‌లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. సరిహద్దులను రక్షించడమే కాకుండా సమాజ సంక్షేమం కూడా ఆర్మీ బాధ్యత కావాలని అన్నారు. ఈ బాధ్యతకు కొనసాగింపే అవయదానమని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి 50 వేల టన్నుల యూరియా

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** రాష్ట్రానికి ఈ వారంలో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ ఆమోదం తెలిపింది. కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్‌మెంట్ ప్రారంభమైంది. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు వెళ్లాయి. కాగా ప్రస్తుతం తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. అయితే, యూరియా కొరత సమస్యాత్మకంగా మారింది. గతంలో మాదిరిగా కేటాయింపులకు అనుగుణంగా కేంద్రం యూరియాను సరఫరా చేయకపోవడం, కోటాలో నెలనెలా కోతలు విధిస్తుండటంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 1.15కోట్ల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. ఎరువులను అధికంగా వాడే పత్తి దాదాపు లక్ష ్యం మేరకు, మొక్కజొన్న విస్తీర్ణం కంటే అధికంగా సాగు చేస్తున్నారు. దీంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. చాలా ప్రాంతాల్లో యూరియా కొరతతో రైతులు దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

## ఫీజుల నిర్ణయానికి ఆడిట్‌తోపాటు.. అకడమిక్ ప్రామాణికాలు ముఖ్యమే

### న్యాక్, ఎబిఎ గుర్తింపులను పరిగణనలోకి తీసుకోవాలి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అధికారుల కమిటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్య కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు ఇకపై ఆడిట్ రిపోర్టుతోపాటు ఆయా కాలేజీల అకడమిక్ ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. అలాగే కాలేజీలకు జాతీయ సంస్థల నుంచి లభించే న్యాక్, ఎన్‌బిఎ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ తమ నివేదికలో ప్రతిపాదించింది. ఫీజుల నిర్ధారణ కోసం ప్రతిపాదనలు సమర్పించడం కోసం ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ తన నివేదికను బుధవారం ప్రభుత్వానికి సమర్పించింది. అయితే కమిటీ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించే కంటే ముందు మంగళవారం కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైనట్టు తెలిసింది. ఫీజుల ఖరారు విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. విద్యార్థు లకు వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామని.. అటువంటప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యనుఅందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చదువు కోవడానికి వచ్చేలా చూడాలని వారికి 75 శాతం హాజరు తప్పనిసరిగాఉండే నిబంధనలను కొనసాగించాలని సూచించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని ప్రొఫెషనల్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజుల ఖరారు విధివిధానాల రూపకల్పనకు నియమించిన అధికారుల కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కాలేజీల్లో ఫీజులపై కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేసేందుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ సర్కారుకు తమ నివేదికను అందజేసింది. తమ ప్రతిపాదనల్లో ప్రధానంగాప్రస్తుతం ఆడిటర్లు ఆమోదించిన ఆర్థిక నివేదికల ఆధారంగా ఫీజులను ఖరారు చేస్తున్నారని, ఇకపై ఆడిటర్లు ఆమోదించిన నివేదికల తోపాటు మరికొన్ని అంశాలను సైతం పరిగణిలోకి తీసుకోవాలని సిఫారసు చేసింది.

## బాచుపల్లిలో ఘోరం

## కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను సంపులో వేసి చంపి, తల్లి ఆత్మహత్యాయత్నం



రత్నమ్మ, మృతిచెందిన పిల్లలు(ఫైల్)

**కొంపల్లి, ఆగస్టు 20, ప్రభాతవార్త:** భార్యాభర్తల మధ్య చెలరేగిన కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపానికి గురైన భార్య ఇద్దరు చిన్న పిల్లలను నీటి సంపులో వేసి చంపి తాను అందులో దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఆసు పత్రి పాలైంది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన లక్ష్మణ్, రత్నమ్మ దంపతులు. వీరికి నలు గురు సంతానం. జగన్ (08), పవన్ (07), అరుణ్ (03), సుభాన్8 నెలలు. అయితే లక్ష్మణ్ రత్నమ్మ దంపతులు ఉపాధి కొరకు బాచుపల్లిలో నివాసం ఉం టున్నారు. వీళ్ళ కుమారులు జగన్, పవన్‌లను సొంత ఊరిలోనే ఉంచి చిన్న వారైనా అరుణ్, సుభాన్‌లను తమతోనే ఉంచుకున్నారు. గత కొంతకాలంగా దంపతుల ఇద్దరి మధ్య కుటుంబ నియంత్రణ, ఇతర ఆర్థిక విషయాలలో తీవ్రమైన విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. బుధవారం తెల్లవారుజామున ఇదే విషయమై భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. అనంతరం లక్ష్మణ్ బయటికి వెళ్లిపోవడంతో రత్నమ్మ తీవ్ర మనోవేదనకు గురై, జీవితంపై విరక్తి చెంది తన కుమారులైన అరుణ్ (03), 8 నెలల వయసున్న సుబాన్‌ను తాను ఉంటున్న అద్దె ఇంట్లోనే నీటి సంపులోకి తోసివేసి చంపేసింది. అనంతరం తాను ఆత్మహత్య చేసుకోవడానికి అదే సంపులోకి దూకింది. ఆ సమయంలో పక్కింటి వ్యక్తి కాలకృత్యాల కొరకు నిద్రలేచి ఏదో గట్టి చప్పుడు వినిపించడంతో రత్నమ్మ నివసిస్తున్న ఇంట్లోకి చూశాడు. దీంతో ఆయనకు పరిస్థితి అర్థమయి చుట్టుపక్కల వారిని నిద్రలేపి వారి సహకారంతో సంపులోకి దూకి రత్నమ్మను మొదటగా బయటికి తీశారు. అనంతరం చిన్నపిల్లల ఇద్దరినీ అరుణ్ సుభాన్‌లను కూడా నీటి సంపు నుండి బయటికి తీశారు. అయితే చిన్న పిల్లలు ఇద్దరు అప్పటికే చనిపోగా, రత్నమ్మ మాత్రం స్థానికులు సపర్యలు చేయడంతో బతికిపోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. రత్నమ్మను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన బాలలు అరుణ్, సుభాన్‌ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సికింద్రాబాద్ రైళ్ల స్టేషన్ల మార్పు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల కారణంగా ఇక్కడి నుంచి వెళ్లాల్సిన రైళ్లను పలు స్టేషన్లకు మార్పు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. అక్టోబరు 20 నుంచి 26వరకు రైళ్లు బయలుదేరే స్టేషన్ల వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్-పోర్‌బందర్ సర్వీస్ ఉందానగర్ నుంచి కాగా సిద్దిపేట- సికింద్రాబాద్ రైలు మాల్కాజిగిరి నుంచి, పుణే-సికింద్రాబాద్ సర్వీస్ హైదరాబాద్ స్టేషన్‌నుంచి వెళ్తాయని వివరించింది. అదేవిధంగా సికింద్రాబాద్ స్టేషన్ నుంచి చర్లపల్లి పలు రైళ్ల సర్వీసులను మార్చారు. సికింద్రాబాద్ నుంచి మణుగూర్, రేపల్లె, సిల్చార్, దర్భంగా, యశ్వంత్‌పూర్, అగర్తలా, ముజఫర్‌పూర్,సంత్రగచ్చి,దానాపూర్, రామేశ్వరం వెళ్లే రైళ్లు మార్పులు చేశారు.

## అన్ని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఇంటిగ్రేటెడ్ పరిధిలోకి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సిఎంరేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల,ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు రాగావీటిలో 2లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా సుమారు 4లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర హైకోర్టు ఈ సాదాబైనామాలపై ఉన్నస్టేను తొల గించడంతో నిజమైన, అర్హత కలిగిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జిహెచ్ఎంసీ, ఓఆర్ ఆర్ పరిధిలోగల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపేణా సుమారు 6263 శాతం ఆదాయం లభిస్తోందని, వీటిని 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకు వస్తామని తెలిపారు. శంకుస్థాపన చేస్తున్న భవనం అత్యా ధునిక కార్పొరేట్ స్థాయిలో ఉండబోతోందని,సుమారు మూడు ఎకరాలలోని దాదాపు 50 వేల చదరపు అడు గుల విస్తీర్ణంలో 300 కార్లు పార్కింగ్ సౌకర్యం తదిత రాలతో నిర్మితమవబోతోందన్నారు.

ఫైవ్ స్టార్ సౌకర్యాలు సుమారు 89 నెలల్లో ఈ భవనాన్ని నిర్మిస్తామని నిర్మాణసంస్థ చెబుతోందని,అయితే 67 నెలల్లోగా పూర్తి చేయాలని సభా ముఖంగా కోరారు.సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ భవనం ప్రారంభిస్తామని చెబుతూ దశల వారీగా మిగిలిన 10 ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రే షన్ భవనాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అన్ని సౌక ర్యాలతో ఇటువంటి భవనాల నిర్మాణం చేపడతామన్నారు.

## మౌలిక సదుపాయాల కోసం రూ.700కోట్లు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపించాం:మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్ని గిరిజన తాండాలు, గుడాలలో రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు అభివృద్ధికై రాష్ట్ర గిరిజన శాఖ ద్వారా రూ.700 కోట్ల రూపాయాలను ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయండం జరిగిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన తాండాలను, గుడాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసేందుకు ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలు చేస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ శాఖల అభివృద్ధికై కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి రాబట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే తాను కేంద్ర గిరిజన శాఖ మంత్రి ఢిల్లీలో పలుమార్లు కలసి ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని కోరడమైనదని ఆయన తెలిపారు.రాష్ట్రంలో అన్ని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలో నాణ్యమైన బోజన సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు..ఈ విలేఖరుల సమావేశంలో సాంఘిక సంక్షేమ, గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని పాల్గొన్నారు.

## ఎరువుల సరఫరాపై కాంగ్రెస్ అబద్ధాల ప్రచారం

### అవసరానికి మించి యూరియా ఇచ్చిన కేంద్రం

### కాంగ్రెస్ మిస్ మేనేజ్‌మెంట్ వల్లే కృత్రిమ కొరత

### ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ బిసిలకు అన్యాయం

### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** తెలంగాణలో ఎరువుల సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు.బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ నిజానికి కేంద్రం అవసరానికి మించిన యూరియాను తెలంగాణకు సరఫరా చేసిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మిస్‌మేనేజ్‌మెంట్ వల్ల కృత్రిమ కొరత సృష్టించిందని ఆరోపించారు. రైతులను భయపెట్టి రన్ ఆన్ ఫర్టిలైజర్ పరిస్థితిని తీసుకువచ్చింది కాంగ్రెసేనని అన్నారు. ఆయన స్పష్టం చేశారు. ఇఫ్కో-క్రిబ్‌కో-ఆర్‌సిఎఫ్ నుంచి 7,250 రేక్స్ యూరియా రాష్ట్రానికి వచ్చిందనాననరు. కరీకల్ పోర్ట్ దిగుమతులలో 10,000 మెట్రిక్ టన్నులు ప్రత్యేకంగా తెలంగాణకు కేటాయించిందని వివరించారు. ప్రపంచ సమస్యల మధ్య కూడా కేంద్రం వెనుకాడలేదని, రైతుల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025 రబీ సీజన్ (అక్టోబర్ 2024 - మార్చి 2025)లో తెలంగాణకు అవసరమైన 9.87 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా స్థానంలో 12.47 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మినది 10.43 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని, మిగిలింది 2.04 లక్షల టన్నులు ఖరీఫ్ సీజన్ ఓపెనింగ్ స్టాక్‌గా ఉందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ (ఆగస్టు 2025 వరకు)లో కావాల్సిన 8.30 లక్షల మెట్రిక్ టన్నులలో ఇప్పటివరకు 5.18 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం సరఫరా చేసిందన్నారు. ఈ రోజు వరకు మొత్తం అందుబాటులో ఉన్న యూరియా - 7.22 లక్షల మెట్రిక్ టన్నులని, అసలు సమస్య - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ముందుగానే స్టాక్ లేదని అబద్ధాలు చెప్పడం. ఇది మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కాంగ్రెస్ గవర్నమెంట్ అన్నారు.

## 21 యేళ్లు నిండిన వారు ఎమ్మెల్యేగా పోటీ చేసేలా చట్ట సవరణ

### ఆ కలల సాకారానికి రాహుల్‌ను ప్రధానిని చేసేవరకు విశ్రమించం

### సచివాలయం ముందు రాజీవ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు20:** మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రాల శాసనసభలకు పోటీ చేసే వయో పరిమితిని 25 ఏళ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించేందుకు తమవంతు కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం యువత చేతుల్లో ఉండాలన్న ఉద్దేశంతోనే రాజీవ్ గాంధీ ఓటు హక్కు పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, అదే స్ఫూర్తితో చట్ట సభల్లో పోటీ చేయడానికి వయో పరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. బుధవారం భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న వారి విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసుకుని 21 ఏళ్ల నిండిన వారు, శాసనసభకు పోటీ చేసేలా చట్టాన్ని సవరించేదుకు కృషి చేస్తామన్నారు. ఆ కలలన్నీ సాకారం కావాలంటే దేశానికి రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు. రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించబోమన్నారు. ఈ దేశంలో యువతకు అవకాశాలు కల్పించడానికి రాజీవ్ గాంధీ అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. చట్ట సభల్లో మహిళలకు సముచితమైన స్థానం కల్పించినప్పుడే సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి వీలు కలుగుతుందన్న సంకల్పంతో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు పునాది వేశారని పేర్కొన్నారు గాంధీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రాజీవ్ గాంధీ దేశంలో పారదర్శకమైన పరిపాలన, నిరుపేదలకు సంక్షేమ పథకాలు చేరడానికి ప్రభుత్వ నిర్ణయాల్లో సాంకేతిక నైపుణ్యాన్ని జోడించారని చెప్పారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికాం రంగాల్లో తీసుకొచ్చిన సాంకేతిక సంస్కరణల వల్ల ఈరోజు తెలుగు రాష్ట్రాల ప్రజలు ప్రపంచంతో పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ హయాంలో హైటెక్ సిటీకి వేసిన పునాది రాయి నేపథ్యం నుంచి క్రమేపీ హైదరాబాద్ ఈరోజు ఐటీ కంపెనీలు, డేటా,జీసీసీ సెంటర్లకు కేంద్రంగా, దేశంలోనే మొట్టమొదటి సిటీగా మారిందన్నారు. వారి స్ఫూర్తితోనే హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ శ్రేణి అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు.అమరుడైన రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు పోతుంది. వారిని ఆదర్శంగా తీసుకునే గుండెకాయ లాంటి సచివాలయం ముందు వారి విగ్రహాన్ని ప్రతిష్టించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్

### అంగన్వాడి నూతన భవనాల నిర్మాణానికి ఉచిత ఇసుక

### మహిళా శిశు సంక్షేమం, టీజీ ఫుడ్స్‌పై మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలపై మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడి భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల తరహాలోనే అంగన్వాడి కేంద్రాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంజూరైన 1025 అంగన్వాడి భవనాలలో ఇప్పటివరకు 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారని.. మిగిలిన ప్రాంతాల్లో స్థల గుర్తింపు తక్షణం పూర్తిచేయాలని సూచించారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.12 లక్షలు కేటాయించినట్లు గుర్తుచేశారు. పనుల జాతరలో భాగంగా నూతన భవనాల శంకుస్థాపనలు జరగాలని, ఇప్పటికే పూర్తి చేసిన 22 అంగన్వాడి భవనాలను స్థానిక ఎమ్మెల్యేల చేత ప్రారంభించాలన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల యూనిఫాం చీరల తయారీ పూర్తై జిల్లా కేంద్రాలకు చేరాయని, వాటిని తక్షణమే పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. చిన్నారుల కోసం త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే హైదరాబాద్‌లోని 139 అంగన్వాడి కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ స్కీమ్ కారణంగా పిల్లల హాజరు 30 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ అనుభవంతో త్వరలోనే పలు జిల్లాల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను విస్తరించనున్నట్లు వెల్లడించారు. పిల్లల పోషకాహారాన్ని మెరుగుపరచడం కోసం ప్రతి చిన్నారికి ఉదయం 100 మి.లీ. పాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ప్రతి వారం ఒక రోజు ఎగ్ బిర్యానీ, ఒక రోజు వెజిటేబుల్ కిచిడి వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పిల్లలకు రుచికరమైన ఫుడ్స్ అందించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. టీజీఫుడ్స్‌పై మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పిల్లలకు ఇచ్చే ఫుడ్స్‌లో షుగర్ కంటెంట్ తగ్గించి, మిల్క్ కంటెంట్ పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టీజీ ఫుడ్స్ పరిశ్రమలో నెలకు 2600 మెట్రిక్ టన్నుల బాలమృతం, బాలమృతం ప్లస్, స్నాక్స్ ఉత్పత్తి జరుగుతుందని, పరిశ్రమకు మరింత సామర్థం ఉందని మంత్రి పేర్కొన్నారు.

## రామంతాపూర్ ఘటనకు అందరూ బాధ్యులే: తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి కేబుల్ వైరు తగిలి విద్యుదాఘాతంతో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఐదుగురి ప్రాణాలు పోవడానికి విద్యుత్ స్తంబాలపై అమర్చిన కేబుల్ వైర్లు కారణమని, వెంటనే వైర్లనుతొలగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రంగంలోకి దిగిన విద్యుత్ సిబ్బంది నగరంలోని అన్ని ప్రాంతాల్లో కేబుల్ వైర్ల తొలగింపును చేపట్టారు. ఈ క్రమంలో కేబుళ్ల తొలగింపు అంశంపై భారతీ ఎయిర్‌టెల్ టెలికామ్ సంస్థ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ నగేష్ భీమపాక.. కేబుళ్ల పునరుద్ధరణ సమస్య కాదని, ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీహెచ్ఎంసీ, సర్వీస్ ప్రొవైడర్లు ఎవరికి వారు చేతులు దులిపేసుకుంటే ఎలా? ఈ దుర్ఘటనకు అందరూ బాధ్యులే. మనుషులంటే కాస్త దయ చూపాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. అయితే విద్యుత్ స్తంభాలను వినియోగించుకుంటున్నందుకు డబ్బులు చెల్లిస్తున్నామని పిటిషనర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. కానీ, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కేబుల్ వైర్లను కట్ చేస్తున్నారని, ఇంటర్నెట్ అంతరాయంతో పలుచోట్ల సేవలు నిలిచిపోయాయని చెప్పారు. ప్రజల ప్రాణాలే పోతుంటే ఇంటర్‌నెట్ సేవలు ఎందుకని టీజీఎస్పీడీసీఎల్ తరపు న్యాయవాది అన్నారు. విద్యుత్ స్తంభాలకు పరిమితికి మించి కేబుళ్లు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల తొలగింపు అంశంపై టీజీఎస్పీడీసీఎల్, జీహెచ్ఎంసీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అప్పటివరకు కేబుల్ వైర్లను తొలగించవద్దని ఆదేశించింది.

## సమ్మెలతో ఇండస్ట్రీని చిక్కుల్లోకి నెట్టడం పద్ధతి కాదు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు20:** హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తుంటే ఇలా సమ్మెలతో ఇండస్ట్రీని చిక్కుల్లోకి నెట్టడం కరెక్ట్ కాదని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వేతనాలు పెంచాలని కొన్ని రోజులుగా సినీ కార్మికులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫెడరేషన్ సభ్యులు, సినీ నిర్మాతలు పలుమార్లు చర్చలు జరిపినా కూడా సఫలం కాలేదు. దీంతో తాజాగా ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యంచేసుకుంది. ఫిల్మ్ చాంబర్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మె ప్రభావం సినిమా పాలసీపై పడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, వేతనాల పెంపు కోసం ఫెడరేషన్ సభ్యులు చేస్తున్న సమ్మెకు బుధవారంతో 17 రోజులు గడిచింది. సమ్మె కారణంగా షూటింగ్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. 30 శాతం వేతనాలు పెంచాలని కార్మికులు, ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్నామని తాము అంత పెంచలేమని నిర్మాతలు ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు.

# 29న రానున్న 'త్రిబాణధారి బార్బరిక్'

**ఓ సినిమాను** తెరకెక్కించడం కంటే సరైన రిలీజ్ టైం, కావాల్సినన్ని థియేటర్లను బ్లాక్ చేసుకుని ప్రేక్షకుల ముందుకు తీసుకు వెళ్లడమే గొప్ప విషయం. సరైన రిలీజ్ డేట్ దొరికి.. అనుకునన్ని థియేటర్లు లభిస్తే.. భారీ రిలీజ్ దక్కితే ఆ చిత్రానికి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే మంచి రిలీజ్ డేట్ కోసం చూసినచి 'త్రిబాణధారి బార్బరిక్' టీం మూవీని ఆగస్ట్ 29న భారీ ఎత్తున విడుదల చేయనుంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రను పోషించగా.. వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పాటలు, టీజర్ ఇలా అన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ట్రైలర్ ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది. విజువల్స్, ఆర్ ఆర్ ఇలా అన్నీ కూడా ఆకట్టుకున్నాయి. మోహన్ శ్రీవత్స మేకింగ్, ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ సంగీతం ఇప్పటికే అందరిలోనూ ఆసక్తి పెంచేసింది. నిర్మాత విజయ్ పాల్ రెడ్డి మొదటి ప్రాజెక్ట్ అయినా కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించారు. ఇక ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల అయిన పాటలు అయితే శ్రోతల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. మరీ ముఖ్యంగా ఈ చిత్రానికి కుశేందర్ రమేష్ రెడ్డి అందించిన విజువల్స్ అందరినీ ఆశ్చర్య పరిచేలా ఉన్నాయి. బార్బరిక్ కాన్సెప్ట్ ఇప్పటికే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే డిఫరెంట్ ప్రమోషన్స్ చేస్తూ సినిమాను జనాల్లోకి తీసుకెళ్తున్నారు. 'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఆగస్ట్ 22న విడుదల కావాల్సి ఉంది. కానీ సరైన రిలీజ్ డేట్, కావాల్సినన్ని థియేటర్లు లభించడం కోసం ఆగస్ట్ 29కి వాయిదా వేశారు. ఇక ఈ 'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఆగస్ట్ 29న గ్రాండ్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.



# 'చాయ్ వాలా' చిత్రం అందరికీ నచ్చుతుంది

## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత రాజ్ కందుకూరి..



**యంగ్, ప్రామిసింగ్** యాక్టర్ శివ కందుకూరి హీరోగా 'చాయ్ వాలా' అనే చిత్రాన్ని హార్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విజయ లక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వం వహించారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. ఇక బుధవారం (ఆగస్ట్ 20) నాడు ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. 'నా చాయ్ విలువ రూ. 15.. అంతకన్న ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా.. నా విలువ పడిపోతుంది' అంటూ రాజీవ్ కనకాల చెప్పిన డైలాగ్‌తో టీజర్ అద్భుతంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ.. .. 'చాయ్ వాలా' టైటిల్‌ను నిర్మాత వెంకట్ గారే నిర్ణయించారు. అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్ ఇది. 'చాయ్ వాలా' చిత్రాన్ని చూసిన తరువాత ఎమోషన్‌తో బయటకు వెళ్తారు. రాజీవ్ కనకాల గొప్ప యాక్టర్. రెండేళ్ల క్రితం కథ చెప్పినప్పుడే రాజీవ్ కనకాల తండ్రి పాత్రను పోషించిస్తారని డైరెక్టర్ ప్రమోద్ చెప్పారు. ఇమ్రాన్ రైటింగ్ చాలా అద్భుతంగా ఉంటుంది. తేజు అశ్వినికి తెలుగులో చక్కటి భవిష్యత్తు ఉంటుంది. ప్రమోద్ రాసిన మంచి కథకు, మంచి నటీనటులు కలిసి వచ్చారు. శివ స్నేహితుడిగా ఇందులో కసిరెడ్డి చాలా చక్కగా నటించారు. క్రాంతి గారు చక్కటి విజువల్స్ ఇచ్చారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లోకి రానుంది. ప్రమోద్ హర్ష అనే వ్యక్తి మంచి దర్శకుడిగా నిలబడతారు.. శివకు మంచి పేరు వస్తుంది.. నిర్మాత వెంకట్ గారు ఇలాంటి మంచి చిత్రాలెన్నో నిర్మించాలి. 'చాయ్ వాలా' చిత్రం ఎమోషనల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది. ఈ మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది అని అన్నారు. శివ కందుకూరి మాట్లాడుతూ.. .. 'చాయ్ వాలా' టీంతో నాకు మంచి బంధం ఏర్పడింది. ప్రమోద్ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మా నిర్మాత ఈ కథను మాకంటే ఎక్కువగా నమ్మారు. ఈ ప్రయాణంలో ప్రమోద్ నాకు మంచి స్నేహితుడిగా మారిపోయారు. రైటర్ ఇమ్రాన్, డీఓపీ క్రాంతి, ఆర్ట్ సుప్రియ ఇలా మంచి టీంతో ప్రమోద్ మూవీని తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని చూసి వచ్చిన తరువాత తండ్రితో కాసేపు మాట్లాడతారు. థియేటర్ నుంచి ఓ మంచి ఎమోషన్‌తోనే బయటకు వస్తారని మాత్రం కచ్చితంగా చెప్పగలను. రాజీవ్ కనకాల గారితో పని చేసిన క్షణాల్ని నా జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. ఆయ న్నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. తేజుతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ఆమె చాలా మల్టీ టాలెంటెడ్. మా 'చాయ్ వాలా' చిత్రం త్వరలోనే థియేటర్లోకి రానుంది. అందరినీ ఆకట్టుకునేలా మా మూవీ ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు ప్రమోద్ హర్ష మాట్లాడుతూ.. .. 'శివకే ఈ కథను చెప్పాను. కథకు తగ్గట్టుగా ఫేస్‌లోనే ఓ సెన్సిబిలిటీ, ఓ జాలీ కనిపించాలి. అందుకే శివకి 'చాయ్ వాలా' కథను చెప్పాను. నేను రాసుకున్న పాత్రలు, కథ నుంచే'చాయ్ వాలా' టైటిల్‌ను తీసుకున్నాను. ప్రతీ మనిషి జీవితంలో జరిగే సంఘటనలే మా చిత్రంలో ఉంటుంది. ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా మా సినిమా ఉంటుంది అని అన్నారు. నిర్మాత వెంకట్ ఆర్. పాపుడిప్పు మాట్లాడుతూ ఈ మూవీ లోని కొన్ని సీన్లను ఆల్రెడీ చూశాను. ఇదొక సెన్సిబుల్ లవ్ స్టోరీ. అందరినీ ఆకట్టుకునేలా ఈ మూవీని తీశార'ని అన్నారు. తేజు అశ్విని మాట్లాడుతూ.. .. 'తెలుగులో నాకు 'చాయ్ వాలా' మొదటి చిత్రం. రాజీవ్ కనకాల వంటి సీనియర్ ఆర్టిస్ట్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. శివ గారు అద్భుతమైన కో ఆర్టిస్ట్. క్రాంతి గారు మా అందరినీ అందంగా చూపించారు. సెట్‌లో మా అందరినీ రాజ్ కందుకూరి గారు ఎంకరేజ్ చేస్తుండేవారు. 'చాయ్ వాలా' అందరికీ నచ్చుతుంది' అని న్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. ..'నిర్మాత వెంకట్ రెడ్డి 'చాయ్ వాలా' కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. 'చాయ్ వాలా' కథ నాకు చాలా నచ్చింది.ప్రమోద్ ఏడాదికి కనీసం రెండు చిత్రాలైనా చేయాలి. ప్రతీ సీన్‌ను ఎంతో వివరించి నటీనటుల నుంచి నటనను రాబట్టుకునేవాడు. రాజ్ కందుకూరి గారు ఈ సినిమా మీద మా అందరి కంటే ఎక్కువ నమ్మకంగా ఉండేవారు. కసిరెడ్డి అద్భుతమైన నటుడు. మా డీఓపీ క్రాంతి ఎంతో వేగంగా పని చేసేవారు. రచయిత ఇమ్రాన్ గారు కూడా సెట్స్‌కి వచ్చి సపోర్ట్ చేస్తుండేవారు. సుప్రియ గారి ఆర్ట్ వర్క్ కూడా అద్భుతంగా ఉంటుంది. తేజు అశ్వినితో నాకు కొన్ని సీన్లే ఉంటాయి. తేజు చాలా చక్కగా నటించారు. శివ కందుకూరి బోలెడంత ఆకలితో ఉన్న ఆర్టిస్ట్. నా పక్కన ఎక్కడా తగ్గకుండా ఉండాలని ఎంతో తపన పడి నటించేవాడు. ఆ ఆకలితో ఉన్న శివ కందు కూరి ఎంతో ఎత్తుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. 'చాయ్ వాలా' అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. నటుడు రాజ్ కుమార్ కసిరెడ్డి మాట్లాడుతూ.. .. ప్రమోద్ నాకు నాలుగేళ్లుగా తెలుసు. ఈ కథ ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. అందరినీ ఆకట్టుకునేలా ఈ మూవీని తెరకెక్కించారు. రాజీవ్ కనకాల గారు పండించిన ఎమోషన్, ఆయన పాత్ర ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. శివతో నటించడం చాలా ఆనందంగా ఉంది. శివతో మళ్లీ మళ్లీ నటించాలని ఉంది. తేజు అశ్వినీ గారు అద్భుతంగా నటించారు. రాజ్ కందుకూరి గారే మాలాంటి కొత్త వాళ్లందరినీ మొదటగా అభినందించారు. కొత్త వారిని ఎంకరేజ్ చేసేందుకు ఆయన ఎప్పుడూ ముందుంటారు. 'చాయ్ వాలా' చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది' అని అన్నారు.



# సుకృతి వేణిని అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి

**ఇటీవల** ప్రకటించిన జాతీయ అవార్డ్స్ లో 'గాంధీ తాత చెట్టు' చిత్రానికి గాను ఉత్తమ బాలనటిగా అవార్డుకు ఎంపికైన ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి వేణిని ముఖ్యమంత్రి రేవంతి రెడ్డి అభినందించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉత్తమ బాలనటిగా పురస్కారానికి ఎంపికైన సుకృతి వేణితో పాటు ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర సమర్పకురాలు, సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ 'గాంధీ తాత చెట్టు' చిత్ర నిర్మాతలు వై.రవిశంకర్, శేష సింధురావులు సిఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుకృతివేణితో పాటు నిర్మాతలను ఈ సందర్భంగా సత్కరించారు. 71 జాతీయ అవార్డ్స్‌లో 'గాంధీ తాత చెట్టు' చిత్రానికిగాను సుకృతివేణి ఆ చిత్రంలో ఉత్తమ నటనకు ఉత్తమ బాలనటిగా పురస్కారం దక్కించుకున్నారు. పద్మావతి మల్లాది దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, గోపీ టాకీస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై శ్రీమతి తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేనీ, వై.రవిశంకర్, శేష సింధురావులు ఈ చిత్రాన్ని నిర్మించారు. అందరి హృదయాలను హత్తుకున్న చిత్రంగా 'గాంధీ తాత చెట్టు' ప్రశంసలు అందుకున్న సంగతి తెలిసిందే.

# క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్‌ఎల్‌పి బేనర్‌లో నూతన చిత్రం ప్రారంభం




**రోహిత్ వర్మ** కథానాయకుడిగా రియా సుమన్ నాయికగా నటిస్తోన్న నూతన చిత్రం మంగళవారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్.ఎల్.పి. బేనర్ లో నజీర్ జమాల్ నిర్మిస్తుండగా, గోవిందరెడ్డి చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. హీరో హీరోయిన్లపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి విజయ్ కనకమేడల క్లాప్ కొట్టగా, సీనియర్ దర్శకుడు రామ్ ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. మరో దర్శకుడు మల్లిఖార్జున గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రగతి, వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిత్రం గురించి నిర్మాత నజీర్ జమాల్ మాట్లాడుతూ.. తెలుగులో నాకిది మొదటి సినిమా. కథ విన్న తర్వాత బాగా నచ్చి సినిమా చేయడానికి ముందుకు వచ్చాను. రోహిత్ హీరోగా నటిస్తున్నాడు. ఇందులో పాటలు అద్భుతంగా వుంటాయి. దర్శకుడు కథకు అనుగుణంగా నటీనటుల ఎంపిక చేయడం జరిగింది. కథానాయకుడు రోహిత్ వర్మ మాట్లాడుతూ.. దర్శకుడు అద్భుతమైన కథ చెప్పారు. ఈ సినిమాతో తెలుగులోకి రావడం చాలా ఆనందంగా వుంది. సినిమాకి సీనియర్ సాంకేతిక సిబ్బంది పనిచేస్తున్నారు. తెలుగు ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలని నా మనసులో కోరిక వుండేది. ఈ చిత్రంలో అది కుదిరింది. చిత్రం కోసం తెలుగు బాగా నేర్చుకుంటున్నాను. అందరూ మెచ్చే సినిమా అవుతుందని నమ్మకం ఉంది. హీరోయిన్ రియా సుమన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో పనిచేయడం ఆనందంగా వుంది. మంచి పాత్రను పోషిస్తున్నాను. ఇందుకు దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే ఈ సినిమాకు మంచి టైటిల్ పెట్టబోతున్నారు. వినాయకచవితికి తెలియజేయనున్నారు. తొలుత మోంటేజ్ సాంగ్‌లో రేపటినుంచి షూటింగ్ ప్రారంభిస్తున్నాం. చక్కటి సాహిత్య, సంగీతం ఈ కథకు బాగా కుదిరింది. నటుడు నిఖిల్ దేవేదుల మాట్లాడుతూ.. ఈ రోజు మంచి ముహూర్తంతో ప్రారంభించి నందుకు ఆనందంగా వుంది. చక్కటి పాత్రను పోషిస్తున్నాను. అందరూ ఆశీస్సులు కావాలి.నటి అక్షర మాట్లాడుతూ.. సినిమాలో భాగమైనందుకు ఆనదంగా వుంది. అందరూ చూడతగ్గ సినిమా ఇది అన్నారు. దర్శకుడు గోవిందరెడ్డి చంద్ర మాట్లాడుతూ.. క్రేజీ కింగ్ ప్రొడక్షన్‌లో క్రేజీ కథతో రాబోతున్నాం. ఛోటాకె. ప్రసాద్, మణిశర్మ వంటి సీనియర్స్ ఈ సినిమాకు పనిచేస్తున్నారు. కథ అందరికీ కనెక్ట్ అయ్యేవిధంగా వుంటుంది. రోహిత్ హిందీలో చేశాడు. తెలుగులో మొదటి సినిమా. రియా కథ నచ్చి బాగా సపోర్ట్ చేసింది. ఇది పక్కా కమర్షియల్ సినిమా అవుతుందనే నమ్మకముంది. పూర్తి వివరాలు వినాయకచవితికి తెలియజేస్తాం అన్నారు.




# 'కాంతార చాప్టర్-1' నుంచి గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్ విడుదల



**మోస్ట్ ఎవైటెడ్** బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీ కాంతార చాప్టర్ 1 నిర్మాతలు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. రిషబ్ శెట్టి బ్లాక్‌బస్టర్ కాంతారకు ప్రతిష్టాత్మక ప్రీక్వెల్‌లో కులశేఖర పాత్రలో నటిస్తున్నాడు గుల్షన్ దేవయ్య. ఈ అనౌన్స్ మెంట్ ఫ్రాంచైజీ అభిమానులలో ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవు తోంది. రిషబ్ శెట్టి రచన, దర్శకత్వం వహించి తానే మళ్లీ సెంట్రల్ క్యారెక్టర్‌గా నటిస్తున్న 'కాంతార చాప్టర్-1' మొదటి పార్ట్‌లో ఉన్న యూనివర్స్‌ని ఇంకా విస్తరించబోతోంది. తొలి సినిమా రా, ఫోక్‌లోర్, ఆధ్యాత్మికత, భావోద్వేగా లతో రూటెడ్ స్టోరీటెల్లింగ్‌కి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ ప్రీక్వెల్ మాత్రం మూలాలను ఇంకా లోతుగా ఎక్స్ప్లోర్ చేస్తూ, మరింత ఇంటెన్సిటీ, భావోద్వేగం జోడించబోతోంది. ఈ సినిమా విజువల్ విజువల్ వండర్‌గా ఉండబోతోంది. సినిమాటోగ్రఫీని అర్వింద్ ఎస్. కాశ్యప్ అందిస్తుండగా, ఫస్ట్ పార్ట్‌లో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన బి. అజనీష్ లోక్నాథ్ మ్యూజిక్ ఇస్తున్నారు. హోంబాలే ఫిలిమ్స్ విజయ్ కిరగందూర్ నెక్స్ట్ లెవల్ లో నిర్మిస్తున్నారు. కులశేఖర పాత్రలో గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్ బయటికి రావడంతో సినిమా మీద మరింత హైప్ పెరిగింది. ఈ మోస్ట్ లవ్డ్ యూనివర్స్‌లో అతని రోల్ ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో అన్న ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ లో అక్టోబర్ 2, 2025న గ్రాండ్‌గా వరల్డ్‌వైడ్ రిలీజ్ కానుంది.

# నీలి నీలి ఆకాశం పాటకు సీక్వెల్ పాట



**నీలి నీలి ఆకాశం** క్రియేషన్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారాగణం తో '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ మున్నా ధులిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం 'బ్యాడ్ గాళ్' కానీ చాలా మంచోళ్లు అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఆస్కార్ విన్నర్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందిస్తుండగా మెలోడీ కింగ్ అనూప్ రూబెన్స్ తన చక్కని బాణీలతో ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్ 5 మిలియన్ వ్యూస్‌తో సోషల్ మీడియా లో ట్రెండింగ్‌లో నడుస్తోంది. ఇప్పుడు మరో మెలోడీ పాటను తెలుగు ప్రేక్షకులకు త్వరలో అందించబోతున్నారు. 'ఇలా చూసుకుంటానే' అనే పాటకి చంద్రబోస్ సాహిత్యం అందించగా సిద్ శ్రీరామ్ పాడారు. ఈ పాటకు సంబంధించి విడుదల అయిన ప్రీ టీజర్ దూసుకుపోతుంది, ఈ ప్రీ టీజర్ లో చంద్ర బోస్ గారు కూడా యాక్టింగ్ అద్భుతంగా చేశారు. ఈ చిత్ర దర్శకుడు మున్నా ధూళిపూడి మాట్లాడుతూ ఇప్పుడు 'ఇలా చూసుకుంటానే' అనే పాట 'బ్యాడ్ గాళ్స్' చిత్రం ద్వారా త్వరలో విడుదల చేస్తున్నాం. చంద్ర బోస్ గారు అందించిన లిరిక్స్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ స్వర పరిచిన పాట మరియు సిద్ శ్రీరామ్ పాడిన పాట 'నీలి నీలి ఆకాశం' పాట కంటే గొప్పగా వచ్చింది. త్వరలో విడుదల చేస్తాం. 'బ్యాడ్ గాళ్స్' అనేది పూర్తి ఎంటర్టైనర్ చిత్రం. జాతి రత్నాలు, మ్యాడ్ లాంటి హిలేరియస్ చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రం మా 'బ్యాడ్ గాళ్స్' అని తెలిపారు.

తారాగణం: అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్

సాంకేతిక బృందం: దర్శకుడు: మున్నా ధులిపూడి, బ్యానర్స్: ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్,

నిర్మాతలు: శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె ఎమ్ కుమార్, సంగీతం: అనూప్ రూబెన్స్, లిరిక్స్: ఆస్కార్ చంద్ర బోస్, సాహిత్యం: చంద్రబోస్, సినిమాటోగ్రాఫర్: ఆర్లి గణేష్, ఎడిటర్: బొంతల నాగేశ్వరరెడ్డి

# 'నేనెవరు' టైటిల్ లోగో లాంచ్



**ఇటీవల కాలంలో** చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న నటకిరీటి డా: రాజేంద్ర ప్రసాద్, 'నువ్వేకావాలి, ప్రేమించు' వంటి సూపర్ హిట్ ఫిల్మ్స్ ఫేమ్ సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్యపాత్రల్లో యువ ప్రతిభాశాలి చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సందేశభరిత వినోదాత్మక చిత్రం 'నేనెవరు?' జై చిరంజీవ మూవీ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లిఖార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంతో వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయిచెర్రి హీరోలుగా పరిచయమవుతున్నారు. దీపిక, సోనాక్షి, జబర్దస్త్ రాజమౌళి.... ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రం షూటింగ్ ముగించుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది!! త్వరలో విడుదల తేది ప్రకటించుకోనున్న ఈ చిత్రం టైటిల్ లోగోను తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షులు ప్రముఖ నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, వి.సముద్ర ఆవిష్కరించి చిత్ర యూనిట్ కి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ లోని, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగిన ఈ వేడుకలో చిత్రబృందం పాల్గొని, ఈ సినిమా తామందరికీ పేరు తెచ్చిపెడుతుందని పేర్కొన్నారు! ఈ చిత్రానికి పి.ఆర్.ఒ: ధీరజ్ అప్పాజీ, మాటలు: శ్రీనివాస్, పాటలు: ఎస్.ఎస్.వీరు, మ్యూజిక్: చిన్నికృష్ణ, ఎడిటర్: నందమూరి హరి తారకరామారావు, సినిమాటోగ్రఫీ: నాయుడు ప్రసాద్ కొల్లి, సమర్పణ: సరికొండ మల్లిఖార్జున్, నిర్మాతలు: అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి, రచన దర్శకత్వం: చిరంజీవి తన్నీరు!!



# అడవులతో పర్యావరణానికి మేలు

విలువైన జీవ వైవిధ్యానికి నెలవైన అడవులవి. పేదలైన వాటి యజమానులకు డబ్బు ఆశ చూపి అక్కడి చెట్లను కొట్టేస్తుంటారు వ్యాపారులు. పశ్చిమ కనుమల్లోని ఆ విశిష్ట అడవులతో పర్యావరణానికి మేలని భావించారు **అర్చనా జగదీష్ గాడ్బోలే**. భావించడమే కాదు, వేల ఎకరాలను కాపాడుతున్నారు. దానికోసం ఆమె ఏం చేస్తున్నారంటే...

వృక్ష పరిశోధకురాలైన అర్చన మొదట్లో 'బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా'లో శాస్త్రవేత్తగా పనిచేసేవారు. అరుదైన మొక్కల్ని గుర్తించి వాటికి పేర్లు పెట్టడం ఆమె విధులు. కానీ వృక్ష సంపదను, పర్యావరణాన్నీ పరిరక్షి ంచాలన్న ఆమె లక్ష్యం అక్కడ నెరవేరలేదు. దాంతో ఉద్యోగం వదిలి 1995లో పుణె కేంద్రంగా 'అప్లైడ్ ఎన్విరాన్మెంటల్ రిసర్చ్ ఫౌండేషన్(ఏఈఆర్ఎఫ్)'ను స్థాపించారు. ఆమె లక్ష్యం ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ నచ్చే దిశగా పనిచేస్తున్న జయంత్ శర్నాయిక్ తోడొచ్చారు. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి వివిధ మార్గాల్లో ప్రయత్నింస్తుంది ఆ సంస్థ. ఆ ప్రాజెక్టునే మహారాష్ట్రలో విస్తరించిన పశ్చిమ కనుమల్లోని ప్రైవేటు అడవుల్లో భారీగా చెట్లను నరికేస్తున్నట్టు పేర్కొన్నారు. తమ ఆర్థిక అవసరాల కోసం ఎంతో విలువైన చెట్లను వర్తకులకు అమ్మేవారు యజమానులు. దీన్ని ఆపడానికి ఓ వినూత్న పరిష్కారాన్ని చూపే అర్చన, అడవుల్లో చెట్లను కొట్టుకుంటే రైతులకు డబ్బులిస్తామని చెప్పారు. మొదట్లో వీరి మాటల్ని ఎవరూ నమ్మలేదు. అనేక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడంతో ఇది ఆచరణలోకి వచ్చింది. 2007లో 100 ఎకరాలతో చట్టబద్ధంగా మొదటి ఒప్పందం కుదుర్చుకున్నారు.



దీని ప్రకారం భూ యాజమాన్య హక్కులు రైతులకే ఉంటాయి. అయిదేళ్లపాటు రైతులు చెట్లు కొట్టరు. బదులుగా ఏడాదికి కొంత మొత్తం వాళ్లకి చెల్లిస్తారు. రత్నగిరి, పుణె, రాయగఢ్, సింధుదుర్గ్ జిల్లాల్లో ప్రధానంగా ఏఈఆర్ఎఫ్ రైతులతో పనిచేస్తోంది.

పవిత్ర తోటలు.. ఈ అడవులను పవిత్ర తోటలుగా పిలుస్తారు స్థానికులు. వీటిలో ఆలయాలు ఉంటాయి. ఒక్కో కుటుంబానికి 5-10, 50-100 ఎకరాలు ఉంటాయి. చెట్ల నుంచి వచ్చే పండ్లు, కాయలు, బెరడు... లాంటి వాటిని మాత్రం రైతులు తీసుకొని అమ్ముకోవచ్చు. మొదట్లో దీనికి నిధులు సమకూర్చడం కష్టమయ్యేది. క్రౌడ్ ఫండింగ్, స్పాన్సర్ ఏ ఫారెస్ట్... కార్యక్రమాలు చేపట్టి విజయవంతమయ్యాం. ఇప్పుడు మాకు మద్దతు తెలిపేవారు చాలామంది ఉన్నారు. గ్రామస్థుల నమ్మకాన్ని పొందడం ఇక్కడ కీలకం. ఏ చిన్న కష్టం వచ్చినా రైతులూ, గిరిజనులూ అడవులవైపే చూస్తారు. అందుకే మేమూ ఆర్థిక ప్రయోజనం చూపించాం. చెట్లను కొట్టుకుంటూ పోతే చివరకు ఆదాయమే ఉండదన్న సంగతి గుర్తుచేశాం అని చెబుతారు. ఈ అటవీ ఉత్పత్తుల్లో ఔషధ లక్షణాలు ఉన్నవాటికి ఏఈఆర్ఎఫ్ మార్కెట్‌నీ చూపుతోంది. మహారాష్ట్రలో 25 లక్షల ఎకరాలు ప్రైవేటు అడవులు ఉన్నాయి. ఏఈఆర్ఎఫ్ ద్వారా 13వేల ఎకరాల అడవులను సంరక్షి స్తున్నారు. బదులుగా కోట్ల రూపాయలు ఇస్తున్నారు. రైతులు ఒప్పందాన్ని ప్రతి అయిదేళ్లకూ సమీక్షి ంచి పునరుద్ధరిస్తారు. ఈ అడవుల వల్ల లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ పర్యావరణంలో కలవకుండా ఆగుతోంది. ఇక్కడ విభిన్న వృక్షాలే కాదు, పక్షులు, జంతువులు ఉన్నాయి. వీటితోపాటు పశ్చిమ తీరంలోని కొన్ని ప్రైవేట్ మడ అడవులు, మహారాష్ట్రలో గోండియా, ఛత్తీస్ గఢ్‌లో కేంకర్ లాంటి ప్రాంతాల్లో అడవులు సంరక్షిస్తోంది. రఫార్డ్ స్మాల్ గ్రాంట్స్ ఫౌండేషన్, ఎల్అండ్‌టీ, యాపిల్, ప్రజ్ ఇండస్ట్రీస్, ఇన్నోవేటివ్ ఇండస్ట్రీస్, పక్కా హెర్బ్స్ సహా పలు కార్పొరేట్ సంస్థలు వీరికి నిధులు అందిస్తున్నాయి. 'జీవవైవిధ్యం లేని పర్యావరణంతో లాభంలేదు. కలిసి కట్టుగా పనిచేస్తే ఎలాంటి పర్యావరణ సమస్యలకైనా పరిష్కారం చూపించవచ్చు.

# కళ్లు కళగా ఉండాలంటే..





సరిపడినంత నిద్ర లేకపోవడం, థైరాయిడ్, ఉప్పు అధికంగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవడం.. ఇలాంటి కారణాల వల్ల కళ్ల చుట్టూ వాపు, కళ్ల కింద నల్లటి వలయాలు, కళ్లు అలసిపోయి నట్లుగా కనిపించడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవి కంటి అందాన్ని దెబ్బతీస్తాయి కూడా! మరి, ఈ సమస్యలకు చెక్ పెట్టాలంటే ఈ చిన్న చిట్కాలు పాటించాలని నిపుణులు అంటున్నారు.

**కీరాదోసతో కూల్గా..** ముందుగా కీరాదోసను పలుచని చక్రాల్లా కోసుకొని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తర్వాత వాటిని తీసి కళ్ల మీద పెట్టుకొని పది నిమిషాలు రిలాక్స్ అయితే చాలు. కళ్ల చుట్టూ ఉన్న వాపు తగ్గి మోము కాంతులీనుతుంది. కీరాదోసకు బదులుగా యాపిల్ కూడా ఉపయోగించవచ్చు. ఫ్రిజ్లో భద్రపరచిన యాపిల్ తీసుకొని పలుచని ముక్కల్లా కోసి నేరుగా కళ్ల మీద పెట్టుకుంటే సరి. అందులో ఉండే ఇన్ఫ్లమేటరీ గుణాల కారణంగా కళ్ల చుట్టూ ఉన్న వాపు ఇట్టే తగ్గిపోతుంది.

**బంగాళదుంప రసంతో...** ఒక బంగాళాదుంప తీసుకొని తొక్కేసి ముక్కలుగా కోసి మెత్తగా చేసుకోవాలి. దాని నుంచి రసం వేరు చేసి అందులో దూది ముంచి కళ్ల కింద అప్లై చేసుకోవాలి. 20 నిమిషాలు అరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల కళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి వాపు తగ్గుతుంది. రోజూ రాత్రి పడుకొనే ముందు ఈ చిట్కా పాటిస్తే కళ్ల కింద నల్లటి వలయాలు కూడా తగ్గుముఖం పడతాయి.

**రోజ్ వాటర్..** రోజ్‌వాటర్‌లో ముంచిన దూదిని కళ్లపై పెట్టుకొని పలుచని వస్త్రంతో కప్పేయాలి. పావుగంట తర్వాత కళ్లను చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఫలితంగా వాపు తగ్గి, అలసిన కళ్లు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.

**బేబీ ఆయిల్ తో..** గోరువెచ్చని నీటిలో కొన్ని చుక్కల బేబీ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో ముంచి దూదిని కళ్లపై ఉంచి 15 నుంచి 20 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. బేబీ ఆయిల్ ఉండే విటమిన్ 'ఇ' వల్ల ఉబ్బిన కళ్లు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.

# సొరకాయ చపాతీలు




పాలక్ చపాతీ, ఆలూ చపాతీ, మేతీ చపాతీ ఇలా చాలా రకాలుగా రుచుల చపాతీలను చేసుకోవచ్చు. కానీ చపాతీలు చేయాలంటే.. మెత్తగా వస్తాయో రావోనని చాలామందికి భయం. పిండి సరిగ్గా కలపక పోయినా, ఇంగ్రేడియంట్స్ సమపాళ్లలో పడకపోయినా, చపాతీలు మన మాట వినవు. మరి సొరకాయ చపాతీ ఎప్పుడైనా ట్రై చేశారా? మెత్తగా దూదుల్లాంటి సొరకాయ చపాతీ ఎలా చేయాలో చూద్దాం.



**కావలసినవి :** సొరకాయ తురుము-రెండు కప్పులు, పచ్చిమిర్చి తరుగు-టీ స్పూన్, గోధుమపిండి-రెండున్నర కప్పులు, గరం మసాలా- అర టీ స్పూన్, ఉప్పు-చిటికెడు, ఇంగువ-చిటికెడు, నూనె-రెండు టేబుల్ స్పూన్లు.

**తయారీ:** వెడల్పుగా ఉన్న పాత్రలో గోధుమపిండి, సొరకాయ తురుము, తరిగిన పచ్చిమిర్చి, గరం మసాలా పొడి, ఉప్పు, ఇంగువ వేసి కలపాలి. మొదట తేమ సరిపోదనిపించినప్పటికీ సొరకాయలో నీరు వదిలేకొద్దీ సరిపోతుంది. పది నిమిషాల సేపు పక్కన ఉంచితే నీరు బయటకు వస్తుంది. నీరు వదిలిన తర్వాత పిండిని కలిపి చూసుకుని అప్పటికీ పొడిగా అనిపిస్తే కొద్దిగా నీటిని చిలకరించుకుని మిశ్రమం మొత్తాన్ని చపాతీ పిండిలా చేసుకుని వస్త్రాన్ని కప్పి పావు గంట సేపు పక్కన ఉంచాలి. పిండిని పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసుకుని చపాతీల్లా వత్తుకుని పెనం వేడి చేసి నూనె వేస్తూ చపాతీని రెండు వైపులా కాల్చాలి.

# కురులకు ముత్యాల సిరులు





ఓవైపు పేరంటాలు, మరో పెళ్లి పిలుపులు. హడావుడంతా మనదే దుస్తులు, నగలు... వీటితో సిద్ధమైనట్టేనా? పూర్తి లుక్ ఆకర్షించాలంటే కురులకీ గ్లామర్ హంగులద్దాలి. వేడుకైనా సంప్రదాయ దుస్తుల్లో సిద్ధమైనా ఆధునిక అమ్మాయినే అనిపించుకోవాలన్నది నేటి అమ్మాయిల తత్వం. అందుకే పట్టు చీర, ఓణీ కట్టినా, లెహెంగాలో సిద్ధమైనా కురుల విషయంలో మాత్రం ఆధునికతకే ప్రాధాన్యమిస్తారు. కాస్త చిన్న, మధ్యస్థ పొడవుంటే హెయిర్ లీవ్‌కి మించిన ఉత్తమ మార్గం మరొకటి ఉంటుందా చెప్పండి? అలాగని ఓ పఫ్, రెండు క్లిప్పులతో వదిలేస్తే బాగుంటుంది? అందుకే కురులనీ ఆకర్షించేలా ఎన్నో ఆప్షన్లు. ఈ పెరల్ క్లిప్స్ అలాంటివే నల్లని కురులపై తెల్లగా మెరుస్తూ భలే అందంగా ఉన్నాయ్ కదూ? వాటి ఆకర్షణ మరింత పెంచుతూ కుందన్లు, రంగుల రాళ్లు, గవ్వలు వగైరా మరింత జత కుదిరాయి. చూడటానికి భారీతనం తెస్తూ చక్కగా ఉన్నావు కానీ... ఇవి దగ్గరుంటే సిద్ధమవడమూ చిటికేసినంత సేపే! కర్ల్స్, మెస్సీ, స్ట్రెయిట్... ఏరకంగా స్టైలింగ్ చేసుకుంటూ హెయిర్ లీవ్ చేసి సరే! చివర్లో వీటిని తగిలిస్తే చాలు. కురులకే కాదు... మీకూ స్టైలిష్ లుక్‌ని ఇస్తాయి. ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంది. త్వరలో వేడుక ఉందా? స్పెషల్‌గా కనిపించడం తప్పనిసరా? అయితే ఇంకేం ఈ పెరల్ యాక్సెసరీలను తెచ్చేసుకోండి. చిటికెలో సిద్ధమైపోండి

**చెలిచిట్కా**

తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్దన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది.

# వ్యథ: ఒత్తిడి వల్ల అతిమూత్రం



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** నా వయస్సు 40 ఏళ్లు. ఒక ప్రైవేటు సంస్థలో కీలకమైన బాధ్యత నిర్వహిస్తున్నాను. దీనివల్ల కొంత మానసిక ఒత్తిడి ఉంటుంది. చెడు అలవాట్లు ఏవీ లేనప్పటికి రోజు నాలుగైదు సార్లు కాఫీ తాగుతుంటాను. పని ఒత్తిడి వల్ల ఒక్కోసారి వేళ తప్పి భోజనం చేస్తుంటాను. దీనివల్ల కొంతవరకు జీవనశైలి గాడి తప్పిందని చెప్పవచ్చు. గత మూడునెలల నుంచి మూత్ర విసర్జన సమస్య తలెత్తింది. పగలు ఎన్నిసార్లు మూత్ర విసర్జన చేసినా సమస్య అనిపించదు. కానీ రాత్రులో నాలుగైదు సార్లు మూత్ర విసర్జన కోసం లేవాల్సి వస్తోంది. దీని వల్ల నిద్ర సరిపోవడం లేదు. రాత్రి 11 గంటలకు పడుకుని ఉదయం ఐదు గంటలకు నిద్రలేవవలసి వస్తోంది.



అయితే మూత్ర విసర్జన సమస్య వల్ల నిద్ర చాలడం లేదు. దీని వల్ల పగలు అలసట, విసుగు, కోపం వస్తున్నాయి. ఒక్కో సారి నీరసంగా ఉంటోంది. ఈ లక్షణాలను బట్టి మధుమేహ సమస్య తల ఎత్తి ఉంటుందని మిత్రులు చెప్పారు. డాక్టరును కలిసి పరీక్షలు చేస్తే షుగర్ లెవెల్స్ సక్రమంగా ఉన్నట్టు తేలింది దీనితో ఇతర ఆరోగ్య పరీక్షలు చేశారు. శారీరకంగా ఎలాంటి లోపాలు లేవని చెప్పారు. మానసిక ఒత్తిడి, నిద్రలేమి, అతిగా టీ కాఫీలు, మద్యం సేవించడం కూడ కారణం కావచ్చని డాక్టరు చెప్పారు. ఆయన చెప్పిన లక్షణాలు లేదా కారణాలలో మూడు ఉన్నాయని చెప్పాను. ఎక్కువగా ఎసి రూములో ఉండటం కూడ ఒక కారణం కావచ్చని మరీ తక్కువగా కాకుండా చూసుకోమని సలహా ఇచ్చారు. అలాగే సైకాలజిస్టును కలిసి కౌన్సెలింగ్ తీసుకోమన్నారు. ఒత్తిడి నిర్వహణ పద్ధతులు పాటించమన్నారు. నాలో ఒత్తిడి తగ్గడానికి, నిద్రబాగా పట్టడానికి, మూత్రవిసర్జన సమస్య తగ్గడానికి తగిన సలహాలు ఇవ్వండి. **- ఒక సోదరి, కడప.**

**జవాబు :** అమ్మా సహజంగా ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది అనగానే అందరికి గుర్తుకు వచ్చేది మధుమేహమే. అయితే ఇతర కొన్ని శారీరక సమస్యలు ఇందుకు కారణం కావచ్చు. అలాగే ఇతర జబ్బుల కోసం వాడే మందుల వల్ల సమస్య తల ఎత్తవచ్చు. అయితే డాక్టరు పరీక్షలు చేసి శారీరక సమస్యలు ఏవీ లేవని చెప్పడం వల్ల మానసిక కోణంలో ఆలోచించాలి. అలాగే అలవాట్లు లేదా జీవన శైలిని పరిశీలించాలి. మీ సమస్యకు మానసిక ఒత్తిడి, అలవాట్లు కారణంగా భావించవచ్చు. ఒత్తిడి వల్ల అతి మూత్ర సమస్య తలెత్తే అవకాశం ఉంది. అలాగే భయం ఆందోళన వల్ల కూడ మూత్ర విసర్జన జరిగే అవకాశం ఉంది. టీ, కాఫీలు ఎక్కువగా తాగడం వల్ల అందులోని కెఫిన్‌వల్ల కూడ సమస్య రావచ్చు. రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్ర అవసరం ఉంటుంది. కొందరికి గంట తగ్గినా పరవాలేదు. మీరు రోజు ఆరు గంటలే నిద్రపోతున్నారు. మూత్ర సమస్యవల్ల ఆ సమయం కూడ తగ్గపోతున్నది. దీని వల్ల శరీరం మరింత ఒత్తిడికి గురి అవుతుంది. దీనితో నీరసం, నిస్సత్తువ, చిరాకు, కోపం తలెత్తుతుంది. కాబట్టి మీరు సాయంత్రం నాలుగు లేదా ఐదు గంటల తరువాత టీ, కాఫీలు తాగడం మానేయండి. సాయంత్రం తప్పని సరిగా వాకింగ్ లేదా చిన్న వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోండి. రాత్రి సమయాలలో నీరు తక్కువగా తాగండి. ఎసి గదిలో పడుకునే టట్టు అయితే మరీ తక్కువ కాకుండా సాధారణ ఉష్ణోగ్రత కంటే కొద్ది తక్కువగా పెట్టుకోండి. నిద్ర పోయే సమయం పెంచుకోండి సమయ పాలన పనుల్లో ప్రాధాన్యత క్రమం పాటించండి. ధ్యానం లేదా ఇతర ఉప శమన మార్గాలు పాటించండి. అవసరం అయితే కొద్ది రోజులు మందులు వాడండి.

# తాజాదనం ఎక్కువసేపు..

ఎంత మదిదోచే పెర్ఫ్యూమ్ అయినా.. కాసేపటికే దాని ప్రభావం తగ్గిపోతుంది. అలా కాకుండా ఎక్కువసేపు పరిమళాలు వెదజల్లుతూ.. మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచాలంటే..

**మెడ చుట్టూ :..** ఇక్కడ రక్తనాళాలు చర్మ ఉపరితలానికి దగ్గరగా ఉంటాయి. అందుకే మెడ దగ్గర స్ప్రే చేస్తే పరిమళం చక్కగా వ్యాపిస్తుంది. ఎక్కువ సేపు ఆ తాజాదనం నిలిచి ఉంటుంది. కానీ రాళ్లు పొదిగిన ఆభరణాలపై పడితే వాటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది.

**చెవుల వెనుక :** ఇక్కడ చర్మం చలా సున్నితంగా ఉంటుంది. సువాసన నిలిచి ఉండాలన్నా, వ్యాపించాలన్నా పరిమళాన్ని అక్కడ స్ప్రే చేయాలి. పార్టీలు, వేడుకలప్పుడు.. ఆత్మీయులతో కాస్త దగ్గరగా మసులు తుంటాం కాబట్టి ఈ విధంగా ప్రయత్నించి చూడండి. అలాగని అతిగా ఉపయోగించొద్దు. చర్మానికి హాని కలగొచ్చు. తలనొప్పి వంటి సమస్యలూ ఎదురవుతాయి.

**మణి కట్టు :** చర్మం సున్నితంగా ఉంటుందిక్కడ. ఇక్కడ పెర్ఫ్యూమ్ రాసి, రుద్దితే.. చేతి కదలికల వల్ల సువాసన వ్యాపిస్తుంది. రోజంతా తాజాగా ఉన్న భావన కలుగుతుంది.

**మోకాళ్ల వెనుక :** ఈ ప్రాంతంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ పెర్ఫ్యూమ్ రాసి, రుద్దితే.. చేతి కదలికల వల్ల సువాసన వ్యాపిస్తుంది. రోజంతా తాజాగా ఉన్న భావన కలుగుతుంది.

**మోకాళ్ల వెనక :** ఈ ప్రాంతంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ స్ప్రే చేస్తే సుమాసన చుట్టుపక్కలకు సులభంగా వ్యాపిస్తుంది.

# ఒకసారి శరణు వేడిన చాలు!



ఆధ్యాత్మికం

**నల్ల మస్తాన్ గారు** గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవద్ధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి, మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు.

షిరిడీలోని ద్వారాకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంటబడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా



వర్తిస్తుంది. అది ద్వారకామాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు - భీతికి తావు ఉండదు.

**- యం.పి.సాయినాథ్**

### మహిళల ఛాంపియన్‌షిప్

# తొలి మ్యాచ్‌లో విజయం




**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 17, మహిళల ఛాంపియన్‌షిప్ 2025లో ప్రారంభ మ్యాచ్‌లో భారత్ నేపాల్‌ను ఓడించింది. భూటాన్‌లోని థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో బుధవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు నేపాల్‌పై 7-0 తేడాతో విజయం సాధించి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది. భారత్ తరపున అబిస్టా బస్నెట్ (16, 41), నీరా చాను లాంగ్‌జామ్ (25, 56), అనుష్క కుమారి (33, 62), జులన్ నోంగ్‌మైథెమ్ (45+1) గోల్స్ చేశారు. యువ ట్రైగ్రెస్‌లు మొదటి అర్ధభాగాన్ని 5-0 ఆధిక్యంతో ముగించాయి. 16వ నిమిషంలో అబిస్తా బాస్నెట్ గోల్ చేయడం మ్యాచ్‌కు ఊపునిచ్చింది. కాగా 2023లో జరిగిన మ్యాచ్‌లో భారత్ నేపాల్‌ను 4-1 తేడాతో ఓడించింది. తాజా విజయం నేపాల్‌పై భారత్ అజేయ పరంపరను కొనసాగించింది. ఇక ఈ టోర్నమెంట్ ఫార్మాట్‌లో నాలుగు జట్లు భారతదేశం, నేపాల్, బంగ్లాదేశ్, ఆతిథ్య భూటాన్ డబుల్ రౌండ్‌రాబిన్ లీగ్‌లో ఒకదానితో ఒకటి ఆడతాయి. ఇది ఏడవ టోర్నమెంట్. ప్రతి జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ నెల 31న జరిగే చివరి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు ఛాంపియన్‌గా నిలుస్తుంది. భారత్ ఈ నెల 22న బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# సురుచి, సౌరభ్ జోడీకి కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జంట సురుచి సింగ్ మరియు సౌరభ్ చౌదరి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో బుధవారం జరిగిన ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఈ జంట 4 పాయింట్ల లోటు నుండి పుంజుకుని సత్తా చాటింది. మొదటి కాంస్య పతక మ్యాచ్‌లో చైనీస్ తైపీ జోడీ హెంగ్ యులియు మరియు హ్సియాంగ్ చెన్‌హ్సీహాలను 17-9 స్కోరుతో ఓడించింది. అర్హత రౌండ్‌లో, భారత జంట మొత్తం 578 (20+)తో 5వ స్థానంలో నిలిచింది. ఇందులో సురుచి 292తో టాప్ స్కోరర్‌గా నిలవగా, సౌరభ్ 286తో వెనుకబడి ఉన్నాడు. ఇక రెండో భారత జంట పాలక్ గులియా మరియు ఆదిత్య మల్రా పతక పోరులో పాల్గొనలేకపోయారు. అర్హత రౌండ్‌లో మొత్తం 575 (20+) పాయింట్లతో 10వ స్థానంలో నిలిచారు. కాగా సీనియర్ పోటీలో ఇది భారతదేశానికి నాల్గవ పతకం, 1 రజతం మరియు 3 కాంస్య పతకాలు సాధించింది. జూనియర్ ఎయిర్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, భారత జంట వంశిక చౌదరి మరియు జోనాథన్ గవిట్ మొత్తం 578 (18+) పాయింట్లతో బంగారు పతక పోరులో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.




### యూరప్ స్మాష్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు

# మనుష్, దియా జోడీ

### శ్రీజ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** యూరప్ స్మాష్-2025లో భారత్ మిక్స్‌డ్ జోడీ మనుష్-దియా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి, తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ టోర్నీ నుండి నిష్క్రమించింది. అలాగే మహిళల డబుల్స్‌లో దియా చిటాలే-యశస్విని ఘోర్పడే ద్వయం రెండో రౌండ్‌కు చేరుకున్నారు. స్వీడన్‌లోని మాల్మో అరీనాలో బుధవారం జరిగిన ఈవెంట్‌లో ఆరో సీడ్, భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా-దియా చిటాలే క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

ఈ జంట బలమైన సింగపూర్ జంట యూ ఎన్ కోయెన్ పాంగ్-జెంగ్ జియాన్‌లను 11-8, 11-7, 8-11, 12-10 తేడాతో నాలుగు గేమ్‌లలో ఓడించి, ఈ ఏడాది మూడవ డబ్ల్యూటిటి గ్రాండ్ స్మాష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. తదుపరి ఈ నెల 21వ తేదీన జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో రొమేనియన్ ద్వయం ఎడ్వర్డ్ ఐయోనెస్కు-బెర్నాడెట్ స్జోక్స్‌తో తలపడనున్నారు. మరోవైపు, మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి ఆకుల శ్రీజ రెండో రౌండ్‌లో ఏడో సీడ్ జు యులింగ్ (మకావో) చేతిలో 9-11, 8-11, 11-6, 2-11 తేడాతో ఓడిపోవడంతో ముగిసింది. ఇక మహిళల డబుల్స్ విభాగంలో దియా చిటాలే-యశస్విని ఘోడ్పాడేతో కలిసి తొలి రౌండ్ విజయాన్ని సాధించి, ఈజిప్టు ద్వయం హనా గోడా-దినా మెష్రెఫ్‌లను ఓడించింది. ఈ జంట 11-6, 11-7, 11-5 తేడాతో వరుస గేమ్‌ల విజయం సాధించి 16వ రౌండ్‌కు చేరుకుంది.

### అసియా కప్ టీంలో..

# బ్యాడ్‌లక్ హీరోస్

### ఒక్క మ్యాచ్‌కూ నో ఛాన్స్.. భారత్ జట్టులో స్టాండ్‌బై ఆటగాళ్లు




**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో పాల్గొనేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తన 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ టోర్నీ కోసం ఎంపిక చేసిన భారత్ జట్టులో అనుభవంతో పాటు, ఇప్పటి వరకూ ఈ టోర్నీలో బెర్త్ దక్కించుకోని యువకులకూ గొప్ప మిశ్రమంగా మారింది. ఈ జట్టును నడిపించే బాధ్యత సూర్యకుమార్ యాదవ్ చేతుల్లో ఉంటుంది. అతను కొంతకాలంగా ఈ ఫార్మాట్‌లో టీమ్ ఇండియాకు నాయకత్వం వహిస్తున్నాడు. అదే సమయంలో, శుభ్‌మాన్ గిల్ కూడా టీ20 జట్టులోకి తిరిగి వచ్చాడు. అతను వైస్ కెప్టెన్ బాధ్యతను కూడా వ్యవహరిస్తాడు. దీంతో పాటు, ఈ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేని ఐదుగురు ఆటగాళ్లను కూడా బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేశారు. 15 మంది సభ్యుల జట్టుతో పాటు, ఐదుగురు ఆటగాళ్లను స్టాండ్‌బైగా బీసీసీఐ ఎంపిక చేసింది. వీరిలో ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ ఉన్నారు. స్టాండ్‌బై ఆటగాళ్లను ప్రధాన జట్టులో చేర్చలేదు. కాబట్టి వారికి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభించదు. అయితే, జట్టుకు అవసరమైతే, ఈ ఆటగాళ్లలో ఎవరినైనా ప్రధాన జట్టులోకి తీసుకోవచ్చు. అప్పుడు వారు ప్లేయింగ్ 11లో కూడా భాగం కావొచ్చు. స్టాండ్‌బై ఆటగాళ్ళు నేరుగా టోర్నమెంట్‌లో పాల్గొనరు. కానీ, వారు జట్టుకు బలమైన బ్యాకప్‌గా ఉంటారు.

ప్రధాన జట్టులోని ఒక ఆటగాడు గాయం లేదా ఇతర కారణాల వల్ల టోర్నమెంట్‌కు దూరంగా ఉంటే, ఈ స్టాండ్‌బై ఆటగాళ్లకు అవకాశం లభిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో, అవసరమైతే జట్టుకు మ్యాచ్ విన్నర్లుగా నిరూపించగల ఆ ఐదుగురు ఆటగాళ్లను బిసిసిఐ స్టాండ్ బైలో ఉంచింది. ప్రసిద్ధ్ కృష్ణ తన ఫాస్ట్ బౌలింగ్‌తో, వాషింగ్టన్ సుందర్ తన ఆల్ రౌండ్ సామర్థంతో, రియాన్ పరాగ్, యశస్వి జైస్వాల్ తమదూకుడు బ్యాటింగ్‌తో, ధ్రువ్‌జురెల్ తన వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌తో ఎప్పుడైనా జట్టులో చేరడానికి సిద్ధంగా ఉంటారు.



# తొలి వన్డేలో దక్షిణాఫ్రికా విజయం

### 98 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా చిత్తు

**న్యూఢిల్లీ:** తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా విజయం సాధించింది. కైర్న్స్‌లో వన్డే ఇంటర్నేషనల్ సిరీస్ తొలి మ్యాచ్‌ను 98 పరుగుల తేడాతో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (81 బంతుల్లో 82, 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65, 5 ఫోర్లు), మాథ్యూ బ్రీజ్కె (56 బంతుల్లో 57, 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. రికెల్టన్ (33, 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్, 2 ఫక్షర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. కేశవ్ మహరాజ్ 5 వికెట్లుతో చెలరేగి ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేల్ చేశాడు. దీంతో 40.5 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88, 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), అరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27, 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్ ఏడో వికెట్‌కు ద్వార్షుయ్ (52 బంతుల్లో 33, 3 ఫోర్లు) తో కలిసి 71 పరుగులు జోడించాడు. దక్షిణాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ లబుషేన్ (1)తో పాటు, కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను ఔట్ చేశాడు.

## వాణిజ్యం



# స్వల్ప నష్టాల్లో సూచీలు, సెన్సెక్స్‌లు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగా దేశీయ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. ఉదయం వేళల్లోనే సెన్సెక్స్ 108పాయింట్లు నష్టపోయి 81,536, నిఫ్టీ 33పాయింట్లు కుంగి 24,947వద్ద కొనసాగుతున్నాయి. అయితే గెలాక్సీ సర్ఫాక్ట, పిఎస్ గాడ్గిల్ జ్యువెలర్స్, మాక్స్ ఎస్టేట్, లాయిడ్స్ మెటల్స్ లాభాల్లో ఉండగా..నజరా టెక్నాలజీస్, డెల్టాకార్ప్, సిఎస్‌బి బ్యాంక్, పవర్ మైక్ ప్రాజెక్ట్స్ నష్టాల్లో ఉన్నాయి. నాలుగు రోజులుగా సూచీలు భారీగా పెరగడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఈ క్రమంలో రూపాయి మారకం విలువ భారీగా పతనమై ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిన్నటితో రూ.86.95తో పోలిస్తే 21పైసలు తగ్గి రూ.87.16వద్ద ఉంది. ఇక ఆసియాలో ఫసిపిక్ మార్కెట్ ప్రధాన సూచీలు ఆస్ట్రేలియా ఎసిఎక్స్200, న్యూజిలాండ్ ఎస్‌జెడ్‌ఎక్స్ 50 మినహా మిగిలిన ప్రధాన సూచీలన్ని కుంగాయి. చైనాకు చెందిన షాంఘై, జపాన్, నిక్కీ, హాంకాంగ్, హెచ్‌ఎస్ఐ, దక్షిణ కొరియా కోస్పి, తైవాన్ సూచీలు పతనమయ్యాయి.

### ఎగుమతుల్లో సత్తాచాటుతున్న

# తెలుగు రాష్ట్రాలు



**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** కొంత కాలంగా ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. గతంలో ఎక్కువగా ధాన్యం, ఎలక్ట్రానిక్స్, ఔషధాల ఎగుమతుల్లో ముందుండగా ఇటీవలి కాలంలో ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తిలో ముందు వరుసలో ఉంటున్నాయి. ఇప్పుడు ఏపీ, తెలంగాణ వరుసగా 6,7 స్థానాల్లో నిలవగా.. త్వరలో టాప్ 5 లో చోటు దక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎగుమతుల్లో సత్తా చాటుతున్నాయి. కొంత కాలంగా చూస్తే ఆసక్తికర వృద్ధిని కనబరుస్తున్నాయని చెప్పొచ్చు. ఇక్కడ ప్రతి సంవత్సరం ఎగుమతులు పెరగడమే కాకుండా.. ఎగుమతుల శ్రేణి కూడా విస్తరిస్తూ వస్తోంది. ఇంకా తెలుగు రాష్ట్రాల నుంచి చాలా ఏళ్లుగా ఎక్కువగా ఎగుమతి అవుతున్నటువంటి వస్తువుల జాబితాలో వ్యవసాయ ఉత్పత్తులో ముందుంటూ వచ్చాయి. ఇప్పుడు మాత్రం పరిస్థితి మారుతోంది. దానిని దాటేసి ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. దీనికి తోడు ఫార్మా ప్రొడక్ట్స్ (ఔషధాలు), కెమికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ఎగుమతులు కూడా ఎగబాకుతూనే ఉన్నాయి. ఇటీవలి పరిస్థితుల్ని గమనిస్తే ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సాధిస్తున్న ప్రగతి దేశానికే ఆదర్శంగా ఉంది. రాబోయే రోజుల్లో ఈ ఉత్పత్తులకు సంబంధించి ఇంకా మెరుగైన రికార్డులు నమోదవుతాయని, అందుకు తగిన పరిస్థితులు ఇక్కడ ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇక గత ఆర్థిక సంవత్సరం (2024-25) అత్యధికంగా ఎగుమతులు సాధించిన రాష్ట్రాల లిస్టులో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉండగా తెలంగాణ ఏడవ స్థానంలో నిలిచింది. త్వరలోనే ఈ రెండు రాష్ట్రాలు టాప్5లోకి వచ్చే అవకాశం ఉందని కూడా అంచనా వేస్తున్నారు. మన దేశంలోనే తెలంగాణ రాష్ట్రం.. అంతరిక్ష, రక్షణ రంగ పరిజ్ఞానానికి వెన్నెముకగా నిలుస్తోందనే మాట వినిపిస్తోంది. రక్షణ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ మూలకేంద్రంగా ఉంది. మిధాని, తీదీలి, దీళిదీలి వంటి సంస్థలు ఉండటమే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా ఎన్నో సంస్థలు కీలక రక్షణ ఉత్పత్తుల్ని భారత సైన్యానికి అందిస్తున్నాయి. ఇంకా పెద్ద ఎత్తున విదేశాలకు ఎగుమతి కూడా చేపట్టాయి.

### ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్

# 'గోల్డ్' పథకాలు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ రెండు సరికొత్త కొత్త గోల్డ్ పథకాలను ప్రారంభించింది. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసినట్లు ఎంఎంసి వెల్లడించింది. పథకాల సబ్‌స్క్రిప్షన్స్ బుధవారం మొదలైనట్లు వివరించింది. ఇందులో కనీస సిప్ పెట్టుబడి రూ. 250 ఉండగా, లాంగ్ సిప్ పెట్టుబడి రూ. 1000గా ఉంది. బంగారం ఆధారితంగా రిటర్న్లు అందించేలా గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్ తీసుకొచ్చింది. అవే ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ( ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఉన్నాయి. దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలను ట్రాక్ చేస్తూ రిటర్న్లు అందించేలా ఈ ఫండ్స్ తీసుకొచ్చినట్లు ఏజెంల్ వన్ తెలిపింది. ధరల్లో పారదర్శకత, సులభంగా పెట్టుబడి పెట్టే అవకాశాన్ని తమ ఇన్వెస్టర్లకు కల్పిస్తున్నట్లు



వెల్లడించింది. సబ్‌స్క్రిప్షన్స్ సెప్టెంబర్ 3, 2025 వరకు కొనసాగుతుంది. ఎన్‌ఎఫ్‌ఓ ముగిసిన తర్వాత సైతం ఇదే పెట్టుబడితో యూనిట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపింది. అలాగే డిమ్యాట్ అకౌంట్ లేకున్నప్పటికీ బంగారంపై పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని ఈ ఫండ్స్ కల్పిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే ఇందులో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పెట్టుబడి ఉంటుంది. బంగారం ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలో ఆయా లాభాలను అందుకునేలా ఈ రెండు ఫండ్స్ అవకాశం కల్పిస్తున్నారు. స్కీమ్‌లో ఎన్‌ఎస్‌ఈలో లిస్ట్ అవుతుంది. 99.5 శాతం ప్యూర్ గోల్డ్ ప్రకారం ట్రేడింగ్ నిర్వహిస్తుంది. దీంతో మేకింగ్ ఛార్జ్, స్టోరేజ్ రిస్క్ ఉండదని తెలిపింది. అలాగే ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సిప్ పెట్టుబడి రోజుకు రూ.250, వారానికి, 15 రోజులకు, నెల రోజులకు రూ.500గా నిర్ణయించగా మూడు నెలలకు ఒకసారి రూ. 1500గా నిర్ణయించినట్లు ఏఎంసీ తెలిపింది.





# ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 80% బోనస్ పెంపు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ప్రముఖ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు భారీ వేతనాలు పెంచింది. ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికానికి పనితీరు ఆధారిత బోనస్‌లను ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు సగటున 80శాతం చొప్పున చెల్లించనుంది. ఆగస్టు నెల వేతనంతో మొత్తం ఇవ్వనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇందుకై ఇంటర్నల్‌గా మెస్సేజ్‌లను పంపిస్తుంది. అయితే క్యూ1లో మెరుగైన పనితీరు నేపథ్యంలో కంపెనీ ఈ స్థాయిలో బోనస్‌లను ప్రకటించడం విశేషం. పనితీరు ఆధారంగా చెల్లింపులు లెవల్ పీఎల్4 ఉద్యోగుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి అత్యధికంగా 89శాతం బోనస్ చెల్లిస్తారు. అంచనాలు అందుకున్న ఉద్యోగులకు 80శాతం చొప్పున చెల్లింపులు చేయనున్నారు. అలాగే లెవల్, పిఎల్5, లెవల్ పిఎల్6 ఉద్యోగులకు 78-87శాతం, 75-85 శాతం చొప్పున చెల్లిస్తారు. పీఎల్4, పిఎల్5, పిఎల్6 కేటగిరిల్లో దృష్టిసారించాల్సిన ఉద్యోగులకు కూడా 80 శాతం, 75, 70, శాతాల చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు ఇంటర్నల్ మెమోలో ఇన్ఫోసిస్ తెలిపింది.

వ్యక్తిగత బోనస్ లెటర్లను ఉద్యోగుల ఇ-డాకెట్స్‌లో అప్‌లోడ్ చేస్తామని వివరించిదంది. అయితే జులై 23న వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో సంస్థ అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.7శాతం వృద్ధి చెంది రూ.6921 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7.5శాతం వృద్ధితో రూ.42,279 కోట్లుగా పేర్కొంది. రెండు మెట్రిక్స్‌లోనూ అంచనాలను మించిన పనితీరు కంపెనీ సాధించింది.

# టిసిఎస్‌లో లేఆఫ్‌లపై ఆందోళనలు!

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో తలపెట్టిన లేఆఫ్‌లను యూనియన్ ఆఫ్ ఐటీ, ఐటీఈఎస్ ఎంప్లాయిస్ (యునైట్) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. లేఆఫ్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతుంది. అయితే లేఆఫ్‌ల కారణంగా దాదాపు 30వేల మందిపై ప్రభావం పడుతుందని యూనియన్ ఆరోపించగా టిసిఎస్ స్పందించింది. కేవలం 12వేలమంది




ఉద్యోగులను తొలగించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా చెన్నైలో ఆందోళన చేపట్టారు. టిసిఎస్ సీనియర్, మేనేజర్‌స్థాయి ఉద్యోగులను తొలగిస్తుందని, దీంతో సుమారు 30వేల నుంచి 40వేల మందిపై ప్రభావం ఉంటుందని యునైట్ సభ్యురాలు జనని ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులైన స్థానంలో కొత్త వాళ్లను 80 నుంచి 85శాతం తక్కువ జీతానికి నియమించుకుంటుందని యునైట్ ఆరోపిస్తుంది. ఉద్యోగులను తొలగించే బదులు వారి నైపుణ్యాలను పెంచాలని డిమాండ్ చేసింది. రూ.2.55లక్షల కోట్ల ఆదాయం కలిగిన కంపెనీ లాభార్జన కోసం ఉద్యోగులను తొలగించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేసింది. 30వేల మందిని తొలగిస్తున్నామనే ఆరోపణలను టిసిఎస్ ఖండించింది. ముందస్తుగా చెప్పినట్లు కేవలం 2శాతమే దాదాపు 12వేలమందిని తొలగించనున్నట్లు పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.